జాతీయ తెలుగు దినపత్రిక

# ప్రజాజ్యోతి

ప్రతి అక్షరం ప్రజల కోసం

ఆదిలాబాద్, హైదరాబాద్ | ఆదివారం 19 జూలై 2026 | సంపుటి: 19 | సంచిక: 134 | పేజీలు: 12 | వెల: రూ.3 | RNI No : TELTEL/2008/24799

పరాభవ నామ సంవత్సరం , ఆషాఢ మాసము , తిథి: పాడ్యమి - 11:53:40 వరకు నక్షత్రంపుష్యమి - 21:47:53 వరకు కరణంబవ - 11:53:40 వరకు, బాలవ - 22:21:00 వరకు పక్షంశుక్ల యోగంహర్షణ - 08:04:35 వరకు, వజ్ర - 28:30:30 వరకు

Published from ADILABAD, RANGAREDDY (HYDERABAD), NIZAMABAD, WARANGAL http://www.prajajyothinews.com Mail: prajajyothidaily@gmail.com


## జాతీయ చలనచిత్ర అవార్డుల ప్రకటన

**ఉత్తమ ప్రాంతీయ చిత్రంగా 'కమిటీ కుర్రోళ్ళు'**

**విజువల్ వండర్ 'కల్కి 2898 ఏడీ'కి రెండు కేటగిరీల్లో అవార్డులు**

న్యూఢిల్లీ,జూలై18(ప్రజాజ్యోతి): 72వ జాతీయ చలనచిత్ర పురస్కారాల్లో తెలుగు చిత్రాలు అదరగొట్టాయి. 2024 సంవత్సరానికి గానూ వివిధ కేటగిరీల్లో పలు తెలుగు చిత్రాలకు అవార్డులు దక్కాయి. ఉత్తమ ప్రాంతీయ చిత్రంగా 'కమిటీ కుర్రోళ్ళు' ఎంపికైంది. అంతేకాదు, ఉత్తమ మేకప్ విభాగంలోనూ అవార్డు వరించింది. కొత్త నటులతో

## ఫాల్కన్ గ్రూప్ సిఎండి అమర్‌దీప్ అరెస్ట్

హైదరాబాద్,జూలై18(ప్రజాజ్యోతి): ఫాల్కన్ గ్రూప్‌కు సంబంధించిన మనీలాండరింగ్ కేసులో కీలక పరిణామం చోటుచేసుకుంది. ఫాల్కన్ సీఎండీ అమర్‌దీప్ కుమార్‌ను ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ అధికారులు అరెస్ట్ చేశారు. ఢిల్లీలోని తీహార్ జైలు నుంచి హైదరాబాద్‌కు తీసుకొచ్చి అమర్‌దీప్ అరెస్ట్‌ను చూపించారు అధికారులు. అనంతరం ఫాల్కన్ సీఎండీని న్యాయస్థానంలో హాజరుపరచగా.. కోర్టు ఆయనకు 14 రోజుల జ్యుడీషియల్ రిమాండ్

మిగతా 2లో..



## దొరల గడీల ముందు మోకరిల్లని

# కవి అందెశ్రీ

## అందెశ్రీని, గద్దర్‌ను అవమానించిన కెసిఆర్

- వేల ఎకరాల్లో ఫామ్‌హౌజ్‌లతో కులకుతున్న నేతలు
- నేనున్నంత వరకు బిఆర్‌ఎస్ అధికారంలోకి రావడం కల్ల
- నిరుద్యోగులను మోసం చేసిన ఘనులు బిఆర్‌ఎస్ నేతలు
- అందెశ్రీ స్మృతివనం శంకుస్థాపనలో సిఎం రేవంత్ విమర్శలు

దొరల గడీల ముందు మోకరిల్లనని ధైర్యంగా చెప్పిన కవి అందెశ్రీ అని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. ప్రముఖ కవిగా, గాయకుడిగా తెలంగాణ సమాజానికి సుపరిచితులైన ఆయన.. తనకు ఆత్మబంధువని చెప్పారు. ఆయన జయంతి సందర్భంగా రంగారెడ్డి జిల్లా ఘట్‌కేసర్‌లో 'అందెశ్రీ స్మృతివనం' నిర్మాణానికి సీఎం రేవంత్‌రెడ్డి భూమి పూజ చేశారు.




హైదరాబాద్,జూలై18(ప్రజాజ్యోతి): దొరల గడీల ముందు మోకరిల్లనని ధైర్యంగా చెప్పిన కవి అందెశ్రీ అని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. ప్రముఖ కవిగా, గాయకుడిగా తెలంగాణ సమాజానికి సుపరిచితులైన ఆయన.. తనకు ఆత్మబంధువని చెప్పారు. ఆయన జయంతి సందర్భంగా రంగారెడ్డి జిల్లా ఘట్‌కేసర్‌లో 'అందెశ్రీ స్మృతివనం' నిర్మాణానికి సీఎం రేవంత్‌రెడ్డి భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. అందెశ్రీని ఆనాటి ప్రభుత్వం ఎంతో నిర్లక్ష్యం చేసిందన్నారు. ప్రజా గాయకుడు గద్దర్‌ను కూడా ప్రగతిభవన్ గేటు ఎదుట ఎర్రటి ఎండలో నిలబెట్టారని విమర్శించారు. వారిద్దరన్నీ అవమానించినప్పుడే దొరలను సాగనంపాలని జనం నిర్ణయించుకున్నారని అన్నారు. ఈ సందర్భంగా అందెశ్రీతో తనకున్న అనుబంధాన్ని గుర్తుచేసుకున్న సీఎం, ఆయన తనకు ఆత్మబంధువని, కుటుంబ సభ్యుడిగా, పెద్దన్నగా భావించానని అన్నారు. అందెశ్రీ పాటలు లక్షలాది మందిలో తెలంగాణ ఉద్యమ స్ఫూర్తిని నింపాయని, తనలోనూ ఉద్యమ చైతన్యాన్ని రగిలించాయని పేర్కొన్నారు. గడీల ముందు మోకరిల్లనని చెప్పిన కవి అందెశ్రీ

మిగతా 2లో..

## విక్రమ్-1 రాకెట్ ప్రయోగం విజయవంతం

- భారత అంతరిక్ష రంగంలో సరికొత్త అధ్యాయం
- స్కైరూట్ ఏరోస్పే 'విక్రమ్-1' రాకెట్ ప్రయోగం విజయవంతం
- తొలుత ఇంధన ప్రక్రియలో సాంకేతిక లోపం
- అరగంటలోపే సరిదిద్ది పూ÷-రయోగాన్ని పూర్తి చేసిన షార్
- ప్రైవేట్ రంగంలో తొలి రాకెట్ కావడంతో సర్వత్రా హర్షం
- ప్రయోగాన్ని వీక్షించిన లోకేశ్, ఇస్రో మాజీ శాస్త్రవేత్తలు

శ్రీహరికోట,జులై18(ప్రజాజ్యోతి): భారత అంతరిక్ష రంగంలో సరికొత్త అధ్యాయం ప్రారంభమైంది. శ్రీహరికోట షార్ అంతరిక్ష కేంద్రం నుంచి చేపట్టిన ప్రయోగం విజయవంతం అయ్యింది. హైదరాబాద్‌కు చెందిన ప్రముఖ ప్రైవేట్ స్పేస్‌టెక్ స్టార్టప్ 'స్కైరూట్ ఏరోస్పే 'విక్రమ్-1' రాకెట్ రూపొందించింది. శ్రీహరికోటలోని సతీష్ ధవన్ అంతరిక్ష కేంద్రం(షార్) నుంచి శనివారం మధ్యాహ్నం 12:05 గంటలకు చేపట్టిన ఈ ప్రయోగం విజయవంతమైంది.

మిగతా 2లో..

## 'విక్రమ్-1' విజయవంతంపై ప్రధాని మోడీ హర్షం

- స్కైరూట్ ఏరోస్పేస్ బృందానికి ఫోన్‌లో అభినందనలు
- ఇంజనీర్ల కృషిని ప్రశంసిస్తూ.. తనను కలవాలని సందేశం
- దేశ అంతరిక్ష కలలకు చిరునామాగా తెలంగాణ
- 'విక్రమ్-1' విజయవంతంపై రేవంత్ హర్షం

న్యూఢిల్లీ,జులై18(ప్రజాజ్యోతి): భారత తొలి ప్రైవేటు అంతరిక్ష ప్రయోగం 'విక్రమ్-1' విజయవంతం కావడంపై ప్రధాని నరేంద్ర మోదీ హర్షం వ్యక్తం చేశారు. ప్రయోగం విజయవంతమైన వెంటనే హైదరాబాద్‌కు చెందిన స్కైరూట్ ఏరోస్పేస్ బృందంతో ఫోన్‌లో మాట్లాడి, వారికి ప్రత్యేక అభినందనలు తెలిపారు మోదీ. ఈ ప్రయోగాన్ని తాను ప్రత్యక్షంగా వీక్షించినట్లు చెప్పిన ఆయన.. ఈ ఘనత దేశానికి గొప్ప విజయమని

మిగతా 2లో..

## ఆహార కల్తీపై ఇక ఉక్కుపాదం

- ప్రజల ప్రాణాలతో చెలగామడితే కఠిన చర్యలు
- ఆహార కల్తీ నిరోధానికి పటిష్టమైన చట్టం
- ప్రపంచ దేశాల్లో అమలవుతున్న విధానాలపై అధ్యయనం
- సేంద్రియ ఉత్పత్తుల పేరుతో విచ్చలవిడిగా అమ్మకాలు
- వాటి స్వచ్ఛతపైనా ఇకనుంచి పరిశీలన
- అసెంబ్లీలో చర్చించి సమగ్ర చట్టం రూపకల్పన
- ఉన్నతస్థాయి సమీక్షలో సిఎం రేవంత్ ఆదేశం

హైదరాబాద్,జూలై18(ప్రజాజ్యోతి): ఆహార, ఔషధాల కల్తీని నిరోధించేందుకు కఠిన చట్టం రూపొందించాలని అధికారులను ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆదేశించారు. కూరగాయలు, పండ్లు, పాలు, ఆహార పదార్థాల కల్తీ వల్ల ప్రజలు అనారోగ్యం బారిన పడుతున్నారని అన్నారు. ఆహార, ఔషధ కల్తీ నియంత్రణపై మర్రి చెన్నారెడ్డి మానవ వనరుల అభివృద్ధి కేంద్రంలో ముఖ్యమంత్రి సీఎం రేవంత్‌రెడ్డి సమీక్ష నిర్వహించారు. ఆకుకూరలు, కూరగాయలు, పాలు ఎక్కువ రోజులు నిల్వ ఉంచేందుకు.. పండ్లు త్వరగా మగ్గేందుకు విచ్చలవిడిగా రసాయనాలు వాడుతుండటంతో ప్రజలు అనారోగ్యం బారిన పడుతున్నారని సీఎం ఆందోళన వ్యక్తం చేశారు. ఎరువులు, పురుగు మందులు ఎక్కువగా వాడటంతో పంట

మిగతా 2లో..



## బుల్లెట్ ట్రైన్ కోసం భూ సేకరణ

- బహద్దూర్ గూడ వద్ద తీవ్ర ఉద్రిక్తత
- అధికారుల తీరుపై రైతుల మండిపాటు
- భూముల జోలికి వస్తే ఊరుకోబోమని హెచ్చరిక
- ఐదురోజులుగా కొనసాగుతున్న ఆందోళన
- పోలీసులపై కారం చల్లి.. కుర్చీలతో దాడి



రంగారెడ్డి,జూలై18(ప్రజాజ్యోతి): శంషాబాద్ బహదూర్ గూడలో ఉద్రిక్తత నెలకొంది. బుల్లెట్ ట్రైన్ కోసం భూములు ఇచ్చేందుకు రైతులు నిరాకరిస్తున్నారు. బహదూర్ గూడా భూముల దగ్గరకు హైడ్రా అధికారులు భారీగా చేరుకున్నారు. భూముల వ్యవహారంలో ఐదు రోజులుగా రైతుల ఆందోళన కొనసాగుతోంది. స్పష్టమైన హామీ ఇచ్చాకే భూములు తీసుకోవాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు. ఈ నేపథ్యంలో.. బహదూర్‌గూడ భూముల జోలికొస్తే ఖబర్దార్ అంటూ.. రాజేంద్రనగర్ నియోజకవర్గం బీఆర్ఎస్ ఇంచార్జ్ పట్లోళ్ల కార్తీక్ రెడ్డి హెచ్చరించారు. హైడ్రా కానీ రాష్ట్ర

మిగతా 12లో..

## స్థానిక ఉత్పత్తులను ప్రజలు ఆదరించాలి

- 16 నుండి 26 వరకు 'బోనాలు- చేతివృత్తుల మేళా'
- ట్యాంక్ బండ్ అంబేద్కర్ విగ్రహం వద్ద ప్రదర్శనలు
- బిసి సంక్షేమశాఖ, రవాణాశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్

హైదరాబాద్,జూలై18(ప్రజాజ్యోతి): చేతి వృత్తి కళాకారులకు చేయూతనివ్వాలని రాష్ట్ర ప్రభుత్వ బిసి సంక్షేమశాఖ ఆధ్వర్యంలో 'బోనాలు- చేతివృత్తుల మేళా, బిసి చేతివృత్తుల అమ్మకాలు- ప్రదర్శన'ను ఈనెల 16వ తేదీ నుండి 26 వరకు ట్యాంక్ బండ్, అంబేద్కర్ విగ్రహము ప్రక్కన గల గ్రౌండ్స్ లో నిర్వహిస్తోంది. చేతివృత్తుల కళాకారులచే తయారు చేసిన వివిధ వస్తువుల ప్రదర్శన, విక్రయము విజయవంతంగా కొనసాగుతున్నది. ఈ ప్రదర్శనలో కుమ్మరులు వారు తయారు

మిగతా 12లో..

## ఎల్‌నినో ప్రభావంతో విద్యుత్ కొరత రావద్దు

**అవసరమైన సరఫరా కొనసాగించాలన్న భట్టి**

హైదరాబాద్,జూలై18(ప్రజాజ్యోతి): ఎల్‌నినో సవాళ్లను ముందుగానే అంచనా వేసి రాష్ట్రంలో విద్యుత్ సరఫరాపై ఎలాంటి ప్రభావం పడకుండా ప్రత్యామ్నాయ కార్యాచరణ ప్రణాళికలను సిద్ధం చేయాలని అధికారులకు ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క స్పష్టం చేశారు. ప్రజలకు నాణ్యమైన, నిరంతరాయ

మిగతా 12లో..

## లక్షల ఉద్యోగాల హామీ

# ఏమయ్యింది?



- జాబ్ క్యాలెండర్, రెండు లక్షల ఉద్యోగాలు ఏవీ
- కొలువుల కుంభమేళా కాదు.. కుంభకోణాల కుంభమేళా
- ఢిల్లీలో రాహుల్ గాంధీ జేబులు నిండుతున్నాయి
- తెలంగాణలో లూటీ జరుగుతోంది
- మొహబ్బత్‌కి దుకాణ్ కాదు.. ధోకేకా మకాన్ నడుస్తోంది
- చాయ్ పే చర్చాను మరచిన రాహుల్
- బీఆర్‌ఎస్ యువ సంగ్రామ సదస్సులో కేటీఆర్ ఘాటు విమర్శలు



హైదరాబాద్,జూలై18(ప్రజాజ్యోతి): ఏడాదిలోనే రెండు లక్షల ఉద్యోగాలిస్తానని రాహుల్ గాంధీ ఇచ్చిన మాట తప్పారని కేటీఆర్ తెలిపారు. రాహుల్ గాంధీకి తెలుగు రాదు.. మన బాధ తెల్వదు అని అన్నారు. అశోక్‌నగర్‌లో చాయ్‌పే చర్చా పెట్టింది అసలు రాహుల్‌గాంధీకి గుర్తుందా అని ప్రశ్నించారు. యువత తలరాత మారుస్తానని

మిగతా 2లో..

## భాజపా నేతల్లో ఎలాంటి విభేదాలు లేవు

- అందరం కలసి అధికారం కోసం కృషి చేస్తున్నాం
- బండి సంజయ్, ఈటల మధ్య సయోధ్యకు యత్నం
- ఎంపి లక్ష్మణ్ నివాసంలో ఇద్దరు నేతలతో చర్చలు
- తెలంగాణలో అధికారం బిజెపిదేనన్న ఎంపి లక్ష్మణ్



హైదరాబాద్,జూలై18(ప్రజాజ్యోతి): తెలంగాణ భాజపా నేతల్లో ఎలాంటి విభేదాలు లేవని, అందరం కలసి అధికారం కోసం కృషి చేస్తున్నామని బిజెపి ఎంపి లక్ష్మణ్ అన్నారు. బండి సంజయ్, ఈటెల రాజేందర్ మధ్య ఉన్న విభేదాలపై ఆయన స్పందించారు. కీలక నేతల మధ్య విభేదాలపై అధిష్ఠానం దృష్టి సారించింది. కేంద్ర మంత్రి బండి సంజయ్, ఎంపీ ఈటల రాజేందర్ తో ఆ పార్టీ రాష్ట్ర ఇన్‌ఛార్జ్ అభయ్ పాటిల్ భేటీ అయ్యారు. ఎంపీ లక్ష్మణ్ నివాసంలో ఇరువురు నేతలతో గంట పాటు సమావేశం జరిగింది. పార్టీ బలోపేతంపై దృష్టి సారించాలని అభయ్ పాటిల్ వారికి సూచించారు. కరీంనగర్ నియోజకవర్గానికి సంబంధించిన అంశాల్లో ఇద్దరూ కలిసి పని చేయాలని, ఏమైనా సమస్యలు ఉంటే.. అంతర్గతంగా పరిష్కరించుకోవాలని ఆదేశించారు. అనంతరం ఇరువురు నేతలతో కలిసి

మిగతా 12లో..

# సంపాదకీయం

## కాళేశ్వరం.. ఆత్మరక్షణలో కాంగ్రెస్ ప్రభుత్వం !

దొంగలుపడ్డ ఆరు నెలలకు ...అన్న చందంగా ప్రభుత్వం ఏర్పడి మూడేళ్లు కావస్తున్న తరుణంలో ఇప్పుడు ధరణిపై విచారణకు ఓ కమిటీని వేయాలని రేవంత్ సర్కార్ తీసుకున్న నిర్ణయం నవ్వులు తెప్పించేదిగా ఉంది. కెసిఆర్, బిఆర్ఎస్ అవినీతిపై పెద్దపెద్ద మాటలు మాట్లాడి అధికారంలోకి వచ్చిన రేవంత్ ఇప్పటి వరకు పైసా అవినీతిని నిరూపించ లేకపోయారు. కాళేశ్వరం, ధరణి, ఈ కార్ రేస్, పవర్ ప్లాంట్లు, విద్యుత్ ఒప్పందాలు తదితర అంశాలన్నీ ఇప్పుడు ప్రచార వస్తువుగా మారాయి. కేవలం బిఆర్ఎస్‌పై రాజకీయంగా పైచేయి సాధించేందుకు మాత్రమే విమర్శలు చేస్తున్నారు. ఇందులో ప్రధానంగా కాళేశ్వరం కూలేశ్వరం అంటూ చేసిన ఆరోపణల్లో ఇంచు కూడా ముందుకు కదలలేదు. లక్షకోట్లు పెట్టిన ప్రాజెక్ట్ పడావు పడ్డది. దానిని ఎలాగైనా వినియోగంలోకి తేవడం ద్వారా ప్రజాధనాన్ని కాపాడాలన్న ముందుచూపు లేకుండా పోయింది. ఎంతసేపు రాజకీయంగా విమర్శలు తప్ప ఈ ప్రభుత్వం గత బిఆర్ఎస్ చేసిన అవినీతిపై ఎలాంటి పురోగతి సాధించలేదు. రేవంత్ రెడ్డి దీనిని కేవలం రాజకీయంగా ఉపయోగించు కుని బిఆర్ఎస్‌ను భ్రష్టు పట్టించే యోచనలో ఉన్నారా అన్న అనుమానాలు వస్తున్నాయి. ఎందుకంటే కాళేశ్వరాన్ని పక్కన పెట్టి ఇప్పుడు మళ్లీ ప్రాణహిత అంటూ పల్లవి అందుకున్నారు. ఉన్న ప్రాజెక్టులను పూర్తి చేయడం, వినిగింలోకి ఎలా తేవడం అన్న ఆలోచన పక్కన పెట్టారు. అందుకే నిత్యం కాళేశ్వరం ప్రాజెక్టు వివాదం కొనసాగుతూనే ఉంది. రాజకీయ విమర్శలకు కాళేశ్వరం వేదికగా మారుతోంది. పరస్పర విమర్శలు తప్ప గోదావరి జలాలను ఎలా ఉపయోగించుకోవాలన్నది ఆలోచించడం లేదు. కాళేశ్వరం ప్రాజెక్టు నుంచి నీటి విడుదల వ్యవహారం కాంగ్రెస్, బీఆర్ఎస్‌ల మధ్య సవాళ్లు, ప్రతిసవాళ్లు, పరస్పర ప్రజెంటేషన్లకు కేంద్రంగా మారింది. ఎల్‌నినో ప్రభావంతో వానలు వెనక్కి పోయాయి. మరో వైపు కాళేశ్వరం నుంచి గోదావరి జలాలు తరలింపు అసాధ్యమని ప్రభుత్వం తేల్చి చెప్పింది. ఈ ప్రాజెక్టును అత్యంత ప్రతిష్టాత్మకంగా తీసుకుని పూర్తి చేసినప్పటికీ మెడిగడ్డ వద్ద కొన్ని పిల్లర్లు కుంగడంతో ఇక అది పనికిరాదన్న రీతిలో ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. మోటర్లు, కాలువలు అంతా వృధా అవుతున్నాయి. ఇదే విషయాన్ని బిజెపి ఎంపి ఈటెల రాజేందర్ ప్రస్తావిస్తే.. ఆయనను బిఆర్ఎస్ ఏజెంట్‌గా అభివర్ణించి విమర్శలతో దాడి చేశారు. నిజానికి గత 2023 శాసనసభ ఎన్నికలలో బీఆర్ఎస్ ఓటమిలో కాళేశ్వరం, ధరణి అక్రమాలు ప్రధాన భూమిక పోషించాయి. అధికారంలోకి రావడానికి అనేకానేక హామీలు, వాగ్దానాలు గుప్పించిన రేవంత్ సర్కార్ ఇప్పుడు గుడ్డెద్దు చేలో పడ్డదన్నట్లుగా సాగుతున్నారు. పదికాలాలపాటు పనికి వచ్చే పనులు చేయడం లేదు. ముఖ్యంగా కాళేశ్వరం ప్రాజెక్టుపై ఎలాంటి విధానం అనుసరిం చాలన్న దానిమీద సరైన అవగాహన లేకుండా వ్యవహరిస్తున్నారు. కాళేశ్వరం పిల్లర్లను పునరుద్ధరించే ప్రయత్నాలు చేసి, నీటిని వినియోగంలోకి తీసుకుని వచ్చివుంటే, ఈయేడు మంచి ఫలితాలు వచ్చేవి. ప్రభుత్వానికి మంచిపేరు వచ్చేది. కానీ కాళేశ్వరం ప్రాజెక్టను ఉపయోగించరాదన్న మొండి వైఖరితో రేవంత్ ఉన్నట్లుగా కనిపిస్తోంది. ఆ ప్రాజెక్టు భద్రత ప్రమాదంలో ఉందని నేషనల్ డామ్ సేఫ్టి అథారిటి చెప్పిందని, అందువల్ల అక్కడ నీటిని వినియోగంలోకి తసీఉకుని రావడం అసాధ్యమని చెబుతున్నారు. కాళేశ్వరం ఎటిఎంగా మారిందని గతంలో బిజెపి కూడా ఆరోపించింది. రేవంత్ రెడ్డి కూడా ఇదే ప ÷-రచారం చేశారు. పోనీ అలాగని ఇందులో జరిగిన అవినీతిని వెలికితీసి కెసిఆర్ తదితరులను దోషులుగా నిలబెట్టి ఉంటే రేవంత్ ఇమేజ్ పెరిగేది. కానీ ఆరోపణలతోనే రెండున్నరేళ్లుగా కాలయాపన చేస్తున్నారు. కాళేశ్వరం కమిషన్‌ను కూడా ఏర్పాటు చేశారు. జస్టిస్ పిసి ఘోష్ కమిటీ రిపోర్టుపై హైకోర్టు స్టే విధించింది. మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్, అప్పటి ఇరిగేషన్ మంత్రి హరీష్ రావులను అరెస్టు చేస్తారేమో అన్నంతగా ప్రచారం జరిగింది. అంతా తుస్సుమంది.

ఇప్పుడు కమిషన్ రిపోర్టుకు కూడా పెద్ద విలువ లేకుండా పోయిందా అన్న అనుమానాలు వస్తున్నాయి. ప్రస్తుతం కాళేశ్వరం ప్రాజెక్టు బారేజీలైన మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల వద్ద నీరు నిల్వచేసి పంప్‌హౌస్‌ల ద్వారా నీటిని తోడి ఆయా ప్రాంతాలలో ఉన్న రిజర్వాయిర్‌లను నింపాలని బిఆర్ఎస్ డిమాండ్ చేస్తోంది. ఇందుకు రేవంత్ ససేమిరా అనడంతో చంద్రబాబు కోసం గోదావరి జలాలను కిందికి జారవిడుస్తున్నారని బిఆర్ఎస్ నేతలు ఆరోపిస్తున్నారు. ఒక వైపు వర్షాభావ పరిస్థితులతో ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. అందువల్ల వర్షాలు తక్కువగా ఉన్న ప్రాంతాలకు నీరు ఎలా ఇవ్వవచ్చొ అన్నదానిపై ఆలోచన చేసి ఉండాల్సింది. కేసీఆర్ కట్టించినంత మాత్రాన ఆ ప్రాజెక్టు కెసిఆర్‌ది అయిపోదు. ఇదంతా ఒక ఎత్తయితే ఇప్పుడు రాజకీయంగా రేవంత్‌ను ఏకిపారేయడంలో బిఆరెస్ మెల్లగా పైచేయి సాధిస్తోంది. మంత్రులు అవినీతిలో కూరుకు పోయారని కెటిఆర్, హరీష్ రావులు రోజూ విమర్శలు చేస్తున్నారు. కమిషన్లు లేనిదే మంత్రులు కాలు బయటపెట్టడం లేదని అంటున్నారు. ఈ ఎదురుదాడితో ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వం ఓ రకంగా ఆత్మరక్షణలో పడిపోయింది. సింగరేణి తదితర విషయాల్లో గొంతులో పచ్చి వెలక్కాయ పడ్డట్లు అయ్యింది. ఈ క్రమంలోనే వాదోపవాదాలు, విమర్శ, ప్రతి విమర్శలతో రాజకీయ వేడెక్కింది. అవినీతి అంటూ ఆరోపించిన రేవంత్ నిరూపించలేదు. దీనికి బదులుగా కేటీఆర్, హరీష్‌రావులే గట్టిగా బదులు ఇస్తున్నారు. దీనివల్ల కూడా రేవంత్ అసహనానికి గురి అవుతున్నారనిపిస్తోంది. ఒక వేళ నిజంగానే గోదావరి నీటిని లిఫ్ట్ చేయడంలో ఇబ్బంది ఉంటే, ఎన్‌డిఎస్‌ఎ నివేదికపై అఖిలపక్షం నిర్వహించి చర్చ చేయాలి. బారేజీల వద్దకు, పంప్ హౌస్‌ల వద్దకు రిటైర్డ్ ఇంజనీర్లను తీసుకునివెళ్లి ఇరిగేషన్ అధికారుల ద్వారా పరిస్థితిని వివరించాలి. కానీ ఇవేవీ చేయకపోవడంతో ఇప్పుడు కాళేశ్వరమే బిఆర్ఎస్‌కు ఆక్సిజన్ నింపుతోంది.

## స్థానిక ఉత్పత్తులను ప్రజలు ఆదరించాలి

మొదటిపేజీ తరువాయి..

చేసిన మట్టిపాత్రలు, గౌడన్నల 'నీరా' స్టాల్, మేదరివారు తయారు చేసిన వెదురు వస్తువులు,హ్యాండ్ లూమ్స్ పోచంపల్లి-ఇక్కత్, గద్వాల్ - నారాయణపేట్, పూసలవారి సామగ్రి, మహిళా స్వయం సహాయక సంఘాల స్వగృహ ఫుడ్స్, ఇతర బిసి వర్గాలచే తయారు చేయబడిన వస్తువులు, తెలంగాణ వంటకాలు, మత్స్య కారుల తయారు చేయబడే చేప వంటకాలు, ఇతర భోజన స్టాల్స్ సందర్శకులను ఆకట్టుకుంటున్నాయి. ఈ ప్రదర్శనలో లభించే వస్తువులు వినియోగదారులకు, సందర్శకులకు సరసమైన ధరలలో లభ్యమవుతున్నాయి. ఈ ప్రదర్శన ప్రతిరోజు ఉదయం 10:00 గంటల నుండి సాయంత్రం 10:00 గంటల వరకు కొనసాగుతున్నది. ప్రభుత్వం సందర్శకులకు ప్రవేశము ఉచితంగా కల్పిస్తున్నది.



ప్రదర్శనలో వివిధ రంగాలకు చెందిన 60 స్టాల్స్ ఏర్పాటు చేశారు. ప్రజల నుంచి వస్తున్న విశేష ఆదరణతో స్టాల్స్ నిర్వాహకులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. చేనేత, హస్తకళలు, మట్టి కళలు, చెక్క బొమ్మలు వంటి సంప్రదాయ కళలను ప్రోత్సహించడమే ఈ మేళా ప్రధాన లక్ష్యమని, గ్రామీణ కళాకారుల ప్రతిభకు మార్కెట్ కల్పిస్తూ వారి జీవనోపాధిని బలోపేతం చేయడంలో ఇటువంటి మేళాలు కీలక పాత్ర పోషిస్తాయని రాష్ట్ర బిసి సంక్షేమశాఖ, రవాణాశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. 'వోకల్ ఫర్ లోకల్' భావనకు అనుగుణంగా స్థానిక ఉత్పత్తులను ప్రజలు ఆదరించాలని, సాంప్రదాయ కళలను నేటి తరానికి పరిచయం చేసి, భావితరాలకు అందించడం మన అందరి బాధ్యత అని ఆయన తెలిపారు. తెలంగాణ ప్రభుత్వం కళాకారుల సంక్షేమం, నైపుణ్యాభివృద్ధి, మార్కెటింగ్ అవకాశాల విస్తరణకు కట్టుబడి ఉందన్నారు. మేళాలో పాల్గొన్న ప్రతి కళాకారుడికి అభినందనలు తెలియజేస్తూ, ప్రజలు పెద్ద ఎత్తున సందర్శించి హస్తకళ ఉత్పత్తులను కొనుగోలు చేసి కళాకారులను ప్రోత్సహించాలని మంత్రి విజ్ఞప్తి చేశారు. మన కళలు, మన చేతివృత్తులు? మన సంపద అనే భావనతో ప్రతి ఒక్కరూ ఈ మేళాను విజయవంతం చేయాలన్నారు. బోనాల పండుగకు అవసరమైన బోనం కుండలతో పాటు సంప్రదాయ ఆచారాలకు ఉపయోగించే వివిధ రకాల వస్తువులను ఈ ప్రదర్శనలో అందుబాటులో ఉంచారు. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలు, జీవన విధానంలో అంతర్భాగమైన అనేక కులవృత్తులు కనుమరుగు అవ్వకుండా మరింతగా ప్రోత్సహించెందుకు ప్రభుత్వం ప్రదర్శనను ఏర్పాటు చేసింది.

# దొరల గడీల ముందు మోకరిల్లని కవి అందెశ్రీ

మొదటిపేజీ తరువాయి..

ఎప్పుడూ దొరల గడప తొక్కలేదని, ఆయన గానంలో గొప్పతనం, సమాజానికి మార్గనిర్దేశం చేసే శక్తి ఉందన్నారు. ఒకప్పుడు నిర్బంధానికి గురైన అందెశ్రీ పాటే నేడు తెలంగాణ రాష్ట్ర గీతంగా మారడం చారిత్రక విషయమని చెప్పారు. ఆనాటి ప్రభుత్వం అందెశ్రీని అవమానించిందని, అలాగే ప్రజాకవి గద్దర్‌ను ప్రగతిభవన్ ఎదుట ఎండలో నిలబెట్టిన ఘటనను కూడా సీఎం గుర్తు చేశారు. ఈ సందర్భంగా మాజీ సీఎం కేసీఆర్, బీఆర్ఎస్ ప్రభుత్వంపై రేవంత్ రెడ్డి తీవ్ర విమర్శలు గుప్పించారు. గ్రూప్ పరీక్షలు నిర్వహించి నిజంగా ఉద్యోగాలు ఇచ్చారా అని ప్రశ్నించారు. కేవలం నోటిఫికేషన్లు ఇచ్చి పేపర్లు లీక్ చేయడం ద్వారా కోట్లు సంపాదించారని ఆరోపించారు. తమ కుటుంబ సభ్యులు, బంధువులకే ఉద్యోగాలు, పదవులు కట్టబెట్టారని, కష్టపడి చదివిన నిరుద్యోగులను నిరాశపరిచారని విమర్శించారు. గతంలో ఉద్యోగాల కోసం నిరుద్యోగులు ఆత్మహత్యలు చేసుకున్న ఘటనలను ప్రస్తావించిన సీఎం, తెలంగాణను శవాలమయంగా మార్చింది ఎవరో ప్రజలకు తెలుసని అన్నారు. తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఇప్పటికే 70 వేల ఉద్యోగాలు కల్పించామని పేర్కొన్న ఆయన, గత ప్రభుత్వం రాష్ట్రానికి రూ.8 లక్షల కోట్ల అప్పులు మిగిల్చి ఫామ్‌హౌస్ రాజకీయాలు చేసిందని మండిపడ్డారు. కేసీఆర్ నోటిఫికేషన్లు ఇస్తే ఈ ప్రభుత్వం ఉద్యోగాలిచ్చిందని ప్రతిపక్ష నేతలు నిస్సిగ్గుగా చెబుతున్నారని సీఎం మండిపడ్డారు. నిరుద్యోగులు, ఉద్యోగ నియామకాల గురించి ఒక్క రోజైనా బీఆర్ఎస్ పాలకులు ఆలోచించారా? 16 ఏళ్ల తర్వాత.. మేం అధికారంలోకి వచ్చాక గ్రూప్-1 నిర్వహించాం. బీఆర్ఎస్ పాలనలో ఎందరో నిరుద్యోగులు ఆత్మహత్యలు చేసుకున్నారు. అధికారంలోకి వచ్చిన తొలి ఏడాదే దాదాపు 70 వేల ఉద్యోగాలిచ్చాం. తల్లిదండ్రుల సాక్షిగా వారందరికీ ఉద్యోగ నియామక పత్రాలిచ్చాం. కేసీఆర్ కుటుంబాన్ని తెలంగాణ సమాజం శ్రీమంతుల్ని చేసింది. అలాంటి రాష్ట్రానికి వాళ్లు తిరిగి ఏమిచ్చారు? ఉన్నదంతా దోచుకున్నారు. కేసీఆర్ 1000 ఎకరాల్లో, కేటీఆర్ 100 ఎకరాల్లో, హరీశ్‌రావు 50 ఎకరాల్లో, కవిత 25 ఎకరాల్లో ఫామ్‌హౌస్‌లు కట్టుకున్నారు. మీరు నిజాం రాజును మించిన ధనవంతులుగా ఎలా మారారు? కల్వకుంట్ల కుటుంబాన్ని ప్రజలు అప్పుడే క్షమించారని అనుకుంటున్నారా? నేను ఉన్నంతవరకు మరోసారి మీ సర్కారును రానివ్వను. తెలంగాణను దోచుకోవాలని చూస్తే.. అందెశ్రీ మళ్లీ పాటై పుడతాడని రేవంత్‌రెడ్డి అన్నారు.

## ఆహార కల్తీపై ఇక ఉక్కుపాదం

మొదటిపేజీ తరువాయి..

ఉత్పత్తుల్లోనూ రసాయన అవశేషాలు బయటపడి దిగుమతి చేసుకోవడానికి విదేశాలు నిరాకరిస్తున్న విషయాన్ని ఈ సందర్భంగా సీఎం ప్రస్తావించారు. మార్కెట్‌లో సేంద్రియ ఉత్పత్తుల పేరుతో భారీ ధరలకు అమ్ముతున్నారని, అవి సేంద్రియ ఉత్పత్తులేనని నిర్ధరించేందుకు సరైన వ్యవస్థలు లేవన్నారు. ఈ నేపథ్యంలో కల్తీల నిరోధానికి సమగ్ర చట్టాలు ఉన్న దేశాలకు వెళ్లి అక్కడి విధానాలను అధ్యయనం చేసి సమగ్ర నివేదిక తయారు చేయాలని అధికారులను ఆదేశించారు. బిల్లు రూపొందించి శాసనసభలో సమగ్రంగా చర్చించడంతో పాటు.. ప్రజల అభిప్రాయాలు స్వీకరించనున్నట్లు తెలిపారు. కల్తీలకు సంబంధించి సమాచార సేకరణకు టోల్ ఫ్రీ నెంబర్ ఏర్పాటు చేయాలని చెప్పారు. కల్తీల నిరోధానికి సంబంధించి ముందుగా క్యూర్ ప్రాంతాన్ని పైలట్ ప్రాజెక్టుగా తీసుకోవాలని సూచించారు. పైలట్ ప్రాజెక్టులో వచ్చే లోటుపాట్ల ఆధారంగా ముందుకు సాగాలని సీఎం దిశానిర్దేశర చేశారు. ఈ క్రమంలో తెలంగాణలో ఆహార, ఔషధ కల్తీలను పూర్తిగా అరికట్టేందుకు రాష్ట్ర ప్రభుత్వం కఠిన చట్టాన్ని తీసుకురావాలని నిర్ణయించింది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధ్యక్షతన జరిగిన సమీక్ష సమావేశంలో కల్తీల నియంత్రణపై పలు కీలక నిర్ణయాలు తీసుకున్నారు. కల్తీ ఆహారం, నకిలీ ఔషధాల వల్ల ప్రజల ఆరోగ్యం తీవ్ర ప్రమాదంలో పడుతోందని సీఎం ఆందోళన వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో కల్తీకి సంబంధించిన సమాచారాన్ని ప్రజలు నేరుగా ప్రభుత్వానికి చేరవేసేలా ప్రత్యేక టోల్‌ఫ్రీ నంబర్‌ను ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. అలాగే అక్రమాలను వెలుగులోకి తీసుకొచ్చే విజిల్ బ్లోయర్ల వ్యవస్థను కూడా ఏర్పాటు చేయాలని సూచించారు. తెలంగాణ ఫుడ్ అండ్ డ్రగ్ అడ్మినిస్ట్రేషన్ అథారిటీ చట్టంపై అసెంబ్లీలో సమగ్ర చర్చ నిర్వహించి, ప్రజల అభిప్రాయాలను సేకరించిన అనంతరం బిల్లుకు తుది రూపం ఇవ్వాలని సీఎం స్పష్టం చేశారు. కల్తీల నియంత్రణలో ప్రపంచంలోని వివిధ దేశాల్లో అమలవుతున్న చట్టాలు, విధానాలను అధ్యయనం చేసి వాటిలో ఉత్తమ పద్ధతులను తెలంగాణలో అమలు చేయాలని ప్రభుత్వం భావిస్తోంది. తొలి దశలో 'క్యూర్' ప్రాంతంలో పైలట్ ప్రాజెక్టుగా ఈ వ్యవస్థను అమలు చేసి, అనంతరం రాష్ట్రవ్యాప్తంగా విస్తరించనున్నట్లు తెలిపింది. సేంద్రియ ఉత్పత్తుల ధృవీకరణకు ప్రత్యేక వ్యవస్థను రూపొందించడంపైనా ప్రభుత్వం దృష్టి సారించింది. రసాయన అవశేషాలు, కల్తీ కారణంగా వ్యవసాయ ఉత్పత్తుల ఎగుమతులపై ప్రతికూల ప్రభావం పడుతోందని సీఎం పేర్కొన్నారు. ప్రజల ఆరోగ్య రక్షణకు అత్యంత ప్రాధాన్యత ఇస్తూ, కల్తీలకు పాల్పడే వారిపై ఇకపై ఎలాంటి రాజీ లేకుండా కఠిన చర్యలు తీసుకునేందుకు తెలంగాణ ప్రభుత్వం సిద్ధమవుతోంది. ఈ సమీక్షలో డిజిపి ఆనంద్, సిఎస్ సంజయ్ జాజు తదితరులు పాల్గొన్నారు.

# లక్షల ఉద్యోగాల హామీ ఏమయ్యింది?

మొదటిపేజీ తరువాయి..

అబద్ధపు హామీలు ఇచ్చారని.. జాబ్ క్యాలెండర్, రెండు లక్షల ఉద్యోగాలు ఏమయ్యాయని నిలదీశారు. డిగ్రీ విద్యార్థినులకు స్కూటీలు ఏమయ్యాయి? విద్యా భరోసా ఏమైందని అడిగారు. ఢిల్లీలో రాహుల్ గాంధీ జేబులు నిండుతున్నాయని.. తెలంగాణలో లూటీ జరుగుతోందని కేటీఆర్ విమర్శించారు. తెలంగాణలో మొహబ్బత్‌కి దుకాణ్ కాదు.. ధోకేకా మకాన్ నడుస్తోందని ఆరోపించారు. కొలువుల కుంభమేళా అని చెప్పి.. కుంభకోణాల కుంభమేళా చేస్తున్నారని మండిడ్డారు. హైదరాబాద్ సరూర్‌నగర్‌లో బీఆర్ఎస్ తలపెట్టిన యువ సంగ్రామ సదస్సులో కేటీఆర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ.. ఉద్యోగాలు అడిగితే ఉరికించి కొడుతున్నారని కాంగ్రెస్ సర్కార్‌పై కేటీఆర్ మండిపడ్డారు. డిసెంబర్ 9 నుంచి ఉద్యోగ పర్వం కాదు.. ఉన్మాదపర్వం చూపిస్తున్నారని అన్నారు. నిరుద్యోగుల పట్ల దౌర్జన్య కాండ కొనసాగుతోందని తెలిపారు. రాహుల్ గాంధీకి నిరుద్యోగుల ఆక్రోశం కనబడటం లేదా అని నిలదీశారు. నిరుద్యోగ అభ్యర్థుల శోకాలు వినిపించడం లేదా అని ప్రశ్నించారు. సిటీ సెంట్రల్ లైబ్రరీలో దాడులు, ఓయూలో నిర్బంధాలు కనిపించడం లేదా అని అడిగారు. ఢిల్లీలో రాజ్యాంగం చేత పట్టుకుని రాహుల్ గాంధీ సుద్దపూస మాటలు మాట్లాడుతున్నారని విమర్శించారు. హైదరాబాద్ నడిబొడ్డున ప్రజాస్వామ్యం ఖూనీ అవుతుంటే పట్టించుకునే వారే లేరని కేటీఆర్ మండిపడ్డారు. రాహుల్ గాంధీ ప్రధాని అయ్యే వరకు వదిలిపెట్టనని సీఎం రేవంత్ రెడ్డి అంటున్నాడని తెలిపారు. నవంబర్ 22న అవినీతి సొమ్ముతో జాబ్ క్యాలెండర్‌పై యాడ్‌లు వేశారని గుర్తుచేశారు. కానీ ఇవాళ జాబులు లేవు.. జవాబులు లేవని విమర్శించారు. ఉద్యోగాలు లేవు.. క్యాలెండర్ మారినా.. జాబ్ క్యాలెండర్‌కు దిక్కు లేదని అన్నారు. అసెంబ్లీలో ప్రకటించిన జాబ్ క్యాలెండర్ చిత్తు కాగితాలుగా మారిందని విమర్శించారు. చరిత్రను మరిచిపోతే భవిష్యత్ తరాలు క్షమించవని హెచ్చరించారు. చరిత్రలు, ఇతిహాసాలు, పురాణాలు చదవాలని సీఎం రేవంత్ రెడ్డికి కేటీఆర్ సూచించారు. తెలంగాణ ఉద్యమాల్లో చావగొట్టిన వాళ్లే మళ్లీ అధికారంలోకి వస్తారని తెలిపారు. కాంగ్రెస్ అలవిగాని హామీలు నమ్మి తెలంగాణ యువత మోసపోయింద్రు అని తెలిపారు. 1952, 1969లో కాంగ్రెస్ పార్టీ తెలంగాణ యువత గుండెల్లో గుణపాలు నింపిందని గుర్తుచేశారు. వేలమంది యువత ప్రాణాలు తీసుకున్నా కాంగ్రెస్‌కు రక్తదాహం తీరడం లేదని అన్నారు. మన రక్తం పొలాల మీద చల్లాలని చిల్లరమాటలు మాట్లాడుతున్నారని మండిపడ్డారు. రైతు, యూత్, మహిళ, ఎస్సీ, ఎస్టీ డిక్లరేషన్‌పై కాంగ్రెస్ అనేక హామీలు ఇచ్చిందని తెలిపారు. ఓటు కోసం కోటి మోసాలు చేస్తున్న కాంగ్రెస్ తీరు దేశానికి తెలియాలన్నారు. రేపటి తెలంగాణ నిర్మాతలు మీరు.. భవిష్యత్ నిర్ణేతలు మీరే అని యువతను ఉద్దేశించి బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. అలాంటి యువతను కాంగ్రెస్ సర్కార్ మోసం చేస్తున్నదని మండిపడ్డారు. మీకు జరిగిన మోసం, వంచనను గుర్తుచేసుకుని కాంగ్రెస్‌కు బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు. సరిగ్గా 38 నెలల కింద ఇదే సరూర్ నగర్ స్టేడియం సాక్షిగా తెలంగాణ యువత దగా పడిందని తెలిపారు. నిరుద్యోగులను వంచించిన దగాకోరులు కాంగ్రెస్ నాయకులు అని పేర్కొన్నారు. హైకమాండ్ తరలివచ్చి మాయామశ్చీంద్ర కార్యక్రమం ఇక్కడ చేశారని ఎద్దేవా చేశారు. యూత్ డిక్లరేషన్ పేరిట దుర్మార్గమైన వాగ్దానాల వరద పాటించారని మండిపడ్డారు. పాత కేటుగాళ్లు.. కొత్త డూప్లికేట్లు వచ్చి యువతపై లేని ప్రేమను కనబరిచారని తెలిపారు. యూత్‌కు ఇచ్చిన ఒక్క హామీ అయినా నెరవేర్చారా అని కేటీఆర్ ప్రశ్నించారు. ఎన్నికల ముందు హామీ ఇచ్చిన రెండు లక్షల ఉద్యోగాలు ఇచ్చారా అని నిలదీశారు. ప్రైవేటు కంపెనీల్లో 75 శాతం రిజర్వేషన్ వచ్చిందా అని అడిగారు. కాలేజీ విద్యార్థినులకు స్కూటీలు వచ్చాయా? యువతకు రూ.10లక్షల రుణాలు వచ్చాయా? ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధులు వచ్చాయా? అని ప్రశ్నించారు. నాలుగు ట్రిపుల్‌ఐటీలు, మూడు యూనివర్సిటీలు వచ్చాయా? నెలకు రూ.4వేల భృతి వచ్చిందా? పదో తరగతిలో రూ.10వేలు, ఇంటర్ పాసైతే రూ.15వేలు వచ్చాయా? డిగ్రీ ఉత్తీర్ణులతై లక్ష వచ్చాయా? పీహెచ్‌డీ పాసైతే రూ.5లక్షలు వచ్చాయా? అని ప్రశ్నించారు. ఇంత మోసానికి పాల్పడిన వారిని ఏమనాలో ఆలోచించాలని సూచించారు. దగుల్బాజీలా.. దోకేబాజ్‌లు అనాలో మీరే ఆలోచించాలన్నారు. జిత్తులమారి ముసలి నక్క కాంగ్రెస్ యువజనాన్ని తెలివిగా చిత్తు చేసిందని కేటీఆర్ విమర్శించారు. 60 ఏళ్లు నెత్తురు మరిగిన కాంగ్రెస్ యువతను ఎలా మోసం చేసిందో గుర్తించాలన్నారు. కాంగ్రెస్ మోసపు వలలో పడిపోయి గోసపడుతున్నారని తెలిపారు. 31 నెలలు గడిచాయి.. నిరుద్యోగులకు కాంగ్రెస్ ఏం చేసిందని ప్రశ్నించారు. మాటతప్పి వంచించి, నమ్మించి నట్టేట ముంచి అధికారంలోకి వచ్చిందని కాంగ్రెస్‌పై మండిపడ్డారు. యువతరంతో పెట్టుకుంటే కొన్ని తరాలు పుట్టగతులు ఉండవని హెచ్చరించారు.

## విక్రమ్-1 రాకెట్ ప్రయోగం విజయవంతం

మొదటిపేజీ తరువాయి..

దీంతో ప్రభుత్వ ఆధ్వర్యంలోని అంతరిక్ష కార్యక్రమాలు సహా భారత ప్రైవేటు రంగం కూడా ఉపగ్రహాలను కక్ష్యలోకి పంపగల సామర్థ్యాన్ని ప్రపంచానికి చాటినట్లు అయ్యింది. వాస్తవానికి ఉదయం 11.30 గంటలకు ప్రయోగం జరగాల్సి ఉండగా సాంకేతిక లోపం తలెత్తింది. దీంతో ప్రయోగానికి స్వల్ప అంతరాయం ఏర్పడింది. ఆ తర్వాత శాస్త్రవేత్తలు పరిశీలనలు చేపట్టి ఇంధన ప్రక్రియలో తలెత్తిన సమస్యను గుర్తించి సరిచేశారు. 35 నిమిషాల తర్వాత తిరిగి రాకెట్‌ను ప్రయోగించారు. ఈ రాకెట్.. సాంకేతిక పేలోడ్‌లు సహా ప్రధాని నరేంద్ర మోదీ స్వహస్తాలతో 'వందేమాతరం' అని రాసి పంపిన ప్రత్యేక పోస్ట్‌కార్డును అంతరిక్షంలోకి తీసుకెళ్లింది. వీటితో పాటు కాస్మోస్ డైమండ్స్ సంస్థ రూపొందించిన 'కాస్మిక్ బ్లూమ్' ఆర్ట్‌వర్క్, విక్రమ్-1 రాకెట్ సూక్ష్మ ప్రతిరూపాన్నీ నింగిలోకి పంపారు. దీనిపై సర్ సీవీ రామన్, విక్రమ్ సారాభాయ్, ఏపీజే అబ్దుల్ కలాం వంటి ప్రముఖుల సూక్ష్మరూపాలను చెక్కారు. అంతేకాకుండా.. ఈ ప్రయోగం విజయవంతం కావాలని కాంక్షిస్తూ స్కైరూట్ టీమ్ సహా ఇస్రో మాజీ ఛైర్మన్లు, శాస్త్రవేత్తలు, భారతీయ వ్యోమగాములు, ఇతరులు పంపిన డజన్ల కొద్దీ చేతిరాత పోస్ట్‌కార్డులనూ ప్రత్యేక పేలోడ్ బాక్స్‌లో భద్రపరిచారు. స్కైరూట్ సంస్థ 'మిషన్ ఆగమన్' పేరిట ఈ ప్రయోగం చేపట్టింది. భారత ప్రైవేట్ అంతరిక్ష రంగం ఆర్బిటాల్ ప్రయోగాల యుగంలోకి అడుగుపెడుతున్న సందర్భంగా ఈ మిషన్‌కు ఆ పేరు పెట్టింది. విక్రమ్-1 ద్వారా గ్రహాస్పేస్, కాస్మోసెర్వ్, డీక్యూబ్‌డ్ సంస్థలకు చెందిన టెక్నాలజీ డెమానిస్ట్రేషన్ పేలోడ్‌లు సహా స్కైరూట్‌కు చెందిన 'స్కోప్'ను కూడా అంతరిక్షంలోకి పంపారు. ఈ ప్రయోగం ద్వారా రాకెట్‌లోని ప్రొపల్షన్, స్టేజ్ సెపరేషన్, గైడెన్స్, నావిగేషన్, కంట్రోల్ వ్యవస్థల పనితీరును అంతరిక్ష ప్రయాణంలో పరీక్షించి తద్వారా కీలక సమాచారం రాబట్టనున్నారు. దీంతో రానున్న కాలంలో వాణిజ్య ప్రయోగాల అవసరాలకు సాంకేతిక సామర్థ్యాన్ని మరింత మెరుగుపరుచుకోవడమే లక్ష్యంగా స్కైరూట్ ముందడుగేస్తోంది. ఇక.. సుమారు ఏడంతస్తుల భవనం ఎత్తులో రూపొందిన విక్రమ్-1 పూర్తిగా కార్బన్ కాంపోజిట్ నిర్మాణంతో తయారైంది. దేశీయంగా అభివృద్ధి చేసిన 3డీ ప్రింటెడ్ ఇంజిన్లు, ఘన ఇంధన బూస్టర్లతో పనిచేసే ఈ రాకెట్ 350 కిలోల వరకు చిన్న ఉపగ్రహాలను 450 కిలోమీటర్ల ఎత్తులోని లోఎర్త్ ఆర్బిట్ లో ప్రవేశపెట్టే సామర్థ్యాన్ని కలిగి ఉంది. 2022లో విక్రమ్-ఎస్ ద్వారా తొలి ప్రైవేట్ రాకెట్‌ను విజయవంతంగా కక్ష్యలోకి పంపిన స్కైరూట్.. ఇప్పుడు విక్రమ్-1తో తొలి దేశీయ ప్రైవేట్ ఆర్బిటాల్ ప్రయోగం చేపట్టింది. ఈ ప్రయోగాన్ని ఏపీ మంత్రి నారా లోకేశ్ ప్రత్యక్షంగా వీక్షించారు. కుమారుడు దేవాన్ష్‌తో కలిసి శ్రీహరికోటకు వెళ్లిన లోకేశ్.. ఇస్రో గ్యాలరీ నుంచి 'విక్రమ్-1' ప్రయోగాన్ని వీక్షించారు. ఇస్రో మాజీ ఛైర్మన్లు, సీనియర్ శాస్త్రవేత్తలు తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.





## జాతీయ చలనచిత్ర అవార్డుల ప్రకటన

మొదటిపేజీ తరువాయి..

దర్శకుడు యదువంశీ రూపొందించి ఈ చిత్రానికి మెగా డాటర్ నిహారిక కొణిదెల నిర్మాతగా వ్యవహరించడం విశేషం. బాక్సాఫీస్‌తో పాటు ఓటీటీలోనూ అదరగొట్టిన ఈ మూవీ ఇప్పుడు ఏకంగా రెండు జాతీయ అవార్డులను సొంతం చేసుకుంది. ఇటీవల తెలంగాణ ప్రభుత్వం ప్రకటించిన గద్దర్ అవార్డుల్లో జాతీయ సమైక్యత, మతసామరస్యం, అణగారిన వర్గాల సామాజిక అభ్యున్నతికి ఉద్దేశించిన చిత్రంగా వివిధ విభాగాల్లో మెరిసింది. ఇక నాగ్ అశ్విన్ విజువల్ వండర్ 'కల్కి 2898 ఏడీ'కి రెండు కేటగిరీల్లో అవార్డులను దక్కించుకుంది. అద్భుతమైన సెట్స్, విజువల్స్‌తో అలరించినందుకు ఉత్తమ ప్రొడక్షన్ డిజైన్ అవార్డుతో పాటు, ఉత్తమ ప్రజాదరణ పొందిన చిత్రంగా జాతీయ అవార్డును సొంతం చేసుకుంది. 'ఎంత గొప్పగా ఆడావు అన్నది ముఖ్యం కాదు.. ఎప్పుడు ఆపావన్నదే ముఖ్యం, 'ఒక్క రోజులో ఒక అరగంట నాకు నచ్చినట్టు గడవలేదు. దానికి జీవితాంతం ఏడుస్తూ కూర్చోలేను కదా' వంటి సంభాషణలతో అలరించిన చిత్రం 'లక్కీ భాస్కర్'. ఇలాంటి అద్భుతమైన సంభాషణలను రాసి జీవిత సత్యాలెన్నో చెప్పిన దర్శకుడు వెంకీ అట్లూరి ఉత్తమ రచయితగా జాతీయ అవార్డు దక్కింది. మాస్‌నే కాదు, బాక్సాఫీస్‌ను ఓ ఊపు ఊపేసిన చిత్రం 'పుష్ప2'. ఇప్పుడు ఏకంగా రెండు జాతీయ అవార్డులను సొంతం చేసుకుంది. ఈ మూవీని ఆద్యంతం అలరించేలా తీర్చిదిద్దిన దర్శకుడు సుకుమార్ ఉత్తమ స్క్రీన్‌ప్లే రచయిత కేటగిరిలో అవార్డుకు ఎంపిక కాగా, ఉత్తమ కాస్ట్యూమ్ డిజైనర్‌గా దీపాలి నూర్, సీతల్ శర్మలకు అవార్డు దక్కింది. చిన్న చిత్రం కాదు.. ప్రతి ఒక్కరి మనుసుల్ని హత్తుకునేంత పెద్ద చిత్రమనించింది '35-చిన్న కథ కాదు'. ఇప్పుడు జాతీయ అవార్డుల్లో ఉత్తమ బాలల చిత్రంతో పాటు, ఉత్తమ బాల నటుడిగా అరుణ్‌దేవ్ పోతుల అవార్డుకు ఎంపికయ్యారు.

## ఫాల్కన్ గ్రూప్ సిఎండి అమర్‌దీప్ అరెస్ట్

మొదటిపేజీ తరువాయి..

విధించింది. దీంతో అధికారులు అమర్‌దీప్‌ను చర్లపల్లి సెంట్రల్ జైలుకు తరలించారు. ఫాల్కన్ సంస్థ.. పెట్టుబడిదారులకు 11 శాతం నుంచి 21 శాతం వరకు అధిక లాభాలు ఇస్తామని హామీ ఇచ్చి భారీగా నిధులు సమీకరించినట్లు ఈడీ గుర్తించింది. మొత్తం రూ.4,215 కోట్ల మేర పెట్టుబడులు సేకరించినట్లు వెల్లడించింది. కొత్త పెట్టుబడిదారుల నుంచి వచ్చిన డబ్బుతో పాత పెట్టుబడిదారులకు చెల్లింపులు చేసినట్లు దర్యాప్తులో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ గుర్తించింది. ఈ వ్యవహారంలో ఇప్పటివరకు రూ.792 కోట్లను నేర ఆదాయంగా (ఖసనీఇ॥టబ నౌ అసతిప।) గుర్తించినట్లు తెలిపింది. ఇప్పటికే ఈ కేసులో రంగారెడ్డి జిల్లాలోని ఆస్తులతో పాటు హాకర్ 800ం విమానం సహా రూ.20.6 కోట్ల విలువైన ఆస్తులను ఈడీ తాత్కాలికంగా జప్తు చేసింది. విచారణకు సహకరించకపోవడంతో ఖఓఒం సెక్షన్-19 కింద అమర్‌దీప్ కుమార్‌ను ఈడీ అరెస్ట్ చేసింది. ఫాల్కన్ మనీలాండరింగ్ కేసులో నిధుల మళ్లింపు, ఇతర నిందితుల పాత్రపైనా ఈడీ దర్యాప్తు కొనసాగుతోంది.

## 'విక్రమ్-1' విజయవంతంపై ప్రధాని మోడీ హర్షం

మొదటిపేజీ తరువాయి..

అభివర్ణించారు. భారత అంతరిక్ష ప్రయాణంలో ఇదో కీలక మైలురాయిగా నిలిచిందని పేర్కొన్నారు. 'ప్రయోగాన్ని నేను ప్రత్యక్షంగా వీక్షించాను. దీని వెనుక ఎందరో యువ ఇంజినీర్ల శ్రమ దాగుంది. మొత్తం బృందానికి నా హృదయపూర్వక అభినందనలు. ఇది ఆరంభం మాత్రమే. ఈ ప్రయాణాన్ని మరింత ముందుకు తీసుకెళ్లాలి' అని స్కైరూట్ టీమ్‌ను ప్రోత్సహించారు. ఈ సందర్భంగా స్కైరూట్ ఏరోస్పేస్ శాస్త్రవేత్తలు, ఇంజినీర్ల బృందం త్వరలో తనను కలవాలని ఫోన్ ద్వారా ఆహ్వానించారు. అంతరిక్ష రంగంలో భారత్ స్వావలంబన దిశగా వేగంగా ముందుకు సాగుతోందని ఈ ప్రయోగం ప్రపంచానికి చాటిచెప్పిందని మోదీ అభిప్రాయపడ్డారు. 'అంతరిక్ష రంగంలోనూ భారత్





ఆత్మనిర్భర్‌గా ఎదగగలదని మీరు ప్రపంచానికి నిరూపించారు' అని ప్రధాని కొనియాడారు. 'విక్రమ్-1'లో తన 'వందేమాతరం' సందేశంతో కూడిన కార్డును కూడా పంపించిన విషయాన్ని ఈ సందర్భంగా ప్రస్తావించారు. ప్రపంచం నలుమూలల నుంచి వచ్చిన శుభాకాంక్షలు సహా ఆ సందేశం కూడా అంతరిక్షంలోకి చేరడం గర్వకారణమన్నారు. 'ఈ ప్రయోగం ద్వారా 'వందేమాతరం' సందేశం మరింత ఉన్నత స్థాయికి చేరి అంతరిక్షంలోనూ మార్మోగింది' అని మోదీ వ్యాఖ్యానించారు. శ్రీహరికోటలోని సతీష్ ధవన్ అంతరిక్ష కేంద్రం నుంచి శనివారం మధ్యాహ్నం 12:05 గంటలకు 'మిషన్ ఆగమన్' పేరిట చేపట్టిన 'విక్రమ్-1' రాకెట్ విజయవంతంగా నింగిలోకి దూసుకెళ్లింది. నిర్ణీత సమయం కంటే 35 నిమిషాలు ఆలస్యంగా ప్రయోగం చేపట్టినప్పటికీ.. అన్ని దశలను విజయవంతంగా పూర్తి చేయడంతో భారత ప్రైవేటు అంతరిక్ష రంగంలో కొత్త అధ్యాయానికి నాంది పలికింది.

'విక్రమ్-1' విజయవంతంపై తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పందించారు. 'హైదరాబాద్ రైజింగ్.. తెలంగాణ రైజింగ్' అంటూ సోషల్ మీడియా ఎక్స్ వేదికగా హర్షం వ్యక్తం చేశారు. భారత్ తొలి ప్రైవేట్ ఆర్బిటల్ రాకెట్ 'విక్రమ్-1' విజయవంతమైన ప్రయోగమన్నారు. శ్రీహరికోట నుంచి విక్రమ్-1 నింగిలోకి దూసుకెళ్లిందని, హైదరాబాద్ సంస్థ స్కైరూట్ ఏరోస్పేస్ ఘన విజయం సాధించిందని తెలిపారు. భారత అంతరిక్ష రంగం మరో చారిత్రక మైలురాయిని చేరుకుందన్నారు. దేశ అంతరిక్ష కలలకు చిరునామాగా తెలంగాణ నిలిచిందని సీఎం అన్నారు. హైదరాబాద్ ఇన్నోవేషన్ శక్తికి ప్రపంచ వేదికపై గుర్తింపు లభించిందని తెలిపారు. ఈ సందర్భంగా స్కైరూట్ బృందానికి ముఖ్యమంత్రి అభినందనలు తెలియజేశారు. విక్రమ్-1.. ప్రైవేట్ స్పేస్ రంగంలో భారత్ సత్తా చాటిందని కొనియాడారు. భవిష్యత్తు అంతరిక్ష ప్రయాణాలకు తెలంగాణ నుంచి బలమైన అడుగు పడిందని ఎక్స్‌లో సీఎం రేవంత్ రెడ్డి పోస్ట్ చేశారు.

## పిచర గ్రామంలో ఉచిత వైద్య శిబిరం



నేరడిగొండ జులై 18(ప్రజాజ్యోతి) : గ్రామాల్లో సంపూర్ణ ఆరోగ్య సాధనే లక్ష్యంగా ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన "టిబి ముక్త భారత్ అభియాన్" (క్షయ రహిత భారత ప్రచార కార్యక్రమం) శనివారం నేరడిగొండ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని గుప్తాల సబ్



సెంటర్ పరిధిలోని పిచర గ్రామంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామస్తులకు ఉచిత ఎక్స్-రే మరియు ప్రత్యేక వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు.

ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా గ్రామ సర్పంచ్ లింగవ్వ రాజేందర్,లైజనింగ్ ఆఫీసర్ పవార్ రవీందర్ హాజరై శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. క్షయ వ్యాధి పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, ప్రాథమిక దశలోనే వ్యాధిని గుర్తిస్తే సులభంగా నయం చేయవచ్చని పేర్కొన్నారు. ప్రభుత్వం అందిస్తున్న ఇలాంటి ఉచిత వైద్య సేవలను గ్రామీణ ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అనుమానిత లక్షణాలు ఉన్న ప్రతి ఒక్కరికీ ఉచితంగా ఎక్స్-రే పరీక్షలు నిర్వహించి, మందులను పంపిణీ చేశారు.ఈ వైద్య శిబిరంలో హెల్త్ సూపర్‌వైజర్ సంతోష్, హెల్త్ విజిటర్ రవీందర్, రేడియో గ్రాఫర్ అరుణ్ కుమార్, ఆశా కార్యకర్తలు పార్వతి, కౌసల్య మరియు వైద్య సిబ్బంది, గ్రామస్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## మెడికల్ బోర్డుకు గైర్హాజరైన 28 మందికి మరో అవకాశం కల్పించాలి

- కనీసం 15 రోజుల ముందే సమాచారం ఇవ్వాలి
- హెచ్ఎంఎస్ ప్రధాన కార్యదర్శి రియాజ్ అహ్మద్



మంచిర్యాల, 18, జులై (ప్రజాజ్యోతి) : సింగరేణి కార్మికుల మెడికల్ అన్‌ఫిట్ ప్రక్రియలో భాగంగా కొత్తగూడెంలోని సింగరేణి ప్రధాన ఆసుపత్రిలో శుక్రవారం నిర్వహించిన మెడికల్ బోర్డుకు యాజమాన్యం మొత్తం 120 మంది కార్మికులను పిలవగా, 92 మంది మాత్రమే హాజరయ్యారు. 28 మంది కార్మికులు గైర్హాజరయ్యారు. శుక్రవారం ప్రీ-బోర్డు వైద్య పరీక్షలు పూర్తికాగా, శనివారం కార్పొరేట్ ఆసుపత్రి వైద్యులు ఫిజికల్ ఫిట్‌నెస్ ఆధారంగా తుది పరీక్షలు నిర్వహించి అన్‌ఫిట్‌గా ప్రకటించనున్నారు. అన్‌ఫిట్ అయిన కార్మికుల అర్హులైన పిల్లలకు సింగరేణి యాజమాన్యం ఉద్యోగ అవకాశం కల్పించనుంది. ఈ సందర్భంగా హెచ్ఎంఎస్ ప్రధాన కార్యదర్శి రియాజ్ అహ్మద్ స్పందిస్తూ, మెడికల్ బోర్డుకు గైర్హాజరైన 28 మంది కార్మికులకు ప్రత్యేక మెడికల్ బోర్డు నిర్వహించి మరో అవకాశం కల్పించాలని యాజమాన్యాన్ని డిమాండ్ చేశారు. దేశంలో ఐఏఎస్, ఐపీఎస్ వంటి అత్యున్నత పోటీ పరీక్షలకు సైతం అభ్యర్థులకు కనీసం 15 రోజుల ముందుగానే సమాచారం ఇస్తారని, అయితే సింగరేణి మెడికల్ బోర్డుకు మాత్రం ఒక్కరోజు ముందు మాత్రమే వెల్ఫేర్ అధికారులు సమాచారం ఇవ్వడం వల్ల కార్మికులు హాజరు కాలేకపోతున్నారని ఆయన విమర్శించారు. విధుల నిమిత్తం లేదా వ్యక్తిగత పనుల కోసం ఇతర ప్రాంతాలకు వెళ్లిన కార్మికులు ఆకస్మికంగా మరుసటి రోజు హాజరు కావాలని చెప్పడంతో రావడం సాధ్యం కాకపోయిందని, అందువల్లే 28 మంది గైర్హాజరయ్యారని తెలిపారు .ఇకపై మెడికల్ బోర్డు షెడ్యూల్‌ను కనీసం 15 రోజుల ముందుగానే ప్రకటించి కార్మికులకు తగిన సమయం కల్పించాలని, ఈసారి గైర్హాజరైన 28 మందికి ప్రత్యేక మెడికల్ బోర్డు నిర్వహించి మరో అవకాశం ఇవ్వాలని రియాజ్ అహ్మద్ యాజమాన్యాన్ని కోరారు.

## కోర్టు డ్యూటీ అధికారుల పనితీరును మెరుగుపర్చడంతో పాటు శిక్షల శాతం పెంచాలి

సీపీ అంబర్ కిషోర్ ఝా





మంచిర్యాల, 18, జులై (ప్రజాజ్యోతి) : రామగుండం పోలీస్ కమిషనరేట్ పరిధిలో కోర్టు డ్యూటీ అధికారుల పనితీరును మరింత మెరుగుపర్చడంతో పాటు కేసుల్లో శిక్షల శాతాన్ని పెంచేందుకు ప్రత్యేక దృష్టి సారించాలని పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా అధికారులను ఆదేశించారు. శనివారం సీపీ కార్యాలయంలోని కాన్ఫరెన్స్ హాల్‌లో కోర్టు డ్యూటీ, కోర్టు లైజనింగ్ పోలీసు అధికారులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా కోర్టు విధుల నిర్వహణ, కేసుల పురోగతి, శిక్షల శాతం పెంపు, సాంకేతిక సమస్యల పరిష్కారం, సాక్షుల నిర్వహణ తదితర అంశాలపై అధికారులకు కీలక సూచనలు చేశారు. కోర్టు విధులకు సంబంధించిన ప్రతి పనిని నిర్దేశిత గడువులో నాణ్యతతో పూర్తి చేయాలని, విధి నిర్వహణలో ఎదురయ్యే పరిపాలనా లేదా సాంకేతిక సమస్యలను వెంటనే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకురావాలని సూచించారు. వాటి పరిష్కారానికి శాఖ పూర్తి సహకారం అందిస్తుందని తెలిపారు. సమన్లు, బెయిల్ మంజూరు కాని అరెస్టు వారెంట్లు (ఎన్‌బీడబ్ల్యూలు), ఇతర వారెంట్ల అమలు వంటి కోర్టు ప్రక్రియలను వేగవంతంగా పూర్తి చేయాలని ఆదేశించారు. సాక్షులను కోర్టుకు సకాలంలో హాజరుపరిచే విషయంలో ప్రత్యేక శ్రద్ధ వహించాలని, వారికి కోర్టు ప్రక్రియపై ముందస్తు అవగాహన కల్పించి ధైర్యంగా, స్పష్టంగా వాంగ్మూలం ఇచ్చేలా మార్గదర్శకత్వం అందించాలని సూచించారు. ప్రతి కేసులో నిందితులకు శిక్షలు పడేలా దర్యాప్తు అధికారులు, కోర్టు డ్యూటీ అధికారులు పరస్పర సమన్వయంతో పనిచేయాలని సీపీ పేర్కొన్నారు. సమయపాలన, నాణ్యమైన దర్యాప్తు, సమర్థవంతమైన కోర్టు నిర్వహణ ద్వారా మెరుగైన ఫలితాలు సాధించవచ్చని తెలిపారు. విధి నిర్వహణలో ప్రతిభ కనబరిచిన అధికారులను ప్రతి నెల గుర్తించి ప్రోత్సాహక బహుమతులు అందజేస్తామని వెల్లడించారు. అలాగే విధి నిర్వహణలో విశేష కృషి చేసి బదిలీపై వెళ్లిన అధికారుల దర్యాప్తు చేసిన కేసుల్లో తర్వాత శిక్షలు విధించబడినా, సంబంధిత అధికారుల సిఫారసు మేరకు వారికి కూడా గుర్తింపు, ప్రోత్సాహక బహుమతులు అందజేస్తామన్నారు .రామగుండం పోలీస్ కమిషనరేట్‌లో శిక్షల శాతాన్ని పెంచడం, ప్రతి కేసును సకాలంలో పూర్తి చేయడం ప్రధాన లక్ష్యమని పేర్కొన్న సీపీ అంబర్ కిషోర్ ఝా, ప్రతి అధికారి బాధ్యతాయుతంగా పనిచేసి ప్రజలకు సమర్థవంతమైన న్యాయ సేవలు అందించాలని పిలుపునిచ్చారు. అనంతరం పలు కేసుల్లో నిందితులకు శిక్షలు పడడంలో కీలక పాత్ర పోషించిన కోర్టు డ్యూటీ సిబ్బందిని పోలీస్ కమిషనర్ శాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ డీసీపీ (అడ్మిన్) కె. శ్రీనివాస్, సీసీఆర్‌బీ ఇన్‌స్పెక్టర్లు అనిల్ కుమార్, బాబురావు, ఎస్ఐ వినీత, కోర్టు డ్యూటీ సిబ్బంది, కోర్టు లైజనింగ్ అధికారులు పాల్గొన్నారు.

# ఎండుతున్న పంటలు...

## వానల కోసం గణపతికి జలాభిషేకం





నేరడిగొండ, జూలై 18 (ప్రజా జ్యోతి) : మండలంలో వర్షాభావ పరిస్థితులపై రైతాంగం తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తోంది. ప్రస్తుత సీజన్‌లో ఆశించిన స్థాయిలో వర్షాలు కురవకపోవడంతో, ఎంతో కష్టపడి పెట్టుబడులు పెట్టి వేసిన విత్తనాలు మొలకెత్తినప్పటికీ.. కండ్ల ముందే ఎండిపోతున్నాయి. దీంతో రైతుల గుండెల్లో ఉలుకు పుడుతోంది. ఈ నేపథ్యంలో ఎండబెడుతున్న పంటలను, అన్నదాతలను కాపాడాలని కోరుకుంటూ శనివారం బోరిగాం గ్రామ ఆడపడుచులు మండల పరిధిలోని అద్దల తిమ్మాపూర్ అటవీ ప్రాంతంలో వెలిసిన సిద్ధ వినాయక ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు.

**నెత్తిపై నీళ్ల బిందెలతో కాలినడకన.. :** బోరిగాం గ్రామానికి చెందిన మహిళలు ఉదయాన్నే తమ నెత్తిపై నీళ్ల బిందెలను పెట్టుకుని, కాలినడకన అద్దల తిమ్మాపూర్ గణపతి ఆలయానికి తరలివెళ్లారు.ఆలయానికి చేరుకున్న ఆడపడుచులు విఘ్నేశ్వరుడికి బిందెలతో తెచ్చిన నీటితో జలాభిషేకం చేశారు. వర్షాలు సమృద్ధిగా కురవాలని, కరువు తీరాలని స్వామివారికి ప్రత్యేక ప్రార్థనలు చేశారు.వర్షాలు పడని కరువు సమయంలో అద్దల తిమ్మాపూర్ గణపతి ఆలయానికి వెళ్లి బిందెలతో నీళ్లు పోసి వేడుకుంటే వరుణ దేవుడు కరుణిస్తాడని, సమృద్ధిగా వర్షాలు కురుస్తాయని ఇక్కడి ప్రజల గట్టి నమ్మకం. తరతరాలుగా వస్తున్న ఈ సాంప్రదాయాన్ని పాటిస్తూ ఆడపడుచులు ఆలయ ప్రాంగణంలోనే స్వయంగా వంట నవ్యం (ప్రసాదం) తయారు చేసి వినాయకుడికి నైవేద్యంగా సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. ఈ కార్యక్రమంలో గ్రామానికి చెందిన మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## బాసర జడ్పీహెచ్ఎస్ బాలికల పాఠశాల భవనం శిథిలావస్థ







- పెచ్చులూడుతున్న పైకప్పు..
- భయాందోళనలో విద్యార్థినులు,
- ఆందోళనలో తల్లిదండ్రులు..
- ప్రమాదం జరగకముందే చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి

బాసర జూలై 18 (ప్రజాజ్యోతి) : బాసర మండల కేంద్రంలోని జడ్పీహెచ్ఎస్ (గర్ల్స్) పాఠశాల భవనం శిథిలావస్థకు చేరుకోవడంతో విద్యార్థినులు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పాఠశాల భవనం పై అంతస్తులో పలుచోట్ల పైకప్పు పెచ్చులూడి కాంక్రీట్ ముక్కలు ఊడిపడుతున్నాయని, దీంతో ప్రతిరోజూ తరగతులకు హాజరయ్యే విద్యార్థినులు భయాందోళనల మధ్య చదువుకోవాల్సిన పరిస్థితి నెలకొంది. ఈ భవనంలోని పై అంతస్తులో ఆరవ తరగతి నుంచి పదో తరగతి వరకు విద్యార్థినులకు తరగతులు నిర్వహిస్తున్నట్లు తల్లిదండ్రులు తెలిపారు. పైకప్పు నుంచి ఎప్పుడు ఏ భాగం ఊడిపడుతుందో తెలియని పరిస్థితి ఉండటంతో విద్యార్థినుల భద్రతపై ఆందోళన నెలకొంది. చిన్నపాటి ప్రమాదం జరిగినా తీవ్ర పరిణామాలు ఎదురయ్యే అవకాశం ఉందని వారు పేర్కొంటున్నారు. శనివారం నిర్వహించిన తల్లిదండ్రుల సమావేశంలో ఈ అంశం ప్రధాన చర్చగా మారింది. సమావేశానికి హాజరైన తల్లిదండ్రులు పాఠశాల ప్రధానోపాధ్యాయుడిని కలిసి భవనం పరిస్థితిపై వివరణ కోరారు. విద్యార్థుల ప్రాణాలకు ముప్పు ఏర్పడే పరిస్థితులు ఉన్నప్పటికీ ఇప్పటివరకు శాశ్వత చర్యలు తీసుకోకపోవడం పట్ల వారు అసంతృప్తి వ్యక్తం చేశారు. స్థానిక ప్రజాప్రతినిధులు, గ్రామ సర్పంచ్, సంబంధిత అధికారులు, స్థానిక ఎమ్మెల్యే వెంటనే స్పందించి భవనాన్ని సాంకేతికంగా పరిశీలించాలని, అవసరమైతే ప్రమాదకర గదులను మూసివేసి ప్రత్యామ్నాయ తరగతి గదులు ఏర్పాటు చేయాలని తల్లిదండ్రులు డిమాండ్ చేశారు. విద్యార్థులు, ఉపాధ్యాయులకు ఎలాంటి ప్రమాదం జరగకముందే నూతన భవనం నిర్మాణం లేదా అత్యవసర మరమ్మతులు చేపట్టాలని విజ్ఞప్తి చేశారు. విద్యార్థుల భద్రత విషయంలో నిర్లక్ష్యం తగదని, ప్రమాదం జరిగిన తర్వాత స్పందించడం కంటే ముందస్తు చర్యలే ప్రాణాలను కాపాడతాయని తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు వెంటనే స్పందించి సమస్యను పరిష్కరించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

## పోలీస్- న్యాయ స్థానాల సమన్వయంతో పెండింగ్ కేసులు పరిష్కార దిశగా చర్యలు తీసుకుంటాం





- సంయుక్త సమావేశంలో జిల్లా సెషన్స్ జడ్జ్ శ్రీమతి ఏ శ్రీవాణి
- ఎస్పీ డాక్టర్ జి జానకి షర్మిలాల వెల్లడి

ఖానాపూర్ జూలై 18(ప్రజా జ్యోతి) :

క్రిమినల్ కేసుల సత్వర పరిష్కారమే లక్ష్యం -- పోలీసు, న్యాయస్థానాల సమన్వయ సమావేశం శనివారం జిల్లా కేంద్రంలో జరిగింది. అండర్ ట్రయల్ ఖైదీల కేసులకు ప్రాధాన్యం౯ నాణ్యమైన దర్యాప్తు౯ కోర్టు ప్రక్రియల సమర్థ అమలుపై సమీక్ష నిర్వహిం తెలంగాణ హైకోర్టు మార్గదర్శకాల మేరకు క్రిమినల్ కేసుల సత్వర పరిష్కారం కోసం సమన్వయంగా పరిష్కార దిశలో చర్యలు తీసుకున్నట్లు జిల్లా సెషన్స్ జడ్జి శ్రీమతి శ్రీవాణి జిల్లా ఎస్పీ డాక్టర్ జి జానకి షర్మిలలు వెల్లడించారు ముఖ్యంగా అండర్ ట్రయల్ ఖైదీలకు సంబంధించిన కేసుల విచారణను వేగవంతం చేయడం, పోలీసు శాఖ--న్యాయస్థానాల మధ్య సమన్వయాన్ని మరింత బలోపేతం చేయడం లక్ష్యంగా జిల్లా కో-ఆర్డినేషన్ కమిటీ సమావేశం నిర్మల్ జిల్లా ప్రధాన జిల్లా ౘ సెషన్స్ కోర్టు నిర్వహించిన సందర్భంగా జిల్లా ౘ సెషన్స్ జడ్జి శ్రీమతి ఎస్. శ్రీవాణి జిల్లా ఎస్పీ డా. జి. జానకి షర్మిల, సంయుక్త జరిగిన ఈ సమావేశంలో పెండింగ్ క్రిమినల్ కేసుల పురోగతి, అండర్ ట్రయల్ ఖైదీల కేసుల త్వరిత విచారణ, చార్జ్‌షీట్లను సకాలంలో దాఖలు చేయడం, సాక్షుల హాజరును నిర్ధారించడం, కోర్టు సమన్లు, వారెంట్లను వెంటనే అమలు చేయడం జరుగుతుందన్నారు, నాణ్యమైన దర్యాప్తు ద్వారా నేరస్థులకు శిక్షలు పడేలా పటిష్టమైన సాక్ష్యాధారా లను సమర్పించడం వంటి అంశాలపై చర్చించారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ డా.జి.జానకి షర్మిల, మాట్లాడుతూ, ప్రజలకు సత్వర న్యాయం అందించడంలో పోలీసు శాఖ, ప్రాసిక్యూషన్, న్యాయస్థానాల మధ్య సమర్థవంతమైన సమన్వయం అత్యంత కీలకమని అన్నారు. ప్రతి దర్యాప్తు అధికారి చట్టపరమైన ప్రమాణాలను కచ్చితంగా పాటిస్తూ నాణ్యమైన దర్యాప్తు చేపట్టాలని, కోర్టు ఆదేశాల అమలులో ఎలాంటి జాప్యానికి తావు లేకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. దర్యాప్తు నాణ్యత పెంపుపై ప్రత్యేక దృష్టి సారించి, నేరస్థులకు శిక్షలు పడేలా శాస్త్రీయ ఆధారాలతో కేసులను బలోపేతం చేయాలని అధికారులను ఆదేశించారు.

అనంతరం ఈ సందర్భంగా జిల్లా, సెషన్స్ జడ్జి శ్రీమతి ఎస్. శ్రీవాణి మాట్లాడుతూ, హైకోర్టు సూచనల మేరకు కో-ఆర్డినేషన్ కమిటీ సమావేశాల ద్వారా క్రిమినల్ కేసుల త్వరిత పరిష్కారానికి అవసరమైన చర్యలను ఎప్పటికప్పుడు సమీక్షిస్తున్నామని తెలిపారు. ముఖ్యంగా అండర్ ట్రయల్ ఖైదీలకు సంబంధించిన కేసులను వేగవంతంగా పరిష్కరించేందుకు పోలీసు, ప్రాసిక్యూషన్, న్యాయస్థాన అధికారులు పరస్పర సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ఈ సమావేశంలో సీనియర్ సివిల్ జడ్జి శ్రీమతి రాధిక, ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి రవీందర్ 1వ అదనపు జూనియర్ సివిల్ జడ్జి భవిష్యత్ 2వ అదనపు జూనియర్ సివిల్ జడ్జి శ్రీమతి నికిత నిర్మల్ డీఎస్పీ శ్రీనివాస్ జిల్లా జైలర్ సూర్యప్రకాశ్ రెడ్డి పబ్లిక్ ప్రాసిక్యూటర్లు, సీఐలు, ఎస్ఐలు, సీడీఓలు, న్యాయస్థాన అధికారులు, ఎక్సైజ్ శాఖ అధికారులు పోలీసు శాఖ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## పోలీస్- న్యాయ స్థానాల సమన్వయంతో పెండింగ్ కేసులు పరిష్కార దిశగా చర్యలు తీసుకుంటాం



సంయుక్త సమావేశంలో జిల్లా సెషన్స్ జడ్జ్ ఏ శ్రీవాణి ఎస్పీ డాక్టర్ జి జానకి షర్మిలాల వెల్లడి



ఖానాపూర్ జూలై 18( ప్రజా జ్యోతి) : క్రిమినల్ కేసుల సత్వర పరిష్కారమే లక్ష్యం -- పోలీసు, న్యాయస్థానాల సమన్వయ సమావేశం శనివారం జిల్లా కేంద్రంలో జరిగింది. అండర్ ట్రయల్ ఖైదీల కేసులకు ప్రాధాన్యం౯ నాణ్యమైన దర్యాప్తు౯ కోర్టు ప్రక్రియల సమర్థ అమలుపై సమీక్ష నిర్వహిం తెలంగాణ హైకోర్టు మార్గదర్శకాల మేరకు క్రిమినల్ కేసుల సత్వర పరిష్కారం కోసం సమన్వయంగా పరిష్కార దిశలో చర్యలు తీసుకున్నట్లు జిల్లా సెషన్స్ జడ్జి శ్రీమతి శ్రీవాణి జిల్లా ఎస్పీ డాక్టర్ జి జానకి షర్మిలలు వెల్లడించారు ముఖ్యంగా అండర్ ట్రయల్ ఖైదీలకు సంబంధించిన కేసుల విచారణను వేగవంతం చేయడం, పోలీసు శాఖ--న్యాయస్థానాల మధ్య సమన్వయాన్ని మరింత బలోపేతం చేయడం లక్ష్యంగా జిల్లా కో-ఆర్డినేషన్ కమిటీ సమావేశం నిర్మల్ జిల్లా

ప్రధాన జిల్లా ౘ సెషన్స్ కోర్టు నిర్వహించిన సందర్భంగా.. జిల్లా ౘ సెషన్స్ జడ్జి శ్రీమతి ఎస్. శ్రీవాణి జిల్లా ఎస్పీ డా. జి. జానకి షర్మిల, సంయుక్త జరిగిన ఈ సమావేశంలో పెండింగ్ క్రిమినల్ కేసుల పురోగతి, అండర్ ట్రయల్ ఖైదీల కేసుల త్వరిత విచారణ, చార్జ్‌షీట్లను సకాలంలో దాఖలు చేయడం, సాక్షుల హాజరును నిర్ధారించడం, కోర్టు సమన్లు, వారెంట్లను వెంటనే అమలు చేయడం జరుగుతుందన్నారు, నాణ్యమైన దర్యాప్తు ద్వారా నేరస్థులకు శిక్షలు పడేలా పటిష్టమైన సాక్ష్యాధారాలను సమర్పించడం వంటి అంశాలపై చర్చించారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ డా. జి. జానకి షర్మిల, మాట్లాడుతూ, ప్రజలకు సత్వర న్యాయం అందించడంలో పోలీసు శాఖ, ప్రాసిక్యూషన్, న్యాయస్థానాల మధ్య సమర్థవంతమైన సమన్వయం అత్యంత కీలకమని అన్నారు. ప్రతి దర్యాప్తు అధికారి చట్టపరమైన ప్రమాణాలను కచ్చితంగా పాటిస్తూ నాణ్యమైన దర్యాప్తు చేపట్టాలని, కోర్టు ఆదేశాల అమలులో ఎలాంటి జాప్యానికి తావు లేకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. దర్యాప్తు నాణ్యత పెంపుపై ప్రత్యేక దృష్టి సారించి, నేరస్థులకు శిక్షలు పడేలా శాస్త్రీయ ఆధారాలతో కేసులను బలోపేతం చేయాలని అధికారులను ఆదేశించారు.

అనంతరం ఈ సందర్భంగా జిల్లా, సెషన్స్ జడ్జి శ్రీమతి ఎస్. శ్రీవాణి మాట్లాడుతూ, హైకోర్టు సూచనల మేరకు కో-ఆర్డినేషన్ కమిటీ సమావేశాల ద్వారా క్రిమినల్ కేసుల త్వరిత పరిష్కారానికి అవసరమైన చర్యలను ఎప్పటికప్పుడు సమీక్షిస్తున్నామని తెలిపారు. ముఖ్యంగా అండర్ ట్రయల్ ఖైదీలకు సంబంధించిన కేసులను వేగవంతంగా పరిష్కరించేందుకు పోలీసు, ప్రాసిక్యూషన్, న్యాయస్థాన అధికారులు పరస్పర సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ఈ సమావేశంలో సీనియర్ సివిల్ జడ్జి శ్రీమతి రాధిక , ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి రవీందర్ 1వ అదనపు జూనియర్ సివిల్ జడ్జి భవిష్యత్ 2వ అదనపు జూనియర్ సివిల్ జడ్జి శ్రీమతి నికిత నిర్మల్ డీఎస్పీ శ్రీనివాస్ జిల్లా జైలర్ సూర్యప్రకాశ్ రెడ్డి పబ్లిక్ ప్రాసిక్యూటర్లు, సీఐలు, ఎస్ఐలు, సీడీఓలు, న్యాయస్థాన అధికారులు, ఎక్సైజ్ శాఖ అధికారులు పోలీసు శాఖ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## పాత ఎల్లాపూర్ హైస్కూల్లో పేరెంట్స్ సమావేశంలో పాల్గొన్న ఎంపీడీవో రాథోడ్ రాధా



ఖానాపూర్ జూలై 18 (ప్రజాజ్యోతి) : విద్య ప్రమాణాలను పెంపొందే దిశలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతి మూడవ శనివారం పాఠశాల విద్యార్థుల పేరెంట్స్‌తో పాటు ఉపాధ్యాయుల సమావేశం నిర్వహించా లన్న సందర్భంగా ఖానాపూర్ మండలంలోని పాతల్లాపూర్ హైస్కూల్లో ఎంపీడీవో రాథోడ్ రాధా సర్పంచ్ ఏలేటి ప్రశాంత్ రెడ్డి ఆధ్వర్యంలో సమావేశం జరిగింది ఈ సందర్భంగా విద్యార్థుల వసతులతో పాటు విద్యార్థుల్ని సరిగా పాఠశాలకు పంపేందుకు పేరెంట్స్ శ్రద్ధ తీసుకోవాలని సూచించారు ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు ఆసూరి రమాదేవితో పాటు ఉపాధ్యాయ బృందం పాఠశాల పేరెంట్స్ తదితరులు పాల్గొన్నారు పాఠశాలలో మొక్కలు నాటారు పేరెంట్స్ కమిటీ ఆధ్వర్యంలో సర్పంచ్ ప్రశాంత్ రెడ్డి తో పాటు పేరెంట్స్ కమిటీ ఉపాధ్యాయ బృందం కలిసి ఎంపీడీవో రాథోడ్ రాధా ప్రధానోపాధ్యాయులు ఆసూరి రమాదేవిలను సన్మానించారు.

## జై భారత్ వ్యవస్థాపకులు రమణమూర్తిపై దాడిని ఖండిస్తూ నిరసన



మంచిర్యాల, 18, జులై (ప్రజాజ్యోతి) : జై భారత్ వ్యవస్థాపకులు, హిందుస్థానీ గోరక్షా సమితి కన్వీనర్ రమణమూర్తిపై హైదరాబాద్‌లో టీవీ చర్చ సందర్భంగా జరిగిన దాడికి బాధ్యులైన నిందితులను వెంటనే అరెస్టు చేసి కఠినంగా శిక్షించాలని వివిధ ప్రజాసంఘాల నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు శనివారం మంచిర్యాల అంబేద్కర్ విగ్రహం వద్ద ప్రజాసంఘాల ఆధ్వర్యంలో నిరసన ప్రదర్శన నిర్వహించారు. రమణమూర్తికి మద్దతుగా ప్లకార్డులు ప్రదర్శిస్తూ నిందితులపై కఠిన చర్యలు తీసుకోవాలని నినాదాలు చేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, అయోధ్యలో జరుగుతున్న అవినీతిపై ఓ టీవీ ఛానల్‌లో జరిగిన చర్చలో రమణమూర్తి చేసిన వ్యాఖ్యలను వక్రీకరించి, దురుద్దేశపూర్వకంగానే ఈ దాడికి పాల్పడ్డారని ఆరోపించారు. హిందూ పరిరక్షణ సమితి బస్సు యాత్ర ద్వారా ఉభయ తెలుగు రాష్ట్రాల్లో అనేక దేవాలయాలను సందర్శించి, హిందూ ధర్మ పరిరక్షణ కోసం రమణమూర్తి విశేషంగా కృషి చేశారని పేర్కొన్నారు. తిరుపతిలో అన్నమయ్య విగ్రహ ఏర్పాటులో ఆయన చేసిన సేవలను గుర్తుంచుకోవాలని అన్నారు. హిందూ ధర్మ పరిరక్షణకు కృషి చేసిన వ్యక్తిపై ఈ విధంగా దాడి చేయడం దురదృష్టకరమని, ఇటువంటి ఘటనలు సమాజంలో విద్వేషాలను రెచ్చగొట్టే ప్రమాదం ఉందన్నారు. రాష్ట్రంలో సర్వమత సామరస్యం కొనసాగాలని, విభజనాత్మక ధోరణులకు తెలంగాణలో స్థానం లేదని స్పష్టం చేశారు. దాడి జరిగిన నాలుగు రోజులైనా రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటివరకు నిందితులపై తగిన చర్యలు తీసుకోలేదని విమర్శించారు. దేశ ప్రజలు ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యల నుంచి దృష్టి మళ్లించేందుకే ఇటువంటి రాజకీయాలు జరుగుతున్నాయని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో కుల వివక్ష వ్యతిరేక పోరాట సంఘం జిల్లా కార్యదర్శి దూర్కె మోహన్, జై భారత్ కమిటీ జిల్లా నాయకులు మనస్వూరి రమేష్, సామాజిక న్యాయ వేదిక కన్వీనర్ రంగు రాజేశం, బీసీ ఐక్య వేదిక జిల్లా అధ్యక్షులు కనుకుంట్ల మల్లయ్య, బీసీ సంఘాల జాతీయ వేదిక నాయకులు గుమ్ముల శ్రీనివాస్, బీసీ సబ్ ప్లాన్ సాధన సమితి కన్వీనర్ మోతె రామదాసు, సామాజిక ఉద్యమకారులు కైలాసం, మేతరి లక్ష్మీనారాయణ, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

## ఉపాధి నైపుణ్యాలతో మహిళలు ఆర్థిక స్వావలంబన సాధించాలి: ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్ రెడ్డి

గద్వాల జూలై 18(ప్రజా జ్యోతి ప్రతినిధి): వివిధ సంస్థలు నిర్వహించే నైపుణ్యాభివృద్ధి శిక్షణ కార్యక్రమాలను మహిళలు సద్వినియోగం చేసుకుంటే ఉపాధి అవకాశాలు మెరుగుపడి ఆర్థిక స్వావలంబన సాధించవచ్చని ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్ రెడ్డి అన్నారు.శనివారం జిల్లా కేంద్రంలోని బీఎస్ఎన్ఎల్ కార్యాలయం సమీపంలో ఉన్న గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ కేంద్రంలో యూనియన్






బ్యాంక్ ఆధ్వర్యంలో మహిళలకు నిర్వహించిన ఉచిత నైపుణ్య శిక్షణ ముగింపు కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నెల రోజుల పాటు టైలరింగ్, బ్యూటీ పార్లర్,ఎంబ్రాయిడరీ వంటి రంగాల్లో శిక్షణ పొందిన మహిళలు స్వయం ఉపాధి ప్రారంభించి ఆదాయం పొందవచ్చన్నారు.ప్రస్తుతం మహిళలు కూడా పురుషులతో సమానంగా అన్ని రంగాల్లో ప్రతిభ కనబరుస్తున్నారని పేర్కొన్నారు.గ్రామీణ ప్రాంత మహిళలు స్వయం సహాయక సంఘాల ద్వారా బ్యాంకులు అందించే రుణాలను వినియోగించుకొని చిన్న పరిశ్రమలు,ఉపాధి యూనిట్లు స్థాపించి ఆర్థికంగా బలోపేతం కావాలని సూచించారు.గద్వాల ప్రాంతానికి ప్రత్యేక గుర్తింపు తీసుకువచ్చే ఉత్పత్తుల తయారీ పరిశ్రమలను మహిళలు ఏర్పాటు చేయాలని,అందుకు అవసరమైన శిక్షణ,రుణ సదుపాయాల కల్పనకు తన వంతు సహకారం అందిస్తానని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ తుమ్మల జయలక్ష్మి ,వైస్ చైర్మన్ శంకర్,ఎల్‌డీఎం శ్రీనివాసరావు,ఏపీడీ శ్రీనివాస్,ఆర్‌సెటీఐ డైరెక్టర్ శ్రీనివాస్ నాయక్, పలువురు కౌన్సిలర్లు,మాజీ ప్రజాప్రతినిధులు,నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## ఇందిరమ్మ బిల్లుల సమస్యను పరిష్కరించాలి

-హౌసింగ్ ఎండీ గౌతమ్ కు ఎమ్మెల్యే రాజేష్ రెడ్డి వినతి

నాగర్ కర్నూల్ : జులై 18 ( ప్రజా జ్యోతి) హైదరాబాద్‌లోని సచివాలయంలో శనివారం హౌసింగ్ మేనేజింగ్ డైరెక్టర్ గౌతమ్ ను నాగర్ కర్నూల్ ఎమ్మెల్యే డాక్టర్.కూచుకుళ్ల రాజేష్



రెడ్డి మర్యాదపూర్వకంగా కలిసి నాగర్ కర్నూల్ నియోజకవర్గంలో ఇందిరమ్మ ఇళ్లకు సంబంధించి ఎల్–3 బిల్లుల విడుదలలో నెలకొన్న సమస్యలను హౌసింగ్ ఎండీ గౌతమ్ కు వివరించి లబ్ధిదారులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను గుర్తించి పెండింగ్ బిల్లులను త్వరితగతిన విడుదల చేసి,అర్హులైన లబ్ధిదారులకు న్యాయం చేయాలని కోరుతూ వినతి పత్రాన్ని అందజేశారు.వినతిని స్వీకరించిన హౌసింగ్ ఎండీ గౌతమ్ సమస్యను సానుకూలంగా పరిశీలించి,నిబంధనలకనుగుణంగా త్వరితగతిన పరిష్కారం చూపేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే కు హామీ ఇచ్చారు. నియోజకవర్గ ప్రజల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి,పరిష్కారం అయ్యేలా నిరంతరం కృషి చేస్తానని ఎమ్మెల్యే తెలిపారు.

## ఎస్ఐఆర్-2026 డిజిటలైజేషన్‌లో ఖచ్చితత్వమే కీలకం – అదనపు కలెక్టర్ మధుసూదన్ నాయక్

మహబూబ్‌నగర్, జూలై 17 ( ప్రజా జ్యోతి బ్యూరో ) స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ మధుసూదన్ నాయక్ శనివారం మూసాపేట మండలంలోని పోల్కంపల్లి, జానంపేట గ్రామాల్లో పర్యటించి ఎస్ఐఆర్–2026 ఎన్యుమరేషన్ ఫారాల డిజిటలైజేషన్ ప్రక్రియను పరిశీలించారు.



పోల్కంపల్లిలో డిజిటలైజేషన్ కేంద్రాన్ని సందర్శించిన ఆయన పనుల పురోగతి, నాణ్యత, ఖచ్చితత్వాన్ని సమీక్షించి విధుల్లో ఉన్న అధికారులు, సిబ్బందితో మాట్లాడారు. డిజిటలైజేషన్ పనులను నిర్దేశిత గడువులోగా పూర్తి చేయడంతో పాటు ఖచ్చితత్వం, పారదర్శకత, డేటా సమగ్రతకు అత్యంత ప్రాధాన్యం ఇవ్వాలని ఆదేశించారు. అనంతరం గుర్తింపు పొందిన వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశమై ఎస్ఐఆర్–2026 కార్యక్రమం, పోలింగ్ కేంద్రాల ఏర్పాట్లు తదితర అంశాలపై చర్చించారు. తదుపరి జానంపేట గ్రామ ప్రాథమిక పాఠశాలను తనిఖీ చేసిన అదనపు కలెక్టర్ తరగతి గదులను సందర్శించి పాఠశాల నిర్వహణ, విద్యార్థుల హాజరు, విద్యా ప్రగతి, రికార్డుల నిర్వహణ, ప్రభుత్వ విద్యా కార్యక్రమాల అమలును సమీక్షించారు. విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించాలని సంబంధిత అధికారులకు సూచించారు. అనంతరం జానంపేటలోని ఎస్ఐఆర్–2026 ఎన్యుమరేషన్ ఫారాల డిజిటలైజేషన్ కేంద్రాన్ని పరిశీలించి, ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా పనులను వేగవంతంగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు.

# ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల నమోదు శాతాన్ని పెంచాలి

- విద్యా నాణ్యత పెంపుపై ప్రత్యేక దృష్టి సారించాలి
- జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటిల్

నాగర్ కర్నూల్ జులై 18 (ప్రజా జ్యోతి జిల్లా ప్రతినిధి) విద్యార్థుల నమోదు, విద్యా ప్రమాణాలు, మధ్యాహ్న భోజనం, కేజీబీవీల నిర్వహణ, మౌలిక వసతులపై విద్యాశాఖ అధికారులతో జిల్లా కలెక్టర్ సుదీర్ఘ సమీక్ష ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల నమోదు శాతాన్ని పెంచడం, విద్యార్థుల విద్యా ప్రగతిని మెరుగుపరచడం, విద్యా నాణ్యతను ఉన్నత స్థాయికి తీసుకెళ్లడం ప్రతి విద్యాశాఖ అధికారి, ప్రతిఉపాధ్యాయుడి ప్రధాన బాధ్యత అని జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటిల్ స్పష్టం చేశారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య పెరగాలంటే ముందుగా విద్యా ప్రమాణాలు మెరుగుపడాలని, తల్లిదండ్రుల్లో ప్రభుత్వ పాఠశాలలపై విశ్వాసాన్ని పెంపొందించే విధంగా ప్రతి ఒక్కరూ అంకితభావంతో పనిచేయాలని సూచించారు. శనివారం నాగర్ కర్నూల్ జిల్లా కేంద్రంలోని జిల్లా పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో మండల విద్యాధికారులు (ఎంఈఓలు), స్కూల్ కాంప్లెక్స్..ప్రధానోపాధ్యాయులు, కస్తూర్బా గాంధీ బాలిక విద్యాలయాల (కేజీబీవీ) ప్రత్యేక అధికారులు, జిల్లా విద్యాశాఖ అధికారులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో కలెక్టర్ విద్యార్థుల నమోదు, ప్రీ–ప్రైమరీ ప్రవేశాలు, ప్రభుత్వ పాఠశాలల్లో బోధన నాణ్యత, ఉపాధ్యాయుల హాజరు, పాఠశాలల్లో మౌలిక సదుపాయాలు,పాఠశాలల అదనపు తరగతి గదుల నిర్మాణాలు, మధ్యాహ్న భోజన పథకం, కేజీబీవీల నిర్వహణ, పాఠశాలల్లో మౌలిక వసతులు తదితర అంశాలపై పాఠశాలల వారీగా కలెక్టర్ సమగ్రంగా సమీక్షించారు. ఈ సమావేశంలో జిల్లా కలెక్టర్ హెమంత కేశవ్ పాటీల్ మాట్లాడుతూ. "కారణాలు చెప్పడం కాదు... ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల నమోదు శాతాన్ని పెంచేలా విద్యా ప్రగతిని చూడండి. ప్రతి విద్యార్థి ఎంత నేర్చుకుంటున్నాడు, ఎంత అభివృద్ధి చెందుతున్నాడు, ప్రభుత్వ పాఠశాలలపై తల్లిదండ్రులకు ఎంత నమ్మకం పెరుగుతోంది అనేదే మన పనితీరుకు కొలమానం కావాలి అని స్పష్టం చేశారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల నమోదు పెంపులో స్కూల్ కాంప్లెక్స్.. ప్రధానోపాధ్యాయులు, మండల విద్యాధికారులు సమన్వయంతో పనిచేసి మంచి ఫలితాలు సాధించారని కలెక్టర్ అభినందించారు. జిల్లాలో విద్యార్థుల నమోదు పెరగడానికి కృషి చేసిన ప్రతి ఉపాధ్యాయుడికి ప్రత్యేకంగా శుభాకాంక్షలు తెలిపారు. ఇదే ఉత్సాహాన్ని కొనసాగించి జిల్లాను రాష్ట్రంలో ఆదర్శ జిల్లాగా నిలపాలని కోరారు. అయితే కొన్ని మండలాల్లో ప్రీ–ప్రైమరీ తరగతుల్లో విద్యార్థుల నమోదు ఆశించిన స్థాయిలో జరగలేదని కలెక్టర్ అసంతృప్తి వ్యక్తం చేశారు. ఈ నెలాఖరు నాటికి ఐదేళ్లు నిండిన ప్రతి బాలబాలిక ప్రభుత్వ పాఠశాలలో నమోదు అయ్యేలా ప్రత్యేక కార్యాచరణ రూపొందించాలని ఆదేశించారు.ప్రతి పాఠశాల పరిధిలోని గ్రామానికి సంబంధించిన వివరాలను సేకరించి, ఒక్కో విద్యార్థి బాధ్యతను ఒక్కో ఉపాధ్యాయుడికి అప్పగించాలని సూచించారు. ఇంటింటికి వెళ్లి తల్లిదండ్రులతో మాట్లాడి



ప్రభుత్వ పాఠశాలలపై అవగాహన కల్పించాలని, ఒక్క చిన్నారి కూడా విద్యకు దూరం కాకుండా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సూచించారు. ఈ సందర్భంగా కలెక్టర్ ఈరోజు మనం ఉన్నత స్థానాల్లో ఉండడానికి ప్రధాన కారణం, ప్రభుత్వ పాఠశాలలే పునాది. మనమందరం ప్రభుత్వ పాఠశాలల్లోనే చదివి ఎదిగాం. మన కుటుంబాలు, మన పిల్లలు మంచి స్థాయిలో ఉండడానికి ఆ పాఠశాలలే కారణం. ఇప్పుడు అదే ప్రభుత్వ పాఠశాలలను మరింత బలోపేతం చేయాల్సిన బాధ్యత మనందరిది. విద్యార్థుల విద్యా ప్రమాణాలను పెంచి ప్రభుత్వ పాఠశాలలను ప్రజల తొలి ఎంపికగా నిలబెట్టాలి అని కలెక్టర్ అన్నారు. తనకు ఉపాధ్యాయులపై చర్యలు తీసుకోవాలనే ఉద్దేశం ఏమాత్రం లేదని స్పష్టం చేసిన కలెక్టర్, విధుల్లో నిర్లక్ష్యం మాత్రం సహించబోమనిహెచ్చరించారు. శుక్రవారం కల్వకుర్తిలో నిర్వహించిన ఆకస్మిక తనిఖీలో పాఠశాల ప్రాంగణం అపరిశుభ్రంగా ఉండడం, మధ్యాహ్న భోజనం తయారుచేసే ప్రదేశం అధ్వాన్నంగా ఉండడం, పిల్లల తరగతి గది కూలేస్థితిలో ఉండడం, మంచి తరగతి గదిని స్టాఫ్ రూమ్ గా మార్చి తాళం వేయడం, ప్రధానోపాధ్యాయుడు గైర్హాజరు కావడం, ఐదుగురు ఉపాధ్యాయుల్లో ఇద్దరు మాత్రమే విద్యార్థులకు బోధన నిర్వహించడం వంటి పరిస్థితులను ప్రత్యక్షంగా చూసిన తర్వాతే సంబంధిత ప్రధానోపాధ్యాయుడిని సస్పెండ్ చేయాల్సి వచ్చిందని జిల్లా కలెక్టర్ సందర్భంగా వివరించారు. అది వ్యక్తిగత చర్య కాదని, విద్యార్థుల ప్రయోజనాల కోసమే తీసుకున్న పరిపాలనా నిర్ణయమని కలెక్టర్ తెలిపారు. జిల్లాలోని ఎంఈఓలు, స్కూల్ కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు, స్కూల్ అసిస్టెంట్లు, ఎస్‌జీటీలు, ఇతర ఉపాధ్యాయులు ఎవరైనా అనుమతి లేకుండా గైర్హాజరైతే కఠిన చర్యలు తీసుకుంటామని కలెక్టర్ ఈ సందర్భంగా హెచ్చరించారు. అయితే నిబంధనల ప్రకారం లభించే సెలవులను వినియోగించుకోవడంపై ఎలాంటి అభ్యంతరం లేదని, అత్యవసర పరిస్థితుల్లో వాట్సాప్ ద్వారా ఉన్నతాధికారులకు సమాచారం అందించి సెలవు పొందవచ్చని చెప్పారు. కానీ పాఠశాలకు వచ్చి హాజరు నమోదు చేసి,



విధి సమయం ముగియకముందే వెళ్లిపోవడం వంటి చర్యలను ఏమాత్రం సహించబోమని జిల్లా కలెక్టర్ స్పష్టం చేశారు. ఉపాధ్యాయులు ప్రతిరోజూ సమయపాలన పాటించాలని, విద్యార్థుల ఎఫ్ఆర్ఎస్ హాజరుతో పాటు ఉపాధ్యాయుల హాజరు కూడా కచ్చితంగా నమోదు కావాలని ఆదేశించారు. మండల విద్యాధికారులు, స్కూల్ కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు ప్రతిరోజూ పాఠశాలలను సందర్శించి బోధన, హాజరు, పరిశుభ్రత, విద్యార్థుల అభ్యాస స్థాయిని క్షేత్రస్థాయిలో పరిశీలించాలని సూచించారు. మధ్యాహ్న భోజన పథకంపై ప్రత్యేకంగా చర్చించిన కలెక్టర్, విద్యార్థులకు ప్రభుత్వం నిర్దేశించిన మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం అందించడం ప్రధానోపాధ్యాయుల ప్రత్యక్ష బాధ్యత అని స్పష్టం చేశారు. మెనూలో ఉన్న ప్రతి ఆహార పదార్థం విద్యార్థులకు తప్పనిసరిగా అందేలా చర్యలు తీసుకోవాలని, . ఎక్కడైనా మధ్యాహ్న భోజన నిర్వహణ సంస్థలు సరిగా పనిచేయకపోతే వెంటనే నివేదికలు సమర్పించాలని, అవసరమైతే వారిని తక్షణమే మార్చివేస్తామని హెచ్చరించారు. పాఠశాలల్లో పరిశుభ్రతకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని కలెక్టర్ సూచించారు. తరగతి గదులు, వంటశాలలు, మరుగుదొడ్లు, తాగునీటి సౌకర్యాలు, పాఠశాల ప్రాంగణం ఎల్లప్పుడూ పరిశుభ్రంగా ఉండేలా ప్రధానోపాధ్యాయులు పర్యవేక్షించాలని తెలిపారు. పరిశుభ్రమైన వాతావరణం ఉంటేనే విద్యార్థులు ఆరోగ్యంగా ఉండి చదువులో మెరుగైన ఫలితాలు సాధిస్తారని తెలిపారు. ఇంగ్లీష్ మీడియం ప్రభుత్వ పాఠశాలల్లో తరగతి గదుల్లో సాధ్యమైనంత వరకు ఇంగ్లీష్ భాషలోనే బోధన, సంభాషణ జరిగేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. విద్యార్థుల్లో ఆత్మవిశ్వాసం పెంపొందించే విధంగా ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. కేజీబీవీల నిర్వహణపై కలెక్టర్ తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. కొన్ని కేజీబీవీల్లో పరిపాలనలో లోపాలు ఉన్నాయని, వాటిని వెంటనే సరిచేయాలని ప్రత్యేక అధికారులను హెచ్చరించారు. కేజీబీవీలు బాలికల భద్రత, విద్య, వ్యక్తిత్వ వికాసానికి ఆదర్శ కేంద్రాలుగా ఉండాలని, విద్యార్థినులకు అవసరమైన అన్ని సౌకర్యాలు కల్పించాలని ఆదేశించారు. తల్లిదండ్రుల–ఉపాధ్యాయుల సమావేశం జరిగే రోజుల్లో మాత్రమే ప్రజాప్రతినిధులు, విలేకరులను కేజీబీవీల్లోకి అనుమతించాలని, మిగిలిన రోజుల్లో బాలికల భద్రతా కారణాల దృష్ట్యా ఎవరినీ అనుమతించవద్దని కలెక్టర్ స్పష్టం చేశారు. కేజీబీవీలో పనిచేసే ఉపాధ్యాయులు సిబ్బంది ప్రత్యేక అధికారి ఎవరైనా వ్యవస్థను ఇబ్బందులు కలిగించేలా ప్రవర్తించినా, క్రమశిక్షణకు విరుద్ధంగా వ్యవహరించినా, అలాంటి సంఘటనలను విద్యార్థులకు ప్రోత్సహించినా సంబంధిత అధికారులు, ఉపాధ్యాయులు, సిబ్బందిపై ఉద్యోగాల నుంచి తొలగింపు వరకు కఠిన చర్యలు తీసుకుంటామని కలెక్టర్ హెచ్చరించారు.

ఈ సమీక్ష సందర్భంగా వెల్దండ మండలం బొల్లంపల్లి స్కూల్ కాంప్లెక్స్ పరిధిలో ఐదేళ్ల సంవత్సరాల చిన్నారులు ప్రీ–ప్రైమరీ ప్రవేశాలు ఆశించిన స్థాయిలో లేకపోవడంపై కలెక్టర్ అసంతృప్తి వ్యక్తం చేసి కారణాలను అడిగి తెలుసుకున్నారు. అదే సమయంలో తెలకపల్లి మండలం కార్వంగా, ఊర్కొండ మండలం ఊర్కొండ స్కూల్ కాంప్లెక్స్ పరిధిలో విద్యార్థుల నమోదు గణనీయంగా పెంచిన విధానాన్ని అడిగి తెలుసుకుని ఆయా స్కూల్ కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులను ప్రత్యేకంగా అభినందించారు. ఇతర మండలాలు కూడా వాటిని ఆదర్శంగా తీసుకుని పనిచేయాలని సూచించారు.

జిల్లాలోని ప్రతి ప్రభుత్వ పాఠశాలలో మౌలిక వసతులపై సమగ్ర నివేదికలు సిద్ధం చేసి సమర్పించాలని, ఎక్కడ లోపాలు ఉన్నా వెంటనే పరిష్కరించేలా చర్యలు చేపట్టాలని కలెక్టర్ ఆదేశించారు. ప్రభుత్వం ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి అన్ని వనరులు అందిస్తోందని, వాటిని సమర్థంగా వినియోగించి విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దడం ప్రతి ఉపాధ్యాయుడు, ప్రతి విద్యాధికారి బాధ్యత అని పేర్కొన్నారు. ప్రభుత్వ పాఠశాలలను నాణ్యమైన విద్యకు చిరునామాగా తీర్చిదిద్దేందుకు అందరూ సమిష్టిగా కృషి చేయాలని జిల్లా కలెక్టర్ హేమంత్ కేశవ్ పాటీల్ అధికారులను సూచించారు.

ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ దేవ సహాయం, జిల్లా విద్యాశాఖ అధికారి ఏ రమేష్ కుమార్, డిప్యూటీ సీఈవో గోపాల్ నాయక్, సెక్టోరియల్ అధికారులు కిరణ్ కుమార్, నూరుద్దీన్, టెక్స్ట్ బుక్ మేనేజర్ నరసింహులు, విద్యాశాఖ కార్యాలయ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## ఎల్‌నినో పరిస్థితులపై ఉమ్మడి జిల్లా సమీక్షకు సిద్ధం కావాలి:కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్

గద్వాల జూలై 18(ప్రజా జ్యోతి ప్రతినిధి): ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో ఎల్‌నినో ప్రభావం,వర్షాభావ పరిస్థితులపై ఈ నెల 20న జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి అధ్యక్షతన నిర్వహించనున్న ఉమ్మడి జిల్లా స్థాయి సమీక్ష సమావేశానికి





అన్ని శాఖల అధికారులు పూర్తి సమాచారంతో సిద్ధంగా ఉండాలని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ ఆదేశించారు. శనివారం హైదరాబాద్ నుంచి రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు అన్ని జిల్లాల కలెక్టర్లు,ప్రత్యేక అధికారులు,ఉన్నతాధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి ఎల్‌నినో ప్రభావంతో ఏర్పడిన వర్షాభావ పరిస్థితులు,ఈ నెల 20న నిర్వహించనున్న ఉమ్మడి జిల్లా స్థాయి సమీక్ష సమావేశంపై దిశానిర్దేశం చేశారు.ఈ సందర్భంగా ప్రధాన కార్యదర్శి మాట్లాడుతూ,ప్రభుత్వం నియమించిన ప్రత్యేక అధికారుల ఆధ్వర్యంలో ఈ నెల 20వ తేదీన జిల్లా ఇన్‌చార్జి మంత్రి అధ్యక్షతన ఉమ్మడి జిల్లా స్థాయిలో సమీక్ష సమావేశాలు నిర్వహించనున్నట్లు తెలిపారు.ఈ సమావేశాల్లో వర్షాభావ పరిస్థితులు, తాగునీటి వనరుల లభ్యత,వ్యవసాయ,ఉద్యాన పంటల పరిస్థితి,ప్రత్యామ్నాయ పంటల సాగు,భూగర్భ జలాల పరిస్థితి,విద్యుత్ సరఫరా,పశువులకు మేత,తాగునీటి ఏర్పాట్లు,నీటి సంరక్షణ చర్యలు తదితర అంశాలపై శాఖల వారీగా సమగ్ర సమీక్ష నిర్వహించి అవసరమైన నిర్ణయాలు తీసుకోనున్నట్లు పేర్కొన్నారు.ఇందుకోసం సంబంధిత శాఖల అధికారులు పూర్తి సమాచారంతో సిద్ధంగా ఉండాలని ఆదేశించారు.గద్వాల ఐడీఓసీ వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుంచి జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ సంబంధిత జిల్లా అధికారులతో కలిసి వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్నారు.అనంతరం ఆయన మాట్లాడుతూ,సోమవారం జరిగే ఉమ్మడి జిల్లా స్థాయి సమీక్ష సమావేశానికి అన్ని శాఖల అధికారులు శాఖల వారీగా పూర్తి సమాచారంతో సిద్ధంగా ఉండాలని సూచించారు.జిల్లాలోని వర్షాభావ పరిస్థితులు, తాగునీటి లభ్యత,జలాశయాల్లో నీటి నిల్వలు, వ్యవసాయ,ఉద్యాన పంటల పరిస్థితి,భూగర్భ జలాల స్థితి,విద్యుత్ సరఫరా తదితర అంశాలపై పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా సమగ్ర వివరాలు సమర్పించాలని ఆదేశించారు.ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ నర్సింగరావు,వివిధ శాఖల జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## వడ్డేపల్లిలో ఘనంగా వనమహోత్సవం-ప్రజలందరూ మొక్కలు నాటి సంరక్షించాలి:కమిషనర్ అశోక్ రెడ్డి

వడ్డేపల్లి జూలై 18(ప్రజా జ్యోతి): వడ్డేపల్లి పురపాలక సంఘం పరిధిలోని 3వ,వార్డులో శనివారం రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు నిర్వహిస్తున్న వనమహోత్సవం కార్యక్రమంలో భాగంగా శివ శివాని స్కూల్ సమీపంలో,శాంతినగర్–కర్నూలు ప్రధాన రహదారి పక్కన మొక్కలు నాటారు.ఈ కార్యక్రమాన్ని మున్సిపల్ కమిషనర్ అశోక్ రెడ్డి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ, ప్రజలందరూ తమ ఇళ్ల పరిసరాలు,ప్రభుత్వ కార్యాలయాలు,విద్యాసంస్థలు,ఖాళీ స్థలాల్లో విస్తృతంగా మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని పిలుపునిచ్చారు. పర్యావరణ పరిరక్షణ,వాతావరణ సమతుల్యత,భూగర్భ జలాల సంరక్షణ,కాలుష్య నియంత్రణతో పాటు భావితరాలకు స్వచ్ఛమైన,ఆరోగ్యకరమైన వాతావరణాన్ని అందించడంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని సూచించారు.నాటిన ప్రతి మొక్కను చెట్టుగా పెంచే బాధ్యత ప్రతి పౌరుడిదేనని పేర్కొన్నారు.మున్సిపాలిటీ పరిధిలో పచ్చదనాన్ని పెంపొందించేందుకు ప్రభుత్వం చేపట్టిన కార్యక్రమాలకు ప్రజలు సహకరించాలని,ప్రతి ఒక్కరూ కనీసం ఒక మొక్కను నాటి దానిని సంరక్షించాలని విజ్ఞప్తి చేశారు.ఈ కార్యక్రమంలో వైస్ చైర్‌పర్సన్ ఆర్. సారంధ మధుసూదన్ రెడ్డి,1వ,వార్డు కౌన్సిలర్ కె.పావని,3వవార్డు కౌన్సిలర్ వెంకట రామన్ (చిన్ని బాబు),5వ,వార్డు కౌన్సిలర్ ఎన్.యుగంధర్ రెడ్డి,6వ,వార్డు కౌన్సిలర్ హెచ్.దేవమ్మ,9వ,వార్డు కౌన్సిలర్ వడ్డేపల్లి సూరి,ఆర్.మధుసూదన్ రెడ్డి,మున్సిపల్




అధికారులు,సిబ్బంది,ప్రజాప్రతినిధులు, స్థానికులు పెద్ద సంఖ్యలో పాల్గొని మొక్కలు నాటి కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.వనమహోత్సవం వంటి కార్యక్రమాలు పర్యావరణ పరిరక్షణకు ఎంతో దోహదపడతాయని,పచ్చని వడ్డేపల్లి నిర్మాణానికి ప్రతి పౌరుడు తన వంతు బాధ్యతగా మొక్కలను నాటి వాటిని సంరక్షించాలని మున్సిపల్ కమిషనర్ అశోక్ రెడ్డి పునరుద్ఘాటించారు.

## ప్రభుత్వ ఆసుపత్రిలో టీ-హబ్, రేడియాలజీ హబ్‌లను పరిశీలించిన జిల్లా వైద్యారోగ్య శాఖాధికారి

మహబూబ్‌నగర్, జూలై 17 ( ప్రజా జ్యోతి బ్యూరో ) జిల్లా వైద్యారోగ్య శాఖాధికారి డా. ఏ. శ్రీనివాసులు శనివారం మహబూబ్‌నగర్ ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలోని టీ–హబ్, రేడియాలజీ–హబ్‌లను సందర్శించి సేవల తీరును పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయా విభాగాల్లో విధులు నిర్వహిస్తున్న సిబ్బంది వివరాలు, ప్రజలకు అందిస్తున్న ల్యాబ్ సేవల గురించి ఆరా తీసి, సేవల నాణ్యతపై సమీక్ష నిర్వహించారు. రోగులకు నాణ్యమైన, వేగవంతమైన వైద్య సేవలు అందించేందుకు ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా పనిచేయాలని సూచించారు. అలాగే సిబ్బంది సమయపాలన పాటిస్తూ ప్రజలకు మరింత మెరుగైన సేవలు అందించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ప్రోగ్రాం అధికారులు డా. బి. శంకర్, డా. రాజు, సుభాష్ చంద్రతో పాటు ఇతర సిబ్బంది పాల్గొన్నారు.



## ఎల్‌నినో ప్రభావంపై రైతులు అప్రమత్తంగా ఉండాలి: డాక్టర్ పి.అర్చన

- వర్షాభావ పరిస్థితులకు అనుగుణంగా ప్రత్యామ్నాయ పంటల సాగుకు సూచన

గద్వాల జూలై 18(ప్రజా జ్యోతి ప్రతినిధి): జోగులాంబ గద్వాల జిల్లాలో ఎల్‌నినో ప్రభావం కారణంగా సాధారణం కంటే తక్కువ వర్షపాతం నమోదవుతున్న నేపథ్యంలో రైతులు అప్రమత్తంగా ఉండి,వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా వ్యవసాయాన్ని ప్రణాళికాబద్ధంగా చేపట్టాలని తెలంగాణ రైతు విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త,కోఆర్డినేటర్ డాక్టర్ పి.అర్చన సూచించారు.ఎల్‌నినో ప్రభావంతో రుతుపవనాల రాక ఆలస్యం కావడం,వర్షాలు తగ్గిపోవడం,అధిక ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశం ఉన్నందున రైతులు ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు.జిల్లాలో ప్రస్తుతం సుమారు 1,07,082 ఎకరాల్లో పత్తి,24,840 ఎకరాల్లో సీడ్ పత్తి,965 ఎకరాల్లో వరి నారుమడులు,9,066 ఎకరాల్లో కంది,1,000 ఎకరాల్లో మొక్కజొన్న సాగులో ఉన్నాయని పేర్కొన్నారు.సాధారణం కంటే 51 శాతం తక్కువ వర్షపాతం నమోదైన నేపథ్యంలో రైతులు మరింత అప్రమత్తంగా ఉండాలని సూచించారు.వర్షాలు ఆలస్యమైతే జూలై 16 నుంచి 31 వరకు పత్తి,కంది,పెసర,మినుములు,అలసందలు, ఉలవలు,సజ్జలు,రాగులు,పొద్దుతిరుగుడు,ఆముదం,మొక్కజొన్నతో పాటు తక్కువ కాలంలో పండే కూరగాయలను సాగు చేయాలని తెలిపారు.ఆగస్టు1నుంచి15వరకు కంది,అలసందలు,ఉలవలు,ఆముదం,పొద్దుతిరుగుడు,కూరగాయలు,ఆగస్టు 16 నుంచి 31 వరకు నువ్వుల సాగు అనుకూలమని వివరించారు.వర్షాలు సమృద్ధిగా కురిసిన తర్వాత మాత్రమే విత్తనాలు వేయాలని,నేలలో తగినంత తేమ ఉన్నప్పుడే ఎరువులు వేయాలని సూచించారు.అవసరమైన చోట ప్రాణాధార నీటిపారుదలతో పాటు డ్రిప్,స్ప్రింక్లర్ వంటి సూక్ష్మ సేద్య పద్ధతులను వినియోగించి నీటిని పొదుపుగా ఉపయోగించాలని తెలిపారు.దీర్ఘకాలిక పొడి పరిస్థితుల్లో 2 శాతం యూరియా లేదా 1 శాతం పొటాషియం నైట్రేట్ ద్రావణాన్ని రెండు నుంచి మూడు సార్లు ఆకులపై పిచికారీ చేయాలని సూచించారు.వరి సాగులో ప్రత్యామ్నాయ తడపడం–ఆరబెట్టడం పద్ధతిని అనుసరించడం ద్వారా నీటిని పొదుపు చేయవచ్చని, నారుమడులను శాస్త్రీయంగా నిర్వహించాలని తెలిపారు.మొక్కజొన్నలో ఫాల్ ఆర్మీవార్మ్,పత్తిలో త్రిప్స్,తెల్లదోమ వంటి చీడపీడలను నిరంతరం పర్యవేక్షించి సకాలంలో నివారించాలని సూచించారు.



వ్యవసాయ విశ్వవిద్యాలయం ప్రతి మంగళవారం,శుక్రవారం విడుదల చేసే వాతావరణ ఆధారిత వ్యవసాయ సలహాలను రైతులు తప్పనిసరిగా పాటించాలని కోరారు.కలుపు నివారణ, నేల తేమ సంరక్షణ,సమగ్ర పోషక యాజమాన్యం, సమగ్ర చీడపీడల నియంత్రణ,అంతర పంటల సాగు వంటి చర్యల ద్వారా వర్షాభావ ప్రభావాన్ని గణనీయంగా తగ్గించవచ్చని తెలిపారు.భారత వాతావరణ శాఖ,వ్యవసాయ శాఖ విడుదల చేసే వాతావరణ సూచనలను ఎప్పటికప్పుడు గమనిస్తూ వాటికి అనుగుణంగా సాగు నిర్ణయాలు తీసుకోవాలని సూచించారు.ఎల్‌నినో ప్రభావాన్ని పూర్తిగా నివారించడం సాధ్యం కాకపోయినా,ముందస్తు ప్రణాళిక,సరైన పంటల ఎంపిక,నీటి పొదుపు,తేమ సంరక్షణ,శాస్త్రీయ వ్యవసాయ పద్ధతుల అమలు ద్వారా దిగుబడి నష్టాలను గణనీయంగా తగ్గించవచ్చని డాక్టర్ పి. అర్చన పేర్కొన్నారు. రైతులు వ్యవసాయ శాఖ అధికారులు,శాస్త్రవేత్తల సూచనలను పాటిస్తూ సుస్థిర వ్యవసాయాన్ని కొనసాగించాలని ఆమె కోరారు.

## బంధన పెల్లి మాజీ సర్పంచ్ భూక్య దీప్లా నాయకును పరామర్శించిన పరుపాటి శ్రీనివాస్ రెడ్డి



**రాయపర్తి జూలై 18 ప్రజాజ్యోతి** : అనారోగ్యంతో ఆసుపత్రిలో చికిత్స పొంది ఇంటి వద్ద విశ్రాంతి తీసుకుంటున్న మాజీ సర్పంచ్ని పరామర్శించిన ఎస్ఆర్ఆర్ ఫౌండేషన్ చైర్మన్ శ్రీనివాస్ రెడ్డి వరంగల్ జిల్లా రాయపర్తి మండలం బంధన్ పల్లి గ్రామంలోబీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు, మాజీ సర్పంచ్ భూక్య దీప్ల ఇటీవల అనారోగ్యంతో చికిత్స తీసుకోని ఇంటివద్ద విశ్రాంత. తీసుకుంటుండగా శనివారం రాష్ట్ర మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు ఆదేశంతో వారిని పరామర్శించిన ఫౌండేషన్ చైర్మన్, బిఆర్ఎస్ పార్టీ జిల్లా నాయకులుబి పరుపతి శ్రీనివాస్ రెడ్డి.ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఎస్టీ యూనియన్ ఉపాధ్యక్షులు సురేందర్ రాథోడ్ మండల పార్టీ నాయకులు లేతకుల రంగా రెడ్డి, తాళ్లపెల్లి సంతోష్ గౌడ్, సంధి దేవేందర్ రెడ్డి, చందు రామ్, ఎలుకపల్లి రమేష్, నాగేశ్వరావు, బొమ్మినేని సురేందర్ రెడ్డి, సర్పంచ్ లు ఇస్లావత్ సంతోష్, లావుడ్యా నరేష్, మండల పార్టీ నాయకులు సంకినేని ఎల్లస్వామి, ఐత రవి, చందు లక్ష్మన్, పెండోటా శివ, ఐత జంపి, పార్టీ ముఖ్య నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## పారదర్శకంగా, నిబంధనలకు అనుగుణంగా పరీక్షల నిర్వహణ

**– పరిశీలించిన కలెక్టర్ సందీప్ కుమార్ ఝా**



**జనగామ జిల్లా ప్రతినిధి, జూలై 18 (ప్రజాజ్యోతి)** : విద్యా సంవత్సరం 2026–27కు జనగామ జిల్లాలో ప్రభుత్వం మంజూరు చేసిన 39 నూతన ప్రీ–ప్రైమరీ పాఠశాలల్లో ఇన్‌స్ట్రక్టర్, ఆయా పోస్టుల భర్తీకి సంబంధించి శనివారం కలెక్టరేట్‌లో నిర్వహించిన వ్రాతపరీక్షలు ప్రశాంత వాతావరణంలో విజయవంతంగా పూర్తయ్యాయి. ఇన్‌స్ట్రక్టర్ పోస్టులకు హ్యాబిటేషన్ పరిధిలోని అభ్యర్థుల నుండి మొత్తం 269 దరఖాస్తులు అందగా, వారిలో 254 మంది వ్రాతపరీక్షకు హాజరయ్యారు. 15 మంది గైర్హాజరయ్యారు. అదేవిధంగా, ఆయా పోస్టులకు 152 మంది స్థానిక అభ్యర్థులు దరఖాస్తు చేసుకోగా వారిలో 139 మంది పరీక్షకు హాజరయ్యారు. 13 మంది అభ్యర్థులు గైర్హాజరయ్యారు. ఇన్‌స్ట్రక్టర్ పోస్టులకు ఒక గంటన్నర, ఆయా పోస్టులకు గంటన్నర వ్యవధిలో వ్రాతపరీక్ష నిర్వహించారు. పరీక్షలను పారదర్శకంగా, నిబంధనలకు అనుగుణంగా నిర్వహించారు. ఈ మొత్తం ప్రక్రియను జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా పరిశీలించారు. పరీక్షల నిర్వహణలో అసిస్టెంట్ డైరెక్టర్ శ్రీనివాస్, జీసీడిఓ గౌస్యా బేగం, ఏసీజీఈ, డీసీఈబి సెక్రటరీ, కేజీబీవీల అకౌంటెంట్లు, ఉపాధ్యాయులు, ఇన్‌స్ట్రక్టర్లు, ఇతర విద్యాశాఖ సిబ్బంది సమన్వయంతో విధులు నిర్వహించి పరీక్షలను విజయవంతంగా పూర్తి చేశారు.

## చెక్కు బౌన్స్ కేసుల పరిష్కారానికి ప్రత్యేక లోక్ అదాలత్




**ములుగు జిల్లా స్టాఫ్ రిపోర్టర్ (ప్రజాజ్యోతి)** : ములుగు జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్ పర్సన్ ఎస్ వివి సూర్య చంద్రకళ ఆదేశాలసారం ములుగు జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో ములుగు జిల్లా కోర్టు ఆవరణలో శనివారం స్పెషల్ లోక్ అదాలత్ నిర్వహించడం జరిగింది. ఈ లోక్ అదాలత్ లో చెక్–బౌన్స్ కేసులు పరిష్కరించారు. 10 కేసులలో రూ. 14,72,973 సెటిల్మెంట్ చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో జిల్లా న్యాయ సేవాధికార సంస్థ సెక్రటరీ టీ.కన్నయ్య లాల్,ప్రిన్సిపాల్ జూనియర్ సివిల్ జడ్జి జి.జ్యోత్స్న, అదనపు జూనియర్ సివిల్ జడ్జి మధులిక తేజ,జిల్లా బార్ అసోసియేషన్ అధ్యక్షుడు బాలుగు చంద్రయ్య,ఉపాధ్యక్షుడు రంగోజు బిక్షపతి,లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ సభ్యులు మేకల మహేందర్, బానోత్ స్వామిదాస్,న్యాయ వాదులు ఆర్.శ్రీనివాస్, రంగోజు సూర్యం,ఎండీ. మన్సూర్ అలీ,కే.ప్రణయ్ ప్రసాద్, విజయ్,ములుగు సీఐ సురేష్,వివిధ బ్యాంకుల మేనేజర్ లు తదితరులు పాల్గొన్నారు.

## పెండోట భాగ్యమ్మ కుటుంబాన్ని పరామర్శించి నిత్యావసరాలు అందించిన ఎస్ఆర్ఆర్ ఫౌండేషన్ చైర్మన్ పరుపాటి శ్రీనివాస్ రెడ్డి



**రాయపర్తి జూలై 18 ప్రజా జ్యోతి** : వరంగల్ జిల్లా రాయపర్తి మండలం మొరిపిరాల గ్రామంలో బీ ఆర్ ఎస్ పార్టీ నాయకులు పెండోట భాగ్యమ్మ ఇటీవల అనారోగ్యంతో మరణించగా శనివారం రాష్ట్ర మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు ఆదేశాల మేరకు ఆమె చిత్ర పటానికి నివాళ్లు అర్పించి, కుటుంబ సభ్యులను పరామర్శించి ఫౌండేషన్ ఆధ్వర్యంలో 50 కేజీల బియ్యం, ఆయిల్ క్యాన్ ను అందించిన ఫౌండేషన్ చైర్మన్, బిఆర్ఎస్ పార్టీ జిల్లా నాయకులు పరుపతి శ్రీనివాస్ రెడ్డి.ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఎస్టీ యూనియన్ ఉపాధ్యక్షులు సురేందర్ రాథోడ్ మండల పార్టీ నాయకులు లేతకుల రంగా రెడ్డి, తాళ్లపెల్లి సంతోష్ గౌడ్, సంధి దేవేందర్ రెడ్డి, చందు రామ్, బొమ్మినేని సురేందర్ రెడ్డి, మాజీ గ్రామ పార్టీ అధ్యక్షులు చేగురి మల్లేష్, సర్పంచ్ లు ఇస్లావత్ సంతోష్, లావుడ్యా నరేష్,వార్డ్ నెంబర్ పెండోటా శ్రావణి శివ, మండల పార్టీ నాయకులు భాస్కర్, సంకినేని ఎల్లస్వామి, ఐత రవి, చందు లక్ష్మన్, ఐత జంపి,పార్టీ ముఖ్య నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# కోతుల కోసం కట్టిన వలలో బంధీ అయిన కుకేడు పాము





**చంపేయాలన్న జనాన్ని నిలువరించిన ఇంటి యజమాని..**

**అటవీశాఖకు అప్పగించి మానవత్వం చాటిన తిర్మల్‌రావు**

**పర్వతగిరి, జూలై 18 (ప్రజాజ్యోతి)** : మండల కేంద్రంలో శనివారం ఉదయం ఉత్కంఠభరిత ఘటన చోటుచేసుకుంది. కోతుల బెడద నుంచి పెరటి, ఔషధ మొక్కలను రక్షించేందుకు కట్టిన రక్షణ వలలో భారీ కుకేడు పాము చిక్కుకోవడంతో స్థానికులు ఒక్కసారిగా భయాందోళనకు గురయ్యారు. పామును చూసిన ఇంటి యజమాని ఏటూరి తిర్మల్‌రావు కేకలు వేయడంతో చుట్టుపక్కల ప్రజలు పెద్ద సంఖ్యలో అక్కడికి చేరుకుని, కొద్దిసేపు ఉద్రిక్త వాతావరణం నెలకొంది. తిర్మల్‌రావు తన ఇంటి ఆవరణలో అరుదైన ఔషధ మొక్కలు, పలు రకాల పెరటి మొక్కలను ఎంతో శ్రద్ధగా పెంచుతున్నారు. ఇటీవల కోతుల బెడద ఎక్కువ కావడంతో మొక్కలు ధ్వంసం కాకుండా వాటి చుట్టూ బలమైన రక్షణ వలను ఏర్పాటు చేశారు. అయితే శనివారం ఉదయం మొక్కలను పరిశీలించేందుకు వెళ్లిన ఆయనకు ఆ వలలో భారీ కుకేడు పాము చిక్కుకుని కనిపించింది. దీంతో ఒక్కసారిగా భయంతో అరవడంతో కుటుంబ సభ్యులు, స్థానికులు పరుగులు తీశారు. పామును చూసిన కొందరు వెంటనే కర్రలు, రాళ్లు తీసుకుని చంపేయాలని ప్రయత్నించగా, తిర్మల్‌రావు వారిని అడ్డుకుని ఇది కూడా ప్రకృతిలో భాగమే చంపొద్దు అంటూ మానవత్వాన్ని ప్రదర్శించారు. అనంతరం వెంటనే అటవీశాఖ అధికారులకు సమాచారం అందించారు. సమాచారం అందుకున్న అటవీశాఖ సిబ్బంది సంఘటన స్థలానికి చేరుకుని అత్యంత జాగ్రత్తగా వలలో చిక్కుకున్న పామును బయటకు తీసి తమ ఆధీనంలోకి తీసుకున్నారు. అనంతరం దానిని సురక్షితమైన అటవీ ప్రాంతంలో విడిచిపెట్టేందుకు తరలించారు. ఈ ఘటన స్థానికంగా చర్చనీయాంశమైంది. ప్రమాదకర పరిస్థితిలోనూ పామును చంపకుండా అధికారులకు అప్పగించిన తిర్మల్‌రావు తీరుపై స్థానికులు ప్రశంసలు కురిపించారు. అటవీశాఖ అధికారులు కూడా పాములు లేదా ఇతర వన్యప్రాణులు ఇళ్లలోకి వచ్చినప్పుడు భయంతో వాటిని చంపకుండా, వెంటనే అటవీశాఖకు సమాచారం ఇవ్వాలని సూచించారు. ప్రజల అప్రమత్తత, అధికారుల సకాలంలో స్పందనతో ఒక వన్యప్రాణి ప్రాణం దక్కిందని స్థానికులు అభిప్రాయపడుతున్నారు.

# అధిక రుసుము వసూలు చేస్తే కఠిన చర్యలు తప్పవు








**– ఈ – డిస్ట్రిక్ట్ మేనేజర్ దేవేందర్**
**– తప్పుగా డాక్యుమెంట్స్ అప్లోడ్ చేస్తే చర్యలు తప్పవు**
**– ఇకపై మీ సేవలో డిజిటల్ రశీదులు**

**ములుగు జిల్లా స్టాఫ్ రిపోర్టర్ (ప్రజాజ్యోతి)** : నిర్ణీత రుసుము కంటే ఎక్కువ రుసుం దరఖాస్తు దారుడు నుండి తీసుకున్న ట్లయితే తప్పనిసరిగా అట్టి మీసేవ సెంటర్ పై కఠిన చర్యలు తీసుకుంటామని ఈ – డిస్ట్రిక్ట్ మేనేజర్ దేవేందర్ తెలిపారు. ములుగు మున్సిపాలిటీ పరిదిలోని పలు మీసేవ కేంద్రాలను ఈ – డిస్ట్రిక్ట్ మేనేజర్ దేవేందర్,మీసేవ మేనేజర్ విజయ్ తో కలిసి శనివారం ఆకస్మిక తనిఖీ చేశారు.కొత్తగా వచ్చిన ఎస్సెస్సీ మేమో ప్రింట్, యూరియా బుకింగ్,ఫార్మర్ రిజిస్ట్రేషన్, వ్యవసాయేతర మార్కెట్ విలువ సర్వీసుల గురించి మీసేవ నిర్వాహ కులకు వివరించారు.ఏ విధమైన టెక్నికల్ సమస్యలు వచ్చిన అతి త్వరగా క్లియర్ చేస్తామని ప్రతి ఒక్కరు జాగ్రత్తగా ప్రతి అప్లికేషన్ నమోదు చేయాలని తెలిపారు.కులం, ఆదాయం,నివాసం, జనన, మరణ కుటుంబ దృవీకరణ పత్రం, నేటివిటి, గ్యాప్, నాన్ క్రిమీలేయర్ వంటి సర్టిఫికేట్లు ఎన్ని సార్లు అయినా తీసుకునే వెసులుబాటు కలదని ఈ – డిస్ట్రిక్ట్ మేనేజర్ దేవేందర్ తెలిపారు. మీసేవ కేంద్రాలను ప్రజలకు ఇప్పుడు అందుబాటులో ఉండి ఈఎస్ డి గైడ్ లైన్స్ ప్రకారం మీ సేవ కేంద్రాన్ని నడపవలనని సూచించారు. ఆపరేటర్లు ఎల్లప్పుడూ అందుబాటులో ఉండి అన్ని రకాల మీసేవ, భూభారతి మరియు మిగతా ఆన్లైన్ సర్విస్ లను ప్రజలకు అందించాలని సూచించారు. మీసేవ సెంటర్లో తప్పకుండా సిటిజెన్ చాప్టర్, భూభారతికి సంబంధించిన ఫ్లెక్సీలు, మీ సేవ లోగో, తహశీల్దార్, ఈడీఎం, పరిష్కారం కాల్ సెంటర్ల యొక్క ఫోన్ నెంబర్లు తప్పనిసరిగా ఉండవలెనని ఈ–డిస్ట్రిక్ట్ మేనేజర్ ఆదేశించారు. కళ్యాణ లక్ష్మి, యుడిఐడి (సదరం)బర్త్, డెత్ సర్టిఫికెట్లు ఎలాంటి తప్పులులేకుండా నమోదు చేయాలని, మీసేవ ఆపరేటర్లు ప్రజల పట్ల సున్నితంగా ఉంటూ వారికి మీసేవ సర్వీసులను, ఇతర అన్ని రకాల ఆన్ లైన్ సేవలను అందించాలని ఆదేశించారు. అదేవిదంగా రాష్ట్రంలో పౌర సేవలను పారదర్శకంగా వేగవంతంగా అందించేందుకు ప్రభుత్వం నూతన విధానాన్ని అమల్లోకి తీసుకువచ్చింది. గ్రామ పాలనాధికారులు, రెవెన్యూ ఇన్స్పెక్టర్ లు వినియోగించుకునే విధంగా ప్రత్యేక మొబైల్ అనువర్తనాలను అందుబాటు లోకి తీసుకువచ్చింది.ఇకపై పౌర సేవల దరఖాస్తుల స్వీకరణ, పరిశీలన, రెవెన్యూ సిబ్బంది నివేదికల సమర్పణ తదితర ప్రక్రియ మొత్తం ఆన్లైన్ విధానంలోనే కొనసాగుతుంది.కాగిత రహితవిధానం అమలులోకి రావడంతో సమయానికి సేవలు అందడం, పారదర్శకత పెరగడం జరుగుతుందని ఈ–డిస్ట్రిక్ట్ మేనేజర్ తెలిపారు.ప్రస్తుతం ఆదాయం,కులం,నివాసం, కుటుంబసభ్యుల దృవీకరణ పత్రం,లేట్ రిజిస్ట్రేషన్ బర్త్, డెత్,అగ్రికల్చరల్ మార్కెట్ వాల్యూ ,గ్యాప్ సర్టిఫికెట్ సేవలను అందుబాటులోకి తీసుకువచ్చారు. మీసేవ ద్వారా అప్లై చేస్తే దరఖాస్తు తొలుత గ్రామ రెవెన్యూ పాలనాధికారి(జీపీఓ)కి లాగిన్‌లోకి వస్తుంది.ఆయన విచారణ తర్వాత మండల రెవెన్యూ ఇన్‌స్పెక్టర్(ఎంఆర్ఐ)కి,తదనంతరం ఆర్ఐ నేరుగా తహసీల్దార్ లాగిన్‌కి చేరవేరుస్తారని ఈ–డిస్ట్రిక్ట్ మేనేజర్ తెలిపారు.అలాగే కొత్త విధానం ప్రకారం మీ సేవ కేంద్రంలో దరఖాస్తు చేసుకున్న వెంటనే దరఖాస్తు దారుడికి రిజిస్టర్డ్ మొబైల్ నెంబర్ కు ఒక ఎస్ఎంఎస్ వస్తుంది. అందులో అప్లికేషన్ నెంబర్ సర్వీసు పేరు చెల్లించిన ఫీజు వివరాలతో పాటు ఒక హైపర్ లింక్ ఉంటుంది. పౌరులు ఆ లింకుపై క్లిక్ చేసి తమ రసీదును ఎప్పుడైనా వీక్షించవచ్చు.డౌన్ లోడ్ చేసుకోవచ్చు లేదా ప్రింట్ తీసుకోవచ్చు.సర్టిఫికెట్ చేతికి వచ్చేవరకు ఈ ఎస్ఎంఎస్ ను సురక్షితంగా ఉంచుకోవాలని ఈ డిస్ట్రిక్ట్ మేనేజర్ దేవేందర్ సూచించారు.దీనివల్ల కాగితాలు పోగొట్టుకునే భయం ఉండదు.అలాగే మీసేవ అప్లికేషన్ లో సదరు మెసేజ్ తిరిగి పంపించే సౌకర్యాన్ని కల్పించారని ఈ – డిస్ట్రిక్ట్ మేనేజర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో మీసేవ జిల్లా మేనేజర్ పోలోజు విజయ్,మీసేవ సెంటర్ నిర్వాహకులు పాల్గొన్నారు.

### నవీన్ నాయక్ పై దాడి చేసిన మట్టి మాఫియాలపై

# ఎస్సీ ఎస్టీ కేసు నమోదు చేసి వెంటనే అరెస్టు చేయాలి

**– తేజావత్ వాసు నాయక్ – లంబాడి హక్కుల పోరాట సమితి రాష్ట్రప్రధాన కార్యదర్శి**





**నర్సంపేట జూలై 18 (ప్రజా జ్యోతి)** : నర్సంపేట మున్సిపాలిటీ 16వ వార్డు కౌన్సిలర్ భానోత్ నవీన్ నాయక్ పై దాడి చేసిన మట్టి మాఫియా ఓర్సు రాజు, సంపంగి గణేష్, ఆలకుంట విజయ్ , సంపంగి రుద్ర, అనిల్ చింటూ సంతు సాయిలపై ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసి వెంటనే అరెస్టు చేయాలని లంబాడి హక్కుల పోరాట సమితి డిమాండ్,చేస్తున్నది. నర్సంపేటలో మాదనపేట చెరువు మత్తడి ప్రాంతంలో ఎటువంటి పర్మిషన్ లేకుండా మట్టిని తరలిస్తున్నారు దీనిపై ఆర్డీవో, ఐబి, ఇంజనీరింగ్ విభాగం డిఈ తక్షణమే స్పందించి అక్రమంగా మట్టిని తవ్వి నర్సంపేట ప్రాంతానికి తరలిస్తున్న వారి పై చర్యలు తీసుకుంటూ వారి ట్రాక్టర్లను ట్రా క్కులను మట్టిని వెంటనే సీజ్ చేయాలని డిమాండ్, చేస్తున్నాం. నర్సంపేటలో పోలీసు వ్యవస్థ ఉన్నదా లేదా రెవిన్యూ డిపార్ట్మెంట్ పనిచేస్తుందా లేదా మాకు అనుమానం వస్తున్నది. ప్రతిరోజు మట్టిని ట్రాక్కుల ద్వారా మద్యం మత్తులో డ్రైవర్లు విచ్చలవిడిగా డ్రైవింగ్ చేస్తూ అనేకమంది ప్రజలను గాయపరిచినారు. అయినా కూడా వారిపై చర్యలు లేదు ఇప్పటివరకు తక్షణమే అక్రమ మట్టి ట్రాక్టర్లను, సీజ్ చేయాలని డిమాండ్ చేస్తున్నాం.గతంలో అదే ప్రాంతంలో జిపిఓ, అధికారిని కొట్టడం జరిగింది. అదే ప్రాంతానికి చెందిన సాయి అనే వ్యక్తిని మట్టి మాఫియా గుండాలు కొడితే కోమలో ఉన్నారు. ఇప్పటివరకు మట్టి మాఫియా గుండాలు వారి కుటుంబాన్ని పరామర్శించిన దాఖలు లేవు వారి ప్రాంతం నుండి నిధులు కావాలి తప్ప వారి ఆరోగ్యం పట్ల బాధ్యత చూడవలసిన బాధ్యత ఏమాత్రం లేదు స్థానిక ఎమ్మెల్యే అండదండలతో మీ పేరు చెప్పుకొని నర్సంపేటలో విచ్చలవిడిగా దండాలు నడుస్తున్నాయి, చేస్తున్నారు అది కేవలం లంబాడీ గిరిజనుల పైన జరుగుతున్నది. తెలంగాణ రాష్ట్రంలో ప్రజా పాలన ఏ మూలన నడుస్తుంది ఏక్కడ కనిపించడం లేదు ప్రజా పాలన అంటే లంబాడి గిరిజన పై దాడి చేయడం ఎలా అని ప్రశ్నిస్తున్నాం గిరిజనుల ఓట్లతో గెలిచినటువంటి మీరు మీ ప్రభుత్వం మాపై దాడులు చేస్తున్నారు. ఈ దాడులను తక్షణమే ఆపాలి మట్టి మాఫియాను ఆపాలి పరిమిషన్ లేనటువంటి వాటిని సీజ్ చేయాలి మట్టి మాఫియా గుండాలపై ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయాలి తక్షణమే మాఫియాను నివారించకపోతే భవిష్యత్తులో నర్సంపేట ప్రాంతంలో గిరిజనుల చేత భారీ పోరాటానికి దిగుతామని డిమాండ్ చేస్తున్నాం.ఈ కార్యక్రమంలో భూక్యా జగన్ నాయక్ లంబాడి హక్కుల పోరాట సమితి జిల్లా అధ్యక్షులు మాలోతు సంతోష నాయక్ ధారావత్ సుభాష్నాయక్ పోరా రాములన్న మాలోత్ శ్రావణ్ కుమార్ గూగులోతు సుమన్ నాయక్ బానోత్ గాంధీ నాయక్ ఇస్లావత్ నెహ్రూ బోడ రమేష్ బాదావత్ రాజు పాల్గొన్నారు.



# ఎల్-నినో ప్రభావం.. వరికి బదులు ప్రత్యామ్నాయ పంటలే శరణ్యం

**నెక్కొండ జూన్ 18 (ప్రజా జ్యోతి)** : మండలంలోని ముదిగొండ గ్రామంలో వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. వాతావరణ మార్పులు, ఎల్–నినో ప్రభావం వల్ల వర్షాలు తక్కువగా పడే అవకాశం ఉన్నందున, వానా కాలంలో వరి పంటకు బదులుగా తక్కువ నీరు అవసరమయ్యే కూరగాయలు, బంతి పూలు, పొద్దుతిరుగుడు, జొన్నలు, కందులు, ఆముదం, బొబ్బర వంటి పంటలను సాగు చేయాలని అధికారులు సూచించారు. పంట మార్పిడిలో భాగంగా గ్రామంలో రైతు ఎట్ల సత్తయ్య సాగు చేసిన సోయాబీన్ పంటను తోటి రైతులతో కలిసి అధికారులు చూశారు. సోయాబీన్ పంట తక్కువ పెట్టుబడి, తక్కువ సమయంతో ఎక్కువ దిగుబడి ఇస్తుందని, మంచి ధర లభించడమే కాకుండా నేల సారం పెరుగుతుందని రైతులకు వివరించారు. రాబోయే రోజుల్లో ఈ పంట సాగును పెంచాలని కోరారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి ఏ.నాగరాజు, గ్రామ సర్పంచ్ పున్నం రంగారెడ్డి, ఏఈవో కిరణ్ నవీన్, గ్రామ రైతులు జక్కుల ఏకాంబరం, ఎండీ అంకూస్, దామోదర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## తెలంగాణ ఉద్యమకారుడు దుర్శెట్టి కొమురయ్యను పరామర్శించిన తెలంగాణ ఉద్యమకారుల సంఘం సభ్యులు



**రాయపర్తి జూలై 18 ప్రజాజ్యోతి** : వరంగల్ జిల్లా రాయపర్తి మండల కేంద్రంలో ఇటీవల ప్రమాదవశాత్తు కాలు విరిగి ఆసుపత్రిలో చికిత్స పొంది. ఇంటి వద్ద విశ్రాంతి తీసుకుంటున్నతెలంగాణ ఉద్యమకారుడు దురిశెట్టి కొమురయ్య ఇటీవల తొంటి ఎముక ఆపరేషన్ చేయించుకొని ఇంటి వద్ద విశ్రాంతి తీసుకొనుచుండగా తోటి ఉద్యమకారులు వారిని శనివారం పరామర్శించి వారికి వారి కుటుంబ సభ్యులకు మనోధైర్య ఇస్తూ ఉద్యమకారుల ఫోరం ఎల్లప్పుడు అండగా ఉంటుందని తెలిపినారు. ఇట్టి కార్యక్రమంలో మండల అధ్యక్షులు అయిన ఎనగందుల శ్యాంసుందర్ ఉపాధ్యక్షులు హప్పవత్ పంతులు నాయక్ జిల్లా ఉపాధ్యక్షులు సుదగాని వెంకటేశ్వర్లు మండల నాయకులు ముత్యం రవి బోడపట్ల నారాయణ మునా వత్తు బికు నాయక్ చిన్నాల యాకయ్య మునవతు లక్ష్మణ్ కులుసోతు ఉపేందర్ పాల్గొన్నారు.

## కాటారం డివిజన్ సర్పంచుల ఫోరం అధ్యక్షుడు కొండగోర్ల బాపుకు సన్మానం



**మహాముత్తారం, జులై 18. ప్రజాజ్యోతి** : ఐటీ శాఖ మంత్రి దుద్దిల్ల శ్రీధర్ బాబు ఆదేశాల మేరకు మండల కేంద్రంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు పక్కల సడవలి ఆధ్వర్యంలో నూతనంగా ఎన్నికైన సర్పంచుల ఫోరం కాటారం డివిజన్ అధ్యక్షుడు కొండగోర్ల బాపును శాలువాతో సన్మానించారు.ఈకార్యక్రమంలో డీసీసీ సెక్రటరీ అంగజాల అశోక్ కుమార్, పిఎసిఎస్ మాజీ చైర్మన్ ముక్కెర రాజమల్లు గౌడ్, మహిళా మండల అధ్యక్షురాలు సుజాత, యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు జాటోత్ వంశిరాజ్,సర్పంచులు, రాజు నాయక్, ఎన్నం సునీత నరేష్, మహాముత్తారం ఉప సర్పంచ్ రామినేని పూజిత కృష్ణంరాజు తదితరులు పాల్గొన్నారు.

## గుర్తు తెలియని కారు ఢీకొని పాడి గేదె మృతి



**రాయపర్తి, జులై 18, ప్రజా జ్యోతి** : వరంగల్ జిల్లా రాయపర్తి మండల కేంద్రంలోని వరంగల్–ఖమ్మం జాతీయ రహదారి 563 పై గుర్తు తెలియని కారు ఢీకొని పాడి గేదె మృతి చెందింది. రాయపర్తికి చెందిన మహమ్మద్ అఫ్సర్ పాషా పాడి గేదే శుక్రవారం అర్ధరాత్రి జాతీయ రహదారి దాటుతున్న క్రమంలో వే బ్రిడ్జి దగ్గర వరంగల్ నుండి రాయపర్తికి వైపునకు మితిమీరిన వేగంతో వస్తున్న గుర్తు తెలియని కారు అదుపుతప్పి గేదె ను బలంగా ఢీ కొట్టడంతో అక్కడికక్కడే మృతి చెందింది. మృతి చెందిన గేదె విలువ రూ. 70 వేలు ఉంటుందని, ప్రభుత్వం ఆర్థికంగా ఆదుకోవాల్సిందిగా బాధిత కుటుంబం కోరుతున్నది.



## నిబంధనలకు విరుద్ధంగా మహారాష్ట్రకు కంకర రవాణా

**ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు బెల్లంపల్లి సురేష్**

**భూపాలపల్లి జిల్లా స్టాఫ్ రిపోర్టర్ జూలై 18 (ప్రజాజ్యోతి)** : నిబంధనలకు విరుద్ధంగా మహారాష్ట్రకు నడుస్తున్న కంకర లారీలను అరికట్టేందుకు అధికారులు చర్యలు తీసుకోవాలని ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు బెల్లంపల్లి సురేష్ అన్నారు. తెలంగాణలో చట్టబద్ధంగా తవ్విన కంకరను మహారాష్ట్రకు తరలించేందుకు అనుమతి ఉన్నప్పటికీ, సంబంధిత శాఖల అనుమతులు, పత్రాలు తప్పనిసరిగా ఉండాలని ప్రతి లోడుకు గనుల శాఖ జారీ చేసిన ఈ–ట్రాన్సిట్ పాస్, రాయల్టీ చెల్లింపు రసీదు, చెల్లుబాటు అయ్యే క్వారీ లీజ్ లేదా మైనింగ్ అనుమతి, అలాగే వాహనానికి సంబంధించిన రిజిస్ట్రేషన్, ఫిట్‌నెస్, ఇన్సూరెన్స్ పత్రాలు తప్పనిసరిగా ఉండాలని ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు బెల్లంపల్లి సురేష్ మాదిగ పేర్కొన్నారు. మహాదేవపూర్–సిరోంచా సరిహద్దులో అధికారులు తనిఖీలు నిర్వహించి పత్రాలు లేని వాహనాలను స్వాధీనం, చేసుకొని జరిమానా, అక్రమ రవాణా కేసులు నమోదు చేసి చర్యలు తీసుకోవాలని అన్నారు. అన్ని చట్టబద్ధమైన పత్రాలతోనే కంకర రవాణా చేపట్టాలని అనుమతి లేని వాహనాలను సీజ్ చెయ్యాలని ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షులు బెల్లంపల్లి సురేష్ మాదిగ డిమాండ్ చేశారు.



# శూన్యం నుంచి పునరుజ్జీవనం వైపు బండ రామారం జెడ్పీ పాఠశాల

**గ్రామం మొత్తం ఏకమైంది**

**ఇంటింటి ప్రచారంతో తొలిదశ లోనే 9 మంది విద్యార్థుల చేరిక**

**ప్రభుత్వ బడిని కాపాడుకుందా మని గ్రామస్తుల సంకల్పం**

తుంగతుర్తి, జులై 18,(ప్రజా జ్యోతి): పాఠశాలలో విద్యార్థులు లేక శూన్యంగా ఉన్న వాతావరణం నుంచి నెమ్మదిగా పునర్జీవనం పోసుకుంటుంది. తుంగతుర్తి మండల పరిధిలోని బండ రామారం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థుల సంఖ్య శూన్యానికి చేరిందంటూ వివిధ సామాజిక మాధ్యమాల్లో కథనం వెలువడిన మరుసటి రోజే గ్రామ సర్పంచ్ కొరుకొప్పుల నరేష్ గౌడ్ ఆధ్వర్యంలో గ్రామ పెద్దలు, ఉప సర్పంచ్, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు కలిసి ప్రత్యేక చర్యలు చేపట్టగా, తొలిదశలోనే 9 మంది విద్యార్థులు తిరిగి పాఠశాలకు హాజరుకావడం విశేషంగా నిలిచింది. ఈ సందర్భంగా సర్పంచ్ కొరుకొప్పుల నరేష్ గౌడ్ మాట్లాడుతూ.... గ్రామంలోని ప్రతి విద్యార్థి ప్రభుత్వ పాఠశాలలోనే చదివేలా గ్రామస్తులం



దరూ సమిష్టిగా కృషి చేయాలని పిలుపుని చ్చారు. ఉపాధ్యాయ బృందం ఐకమత్యంతో పనిచేసి విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించాలని సూచించారు. గత రెండేళ్లుగా పాఠశాలలో హెడ్మాస్టర్, మహిళా ఉపాధ్యాయుల మధ్య నెలకొన్న సఖ్యత లోపించడం వల్లే విద్యార్థులు టీసీలు తీసుకుని ఇతర పాఠశాలలకు వెళ్లే పరిస్థితి ఏర్పడిందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయంపై జిల్లా విద్యాశాఖ అధికారికి వినతిపత్రం అందజేశామని తెలిపారు. పాఠశాల అభివృద్ధికి గ్రామ ప్రజలు, తల్లిదండ్రులు, ప్రజాప్రతినిధులు రాజకీయా లకు అతీతంగా కలిసి పనిచేయాలని కోరుతూ, గ్రామపంచాయతీ తరఫున అన్ని విధాలా సహకారం అందిస్తామని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆర్యవైశ్య రాష్ట్ర రాజకీయ వైస్ చైర్మన్ తాటికొండ సీతయ్య విద్యార్థులకు ప్లేట్లు, గ్లాసులు అందజేస్తామని ప్రకటించారు. పాఠశాలకు తిరిగి తమ పిల్లలను పంపించిన తల్లిదండ్రులకు గ్రామ పెద్దలు ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ పోడేటి యాదగిరి, తాటికొండ సీతయ్య, ఉపాధ్యాయులు కోటయ్య, శ్రీనివాస్, నరేష్, లింగన్న, మహేందర్, లింగస్వామి, రాజు, వెంకన్న, విద్యార్థులు, తల్లిదండ్రులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

## ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య పెంపునకు ప్రత్యేక ప్రోత్సాహకం

తుంగతుర్తి, జులై 18,(ప్రజా జ్యోతి): ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల చేరికలను ప్రోత్సహించేందుకు గ్రామ సర్పంచ్ వినూత్న నిర్ణయం తీసుకున్నారు. మండల పరిధిలోని బండ రామారం గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలలో కొత్తగా చేరే ప్రతి విద్యార్థికి ప్రతి నెల



రూ.1,000 చొప్పున ఆర్థిక సహాయం అందజేస్తానని గ్రామ సర్పంచ్ కోరుకొప్పుల నరేష్ ప్రకటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య అందుబాటులో ఉన్నప్పటికీ, విద్యార్థుల చేరికలు పెరగాల్సిన అవసరం ఉందని సర్పంచ్ పేర్కొన్నారు. పేద, మధ్యతరగతి కుటుంబాలకు విద్యాభారం తగ్గించడంతో పాటు ప్రభుత్వ బడులపై ప్రజల్లో మరింత నమ్మకం పెంచాలనే ఉద్దేశంతో ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు.సర్పంచ్ ప్రకటనను గ్రామస్థులు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు స్వాగతించారు. ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి ఇలాంటి ప్రోత్సాహకాలు ఎంతగానో ఉపయోగపడతాయని అభిప్రాయపడ్డారు. సర్పంచ్ తీసుకున్న ఈ నిర్ణయం ఇతర గ్రామాలకు కూడా ఆదర్శంగా నిలుస్తుందని పలువురు కొనియాడారు.

## రోడ్డు విస్తరణలో భూములను కోల్పోతున్న రైతులకు నష్ట పరిహారం చెల్లించాలి

హుజూర్ నగర్ జూలై 18 (ప్రజా జ్యోతి) రోడ్డు విస్తరణ పనుల్లో భాగంగా పట్టా భూములు కోల్పోతున్న రైతులకు తగిన పరిహారం చెల్లించాలని కోరుతూ శనివారం ఆర్ అండ్ బి అధికారులకు వినతిపత్రం అందజేశారు.ఈ సందర్భంగా పలువురు రైతులు మాట్లాడుతూ హుజూర్ నగర్ పడిగ రాయి గుట్ట ఆర్చ్ వద్ద నుండి రామలక్ష్మి పురం గ్రామం వరకు ఆర్ అండ్ బి అధికారులు రైతులకు ఎటువంటి ముందస్తు సమాచారం ఇవ్వకుండా,పట్టా భూములను సేకరించడం పట్ల ఆందోళన వ్యక్తం చేశారు.తమ పూర్వీకుల నుండి వ్యవసాయాన్ని నమ్ముకుని జీవిస్తున్నామని,హుజూర్ నగర్, రామలక్ష్మీ పురం గ్రామంలోని రెవెన్యూ పరిధిలోని వివిధ సర్వే నంబర్లలో చట్టబ



ద్ధమైన పట్టా భూములున్నాయని పేర్కొన్నారు.ఈ భూములే తమ కుటుంబాలకు ఏకైక జీవనాధారమని అన్నారు.తామంతా చిన్న మరియు సన్నకారు రైతులమని,ఒక ఎకరం నుండి 5 ఎకరాల వరకు రోడ్ ను అనుకోని ఉన్న రైతులమని చెప్పారు.ప్రస్తుతంహుజుర్ నగర్ పగిడి రాయి గుట్ట ఆర్చ్ దగ్గర రామలక్ష్మిపురం గ్రామం వరకు జరుగుతున్న ప్రధాన రహదారి రోడ్డు వెడల్పు పనులు తమ పట్టా భూముల లోకి వస్తున్నాయనీ,ఈ రోడ్డు విస్తరణ పనుల వల్ల గ్రామానికి చెందిన సుమారు 25 మందికి పైగా రైతులు తమ సొంత భూములను మరియు జీవనోపాధిని కోల్పోతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు.ఇప్పుడు డబల్ రోడ్ పేరుతో తమ పట్టా భూములలోకి రోడ్ విస్తరణ చేస్తూ,ఎలాంటి ముందస్తు నోటీసులు ఇవ్వలేదని అన్నారు.ప్రభుత్వం నిర్దేశించిన భూసేకరణ చట్టం ప్రకారం తమకు చట్టబద్ధమైన నష్టపరిహారం అందించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో రైతులు మర్రి జితేందర్ రెడ్డి, ,జెట్టి తేజస్,దొంతి రెడ్డి శంబిరెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, బండారు రవి, రాములు,భాగ్యమ్మకొప్పుల వెంకటరెడ్డి,చైతన్య పాల్గొన్నారు.

## అకడమిక్ హైట్స్ పాఠశాల లో విద్యార్థి సంఘం ఎన్నికలు

ప్రజాస్వామ్య పద్ధతిలో ఓటు వేసిన విద్యార్థులు

భువనగిరి,జులై 18(ప్రజాజ్యోతి) విద్యార్థులకు చిన్నతనం నుంచే ఎన్నికల ప్రక్రియ,ఓటు హక్కు ప్రాముఖ్యతపై అవగాహన కల్పించేందుకు, భువనగిరి పట్టణం లోని బచ్ పన్ అకడమిక్ హైట్స్





లో పాఠశాల స్థాయి విద్యార్థి సంఘం ఎన్నికలను ప్రతిష్టాత్మకంగా నిర్వహించారు.ఈ సందర్భంగా పాఠశాల చైర్పర్సన్ జయలక్ష్మి మాట్లాడుతూ,ప్రతి ఒక్కరికీ ఓటుపై పూర్తి అవగాహన ఉండాలనే ఉద్దేశంతోనే పాఠశాల ఆవరణలోనే పోలింగ్ కేంద్రాన్ని ఏర్పాటు చేసి విద్యార్థులతో ఓటింగ్ చేయించా మని తెలిపారు.ఎంతో ఉత్కంఠభరితంగా సాగిన ఈ ఎన్నికల ఫలితాలు ఈరోజు విడుదలయ్యాయి.ఎన్నికల విజేతల వివరాలు స్కూల్ గవర్నర్ గా ఎండి.రెయాన్ ప్రెసిడెంట్టి,కావ్యశ్రీ హెడ్ బాయ్ జె.దీపక్, హెడ్ గర్ల్ బి.నిత్యశ్రీ★డిప్యూటీ హెడ్ బాయ్ పి.శివమణి డిప్యూటీ హెడ్ గర్ల్ జె.దీపిక,ప్రెసిడెంట్ బాయ్ పదవికి హోరాహోరీ పోరు!ఈ ఎన్నికల్లో ప్రెసిడెంట్ బాయ్ పదవి కోసం అభ్యర్థులు ★★కె. విశాల్ ఎండి. సైఫుల్లా★ మధ్య అత్యంత ఉత్కం ఠభరితమైన పోటీ టై లేదా సమాన పోరు) నెలకొంది.ఇద్దరి మధ్య గట్టి పోటీ జరగడంతో,ఈ పదవిపై తుది నిర్ణయాన్ని పాఠశాల చైర్పర్సన్ అధికారికంగా ప్రకటించ నున్నారు. విజేతలుగా నిలిచిన విద్యార్థులకు తోటి విద్యార్థులు,ఉపాధ్యా యులు అభినందనలు తెలియజేశారు.

## ఘనంగా మాజీ మంత్రి జగదీశ్ రెడ్డి జన్మదిన వేడుకలు

తుంగతుర్తి మండల కమిటీ ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి స్వీట్లు పంపిణీ – నాయకులు, కార్యకర్తల సందడి

తుంగతుర్తి, జులై 18,(ప్రజా జ్యోతి): మాజీ మంత్రి, బీఆర్ఎస్ సీనియర్ నాయకులు గుంటకండ్ల జగదీశ్ రెడ్డి జన్మదిన వేడుకలను తుంగతుర్తి మండల బీఆర్ఎస్ కమిటీ ఆధ్వర్యంలో



శనివారం ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా మండల కేంద్రంలో నాయకులు కేక్ కట్ చేసి ఒకరికొకరు శుభాకాంక్షలు తెలియజేసుకుంటూ స్వీట్లు పంపిణీ చేశారు. జగదీశ్ రెడ్డి దీర్ఘాయుష్షుతో, సంపూర్ణ ఆరోగ్యంతో ప్రజాసేవలో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు.ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ...రాష్ట్ర అభివృద్ధికి, ప్రజా సంక్షేమానికి జగదీశ్ రెడ్డి అందించిన సేవలు చిరస్మరణీయమని కొనియాడారు. పార్టీ బలోపేతానికి ప్రతి కార్యకర్త అంకితభావంతో పనిచేయాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో తుంగతుర్తి మండలానికి చెందిన బీఆర్ఎస్ నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొని మాజీ మంత్రి జగదీశ్ రెడ్డికి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ తుంగతుర్తి మండల కమిటీ అధ్యక్షుడు తాటికొండ సీతయ్య, నాయకులు గుండగాని రాములు గౌడ్, దొంగరి శ్రీను, గునిగంటి యాదగిరి,రావులపల్లి సర్పంచ్ చింతకుంట్ల మనోజ్, మల్లెపాక రాములు, గుడిపాటి వీరయ్య, సోమేష్, గౌడ్ చర్ల సత్యనారాయణ,పూర్ణ నాయక్, తడకమల్ల రవికుమార్,జలంధర్, ముత్తయ్య, తదితరులు పాల్గొన్నారు.

## వ్యవసాయానికి నిరంతర విద్యుత్ ఇవ్వాలి..!

తుంగతుర్తి 33 కేవీ సబ్ స్టేషన్ ఎదుట బీఆర్ఎస్ శ్రేణుల ధర్నా

రైతులను ఇబ్బంది పెట్టొద్దని ప్రభుత్వానికి హెచ్చరిక

తుంగతుర్తి, జులై 18, (ప్రజా జ్యోతి): వ్యవసాయానికి ఎలాంటి అంతరాయం లేకుండా నిరంతర విద్యుత్ సరఫరా చేయాలని డిమాండ్ చేస్తూ బీఆర్ఎస్ నాయకులు శనివారం తుంగతుర్తి మండల కేంద్రంలోని 33 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్ ఎదుట నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా బిఆర్ఎస్ పార్టీ తుంగతుర్తి మండల కమిటీ అధ్యక్షుడు తాటికొండ సీతయ్య మాట్లాడుతూ...గత వారం రోజులుగా కొనసాగుతున్న విద్యుత్ కోతల కారణంగా రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. విద్యుత్ అంతరాయాలతో మోటార్లు, ట్రాన్స్‌ఫార్మర్లు కాలిపోతుండటంతో వాటి మరమ్మతుల కోసం రైతులు అప్పుల పాలవుతున్నారని అన్నారు. ఇప్పటికే తగినంత వర్షాలు కురవక భూగర్భ జలాలు అడుగంటిపోవడంతో బోరు నీటి పైనే ఆధారపడి సాగు చేస్తున్న రైతులకు విద్యుత్ కోతలు మరింత భారంగా మారాయని పేర్కొన్నారు. రైతులకు ఇచ్చిన హామీలను కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేయడంలో పూర్తిగా విఫలమైందని, రైతాంగాన్ని మోసగించే విధంగా పాలన సాగుతోందని విమర్శించారు. వ్యవసాయానికి 24 గంటల నాణ్యమైన విద్యుత్ సరఫరా చేయడంతో పాటు రైతుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. లేకపోతే రైతులతో కలిసి ఉద్యమాలను మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో నాయకులు గుండగాని రాములు గౌడ్,దొంగరి శ్రీను, గుడిపాటి వీరయ్య, మట్టిపెల్లి వెంకట్, గునిగంటి యాదగిరి,



గౌడిచర్ల సత్యనారాయణ, గడ్డం సోమేశ్, పూర్ణ నాయక్, తడకమళ్ల రవికుమార్, సర్పంచ్ లు మనోజ్, మాతంగి వెంకటమ్మ, కరుణాకర్, మాజీ సర్పంచ్‌లు వీరోజీ, యాకూ నాయక్,కళ్యాణ్, గోపగాని శ్రీనివాస్, గోపగాని వెంకన్న, నాగమల్లు, శ్రీకాంత్, సాయికిరణ్, మహేందర్, భాస్కర్, రమేష్, వెంకన్న, వీరన్న తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ పాఠశాలలో ప్రి ప్రైమరీ విద్యను ఏర్పాటు చేయడం అభినందనీయం

## సర్పంచ్ ఎడ్ల వెంకట్ రెడ్డి

భువనగిరి,జులై 18:ప్రజాజ్యోతి తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలో ప్రభుత్వ పాఠశాలలో ప్రి ప్రైమరీ విద్యను



అందుబాటులోకి తీసుకురావడం గొప్ప నిర్ణయమని సర్పంచ్ ఎడ్ల వెంకట్ రెడ్డి అన్నారు.బిఎన్ తిమ్మాపురం గ్రామంలో ప్రభుత్వం ప్రవేశపెట్టిన ప్రి ప్రయిమరీ పాఠశాలను,ప్రధానోపాధ్యాయులు తో కలిసి ప్రారంభించి ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ, చిన్నారులకు ప్రయివేటు పాఠశాలల్లో ఫీజుల భారం తగ్గించేందుకు ప్రాథమిక స్థాయి నుంచే నాణ్యమైన విద్యను అందించడానికి ప్రభుత్వం ప్రి ప్రైమరీ (నర్సరీ ఎల్ కే జి యూకేజీ) విద్యను ప్రవేశపెట్టడం చాలా అభినందనీయమని అన్నారు. సర్కారు బడుల్లో కార్పొరేట్ స్థాయి లో విద్యా ప్రమానాలు అందుబాటులో కి తేవడం వల్ల ప్రభుత్వ విద్యా వ్యవస్థపై తల్లిదండ్రులకు మరింత నమ్మకం పెరుగుతుందని అన్నారు.తెలంగాణ ప్రభుత్వం పాఠశాల విద్యను పటిష్టం చేయడానికి తీసుకున్న ఈ నిర్ణయం పేద మధ్యతరగతి తల్లిదండ్రుల కుటుంబాలకు ఎంతో మేలు జరుగుతుందని అన్నారు. అనంతరం ప్రాథమిక పాఠశాలలో నిర్వహించినా పేరెంట్స్ టీచర్స్ మీటింగ్ లో పాల్గొని మాట్లాడుతూ విద్యార్థులకు సౌకర్యాల విషయంలో ఎలాంటి ఇబ్బందులు ఉన్నా వెంటనే తన దృష్టికి తీసుకురావాలని ప్రధానోపా ధ్యాయులుని కోరారు.ఈ కార్యక్రమంలో సింగిల్విండో డైరెక్టర్



ఉడుత ఆంజనేయులు,ఉపాధ్యా యులు హేనిట,శ్రీలతప్రిప్రైమరి టీచర్ రేణుక,మాజీ ఉప సర్పంచ్ ఎడ్ల దర్శన్ రెడ్డి,యాదాద్రి జిల్లా యూత్ ఐకాన్ సమి బాయ్,స్కూల్ చైర్మన్ సరితా,వార్డు సభ్యులు నర్సింహ రమేష్,పాండు ఆయాలు సరితా,ఉపేంద్ర మాజీ వార్డు సభ్యులు పరమేష్,అశోక్ గ్రామ కారొబార్ ఉడుత శ్రీశైలం గ్రామస్థులు నకిరేకంటి శ్రీనివాస్,కరుణాకర్ పాల్గొన్నారు.

## చింతపల్లి ఎస్బిఐ బ్యాంకుకు నూతన మేనేజర్

చింతపల్లి జులై 18(ప్రజాజ్యోతి) చింతపల్లి ఎస్బిఐ బ్యాంకుకు కొత్త మేనేజర్ వచ్చారు.వివరాల్లోకి వెళ్తే ఖమ్మం జిల్లా కేంద్రంలోని ఎస్బిఐ బ్యాంకులో విధులు నిర్వహిస్తు బదిలీపై వచ్చిన శ్రీనివాస్ శనివారం చింతపల్లి ఎస్బిఐ బ్యాంకు నూతన మేనేజర్ గా బాధ్యతలు చేపట్టారు.అనంతరం ఆయన మాట్లాడుతూ రైతులు తాము



తీసుకున్న పంట రుణాలను క్రమం తప్పకుండా రెన్యువల్ చేసుకోవాలన్నారు.లేదంటే అపార రుసుము కలిపి అప్పు భారం పెరుగుతుందని తెలిపారు. ఖాతాదారులు వివిధ లోను రూపంలో తీసుకున్న అప్పును సకాలంలో చెలించాలని గుర్తు చేశారు.ఖాతాదారులు ఎస్బిఐ మొబైల్ బ్యాంకింగ్ సేవలైన యెనో యాప్ చేసుకొని వాడుకోవాలని సూచించారు.కేంద్రం ప్రవేశపెట్టిన ప్రధానమంత్రి జీవనజ్యోతి బీమా పథకం. ఇది ఏకరణం చేతనైన సభవించే మరణానికి 2లక్షల బీమా రక్షణ ఇస్తుందని తెలిపారు.దీనికి ప్రతి సంవత్సరం 436 రూపాయలు చెలించాలని తెలిపారు.ఆరోగ్య బీమాలకు సంబంధించిన పూర్తి వివరాలు బ్యాంకు అధికారులను సంప్రదించాలని కోరారు.

## నీటి లభ్యతను బట్టి వరి సాగు చేయాలి: నాంపల్లి ఏవో

నాంపల్లి, జులై,18(ప్రజా జ్యోతి):



నీటి లభ్యతను బట్టి వరి సాగు చేయాలని నాంపల్లి మండల వ్యవసాయ అధికారి బండారు శివ సూచించారు. శనివారం నాంపల్లిలో పత్తి, వరి పంటలను పరిశీలించి, మాట్లాడారు. ఎల్-నినో ప్రభావం కారణంగా ఈ వానాకాలంలో వర్షపాతం తగ్గే అవకాశం ఉన్నందున రైతులు తక్కువ వ్యవధి, తక్కువ నీరు అవసరమయ్యే పంటలను ఎంపిక చేసుకోవాలన్నారు. పంటల్లో తేమ సంరక్షణ చర్యలు చేపట్టడంతో పాటు సమతుల్య ఎరువుల వినియోగం,పురుగులు-తెగుళ్లపై నిరంతర పర్యవేక్షణ చేయాలి. అవసరమైన సాంకేతిక సూచనల కోసం సమీప వ్యవసాయ విస్తరణ అధికారిని సంప్రదించాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాంపల్లి ఏఈఓ కవిత, టిపి గౌరారం ఏఈఓ మౌనిక, రైతులు ఈదయ్య, యాదగిరి, పాపయ్య, తదితరులు పాల్గొన్నారు.

## అయ్యప్ప ఆలయ ట్రస్టు రద్దుచేయాలి

భూదాన్ పోచంపల్లి, జూలై 18 (ప్రజాజ్యోతి): పురపాలక కేంద్రంలోని అయ్యప్ప స్వామి దేవాలయ ప్రాంగణంలో శనివారం పట్టణ ప్రజలు, అయ్యప్ప భక్తులు, గురుస్వాములు సమావేశమై కీలక నిర్ణయాలు తీసుకున్నారు. ప్రస్తుతం ఉన్న ట్రస్టును రద్దు చేయాలని



సమావేశంలో సభ్యులందరూ ఏకగ్రీవంగా తీర్మానించారు.

గతంలో దేవాలయానికి ఎలాంటి ట్రస్టు లేదని పేర్కొన్న వ్యక్తులే ఇప్పుడు ట్రస్టు ఉందని, అందులో తాము సభ్యులమని చెప్పడం సమంజసం కాదని పలువురు భక్తులు అభిప్రాయపడ్డారు. దేవాలయానికి సంబంధించిన ఏకపక్ష నిర్ణయాలను వ్యతిరేకిస్తూ, ఆలయ అభివృద్ధి, పరిరక్షణను దృష్టిలో ఉంచుకుని గ్రామ పెద్దలు, కుల సంఘాల ప్రతినిధులు, గురుస్వాములు, అయ్యప్ప భక్తుల సమక్షంలో ప్రస్తుత ట్రస్టును రద్దు చేయాలని నిర్ణయించారు. అదేవిధంగా, దేవాలయ అభివృద్ధి కోసం అందరి ఆమోదంతో, పారదర్శకంగా, సర్వసభ్యుల సమన్వయంతో నూతన కమిటీని ఏర్పాటు చేయాలని సమావేశంలో ఏకగ్రీవంగా తీర్మానించారు.

## కేజీవీపీ, యూఆర్ఎస్ సర్వ శిక్ష ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

### -మినిమం టైం స్కేల్, సర్వీస్ రెగ్యులరైజేషన్‌కు టీఎస్ యూటీఎఫ్ పోస్ట్‌కార్డు ఉద్యమం

నారాయణఖేడ్, ప్రజాజ్యోతి జూలై 18:
తెలంగాణ రాష్ట్ర ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ టీఎస్ యూటీఎఫ్ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు నారాయణఖేడ్ మండలంలోని ఎంఆర్సీ కార్యాలయంలో శనివారం కేజీబీవీ, యూఆర్ఎస్, సర్వ శిక్ష అభియాన్ ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోసం పోస్ట్‌కార్డు ఉద్యమాన్ని ప్రారంభించారు.
ఈ సందర్భంగా టీఎస్ యూటీఎఫ్ మండల ప్రధాన కార్యదర్శి శ్రీ రామ్ నాయక్ మాట్లాడుతూ.. కేజీబీవీ, యూఆర్ఎస్, సర్వ శిక్ష ఉద్యోగుల న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని కోరుతూ రాష్ట్ర



ముఖ్యమంత్రి దృష్టికి పోస్ట్‌కార్డుల ద్వారా తీసుకెళ్లేందుకు రాష్ట్రవ్యాప్తంగా ఈ ఉద్యమాన్ని చేపట్టినట్లు తెలిపారు.
ఉద్యోగులకు మినిమం టైం స్కేల్ అమలు చేయడం, సర్వీసులను రెగ్యులరైజ్ చేయడం, రెగ్యులర్ ఉద్యోగులతో సమానంగా సెలవు సౌకర్యాలు కల్పించడం, వార్షిక ఇంక్రిమెంట్లు మంజూరు చేయడం, హెల్త్ కార్డులు ఇవ్వడం, కేర్‌టేకర్‌ను నియమించి రాత్రి డ్యూటీ నుంచి మహిళా ఉద్యోగులకు మినహాయింపు కల్పించడం, 29 రోజుల సమ్మె కాలపు వేతనాలు చెల్లించడం, ఉద్యోగుల అర్హతలు, బాధ్యతలకు అనుగుణంగా కేడర్ డిజైన్ చేయడం వంటి అన్ని డిమాండ్లను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని ఆయన కోరారు.
ఈ కార్యక్రమంలో టీఎస్ యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి నరేష్, అర్బన్ ప్రధాన కార్యదర్శి మహేష్, మండల ప్రధాన కార్యదర్శి రామ్ నాయక్‌తో పాటు సీఆర్పీలు, ఎంఐఎస్ సిబ్బంది, పీటీఐలు మరియు ఇతర ఉద్యోగులు పాల్గొన్నారు.

## తల్లితండ్రులు కూడా ఉన్నత విద్యావంతులు కావాలి

### ప్రధానోపాధ్యాయులు లోకనాధం

హత్నూర 18 జులై (ప్రజా జ్యోతి)
మండలంలోని నస్తీపూర్ ప్రాథమిక పాఠశాల లో శనివారం నాడు పేరెంట్స్ టీచర్ మీటింగ్ జరిగింది.ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయులు లోకనాధం మాట్లాడుతూ విద్యార్థులకు మేము బోధించిన విద్యా నెలా నెలా ప్రగతి కనబడాలంటే మీరు కూడా పిల్లలతో పాటు



ఉన్నత చదువులు చదువుకోవాలన్నారు.వారికి బోధించాలి మీరు చదువుకోవాలన్నారు ఈ వయసులో కూడా విద్యాభ్యాసం చేయడానికి మా వంతు సహాయం అందిస్తామని అన్నారు.ఓపెన్ టెన్త్ ఇంటర్ డిగ్రీ కోసం ముందుకు రమ్మని పిలుపునిస్తే 13 మంది స్పందించారని అందులో 8 మంది ఇంటర్ కోసం,5మంది డిగ్రీ చదవడానికి పేర్లు నమోదు చేసుకున్నారని తెలిపారు.తదుపరి విద్యార్థుల తల్లులు మధ్యాహ్న భోజనం చేసి శుచి శుభ్రత పై సంతృప్తి వ్యక్తం చేశారు.ఈకార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు లోకనాధం, ఉపాధ్యాయులు నరేష్,వాలంటీర్ ప్రవళిక,విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## పాఠశాల మౌలిక సదుపాయాల మెరుగుదలకు గ్రామ పంచాయతీ చర్యలు

అందోల్, జూలై 18, (ప్రజాజ్యోతి):
ప్రభుత్వ పాఠశాలలో మౌలిక సదుపాయాల మెరుగుదలపై దృష్టి సారించిన నేరడిగుంట–మక్తాగూడెం గ్రామ పంచాయతీ, నేరడిగుంట జెడ్పీహెచ్ఎస్‌లో తాగునీటి సౌకర్యాల అభివృద్ధి పనులను ప్రారంభించింది. విద్యార్థులు చాలాకాలంగా



ఎదుర్కొంటున్న తాగునీటి సమస్యను దృష్టిలో ఉంచుకుని పైప్‌లైన్ మరమ్మతులు చేపట్టారు. ఈ సందర్భంగా సర్పంచ్ వొగ్గు సాయికిరణ్ మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు మెరుగైన వాతావరణం కల్పించడం తమ బాధ్యత అని అన్నారు. విద్య, ఆరోగ్యానికి సంబంధించిన మౌలిక సదుపాయాలపై ప్రత్యేక దృష్టి సారించి, గ్రామ ప్రజల అవసరాలకు అనుగుణంగా అభివృద్ధి పనులను కొనసాగిస్తామని తెలిపారు. త్వరలోనే తాగునీటి సమస్య పూర్తిగా పరిష్కారమై విద్యార్థులకు ఇబ్బందులు తొలగిపోతాయని ఆశాభావం వ్యక్తం చేశారు.

## జూలై 20న ప్రజావాణి కార్యక్రమం రద్దు

సంగారెడ్డి ప్రజా జ్యోతి జూలై 18:
ఈ నెల 20వ తేదీ (సోమవారం) జిల్లా ఇన్‌చార్జి మంత్రి అధ్యక్షతన ఉమ్మడి జిల్లా స్థాయిలో ఎల్‌నినో ప్రభావం, ప్రస్తుత వాతావరణ పరిస్థితులు,వర్షపాతం, పంటల సాగు,గ్రౌండ్ వాటర్,విద్యుత్, తాగు



నీటి సరఫరా,సీజనల్ వ్యాధులనివారణ–నియంత్రణ చర్యలు తదితర అంశాలపై జిల్లా అధికారులు, ప్రజాప్రతినిధులతో సమీక్ష సమావేశం నిర్వహించనున్న నేపథ్యంలో, అదే రోజు నిర్వహించాల్సిన ప్రజావాణి కార్యక్రమాన్ని రద్దు చేసినట్లు జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ తెలిపారు. తదుపరి సోమవారం నుంచి ప్రజావాణి కార్యక్రమం యథావిధిగా నిర్వహించబడుతుందని ఆయన తెలిపారు. ప్రజలు ఈ విషయాన్ని గమనించి, జిల్లా యంత్రాంగానికి సహకరించాలని జిల్లా కలెక్టర్ కోరారు.

## సదాశివపేటలో కన్నుల పండువగా పూరీ జగన్నాథ రథయాత్ర

సంగారెడ్డి ప్రజా జ్యోతి ప్రతినిధి:
సదాశివపేట పట్టణంలో జగన్నాథ రథయాత్ర ఆధ్యాత్మిక ఉత్సాహం మధ్య అత్యంత ఘనంగా





గురువారం నిర్వహించారు. స్థానిక మాస్టర్ మైండ్ స్కూల్ యాజమాన్యం ఆధ్వర్యంలో, అంతర్జాతీయ కృష్ణ చైతన్య సంఘం (ఇస్కాన్) మార్గదర్శకత్వంలో ఈ శోభాయాత్రను వైభవంగా చేపట్టారు.
భక్తిశ్రద్ధలతో సాగిన యాత్ర:
స్థానిక అయ్యప్ప స్వామి దేవాలయం నుండి ప్రారంభమైన ఈ రథయాత్ర గురు నగర్ కాలనీ వరకు అత్యంత వైభవంగా సాగింది. పూరీ జగన్నాథుడి రథాన్ని లాగేందుకు భక్తులు, విద్యార్థులు పోటీ పడ్డారు. పట్టణ పురవీధుల గుండా సాగిన ఈ యాత్రలో భక్తుల జయజయ ధ్వానాలు, హరేకృష్ణ నామస్మరణతో సదాశివపేట వీధులు మారుమోగాయి.
చిన్నారుల కోలాటాలు.. సాంస్కృతిక ప్రదర్శనలు:
రథయాత్రలో మాస్టర్ మైండ్ స్కూల్ విద్యార్థులు, చిన్నారులు ఉత్సాహంగా పాల్గొన్నారు. రథాన్ని లాగుతూ భక్తిపాటలకు అనుగుణంగా చిన్నారులు వేసిన నృత్యాలు, కోలాటాలు, ఆటపాటలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. విద్యార్థుల కేరింతలు, సాంస్కృతిక ప్రదర్శనలతో పట్టణ వీధులన్నీ ఆధ్యాత్మిక శోభను సంతరించుకున్నాయని, ఈ వేడుక కన్నుల పండువగా సాగిందని స్థానిక ప్రజలు ఆనందం వ్యక్తం చేశారు.
ప్రముఖుల భాగస్వామ్యం:
ఈ ఆధ్యాత్మిక మహోత్సవంలో ఇస్కాన్ ప్రతినిధులు, మాస్టర్ మైండ్ స్కూల్ యాజమాన్యం సంతోష్, నవనీత, పాఠశాల ఉపాధ్యాయ బృందం, విద్యార్థుల తల్లిదండ్రులు మరియు స్థానిక కాలనీ వాసులు పెద్ద సంఖ్యలో పాల్గొని, జగన్నాథుడిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

## ఎస్ఎస్‌కే సమాజ్ జోగిపేట నూతన కార్యవర్గం ఏకగ్రీవ ఎన్నిక

### సమాజ్ అభివృద్ధి, సభ్యుల సంక్షేమమే లక్ష్యం: నూతన అధ్యక్షుడు రత్నపూరి వెంకటేష్

అందోల్, జూలై18, (ప్రజాజ్యోతి):
సోమ వంశ సహస్రార్జున క్షత్రీయ (ఖత్రి) సమాజ్ – జోగిపేట (సంగారెడ్డి జిల్లా) నూతన కార్యవర్గాన్ని సమాజ్ సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. నూతన కార్యవర్గ ఎన్నికలు ఐక్య వాతావరణంలో నిర్వహించగా, సభ్యులందరూ ఏకగ్రీవంగా నాయకత్వాన్ని ఎంపిక చేశారు.
నూతన కార్యవర్గంలో అధ్యక్షుడిగా రత్నపూరి వెంకటేష్, ఉపాధ్యక్షుడిగా రత్నపూరి సంతోష్ కుమార్, ప్రధాన కార్యదర్శిగా శ్రావణ్ నందుకుమార్, సహాయ కార్యదర్శిగా పూజారి రమేష్, కోశాధికారిగా రత్నపూరి గోపీనాథ్, సహ కోశాధికారిగా మేఘరాజ్ రాజేష్ ఎన్నికయ్యారు.
అలాగే సలహాదారులుగా రత్నపూరి నాగరాజు, రత్నపూరి చందర్, చవాన్ సిద్ధేశ్ లను నియమించారు.
సమిష్టి సహకారంతో ముందుకు
ఈ సందర్భంగా నూతన అధ్యక్షుడు రత్నపూరి వెంకటేష్ మాట్లాడుతూ.. సమాజంలోని ప్రతి సభ్యుడిని కలుపుకొని సమిష్టి సహకారంతో



సమాజ్ అభివృద్ధి, సంక్షేమం కోసం నిరంతరం కృషి చేస్తానని తెలిపారు. యువతను సమాజ్ కార్యక్రమాల్లో భాగస్వామ్యం చేయడంతో పాటు సేవా కార్యక్రమాలకు ప్రాధాన్యం ఇస్తామని పేర్కొన్నారు.
శుభాకాంక్షలు తెలిపిన సభ్యులు
నూతన కార్యవర్గ సభ్యులకు సమాజ్ సభ్యులు హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. వారి నాయకత్వంలో సమాజ్ మరింత అభివృద్ధి సాధించి, సభ్యుల ఐక్యత మరింత బలోపేతం కావాలని ఆకాంక్షించారు. తనపై విశ్వాసం ఉంచి ఏకగ్రీవంగా ఎన్నుకున్న ప్రతి సభ్యుడికి నూతన అధ్యక్షుడు రత్నపూరి వెంకటేష్ కృతజ్ఞతలు తెలియజేశారు.

## అక్రమంగా చికెన్ వ్యర్థాల పారవేతపై మున్సిపాలిటీ కొరడా

- పోసాన్‌పేట్ రోడ్డులో పట్టుకుని జరిమానా..
- పునరావృతమైతే కఠిన చర్యలు: కమిషనర్ తిరుపతి

అందోల్ జూలై 18, (ప్రజాజ్యోతి):
అందోలు–జోగిపేట మున్సిపాలిటీ పరిధిలోని పోసాన్‌పేట్ రోడ్డు ప్రాంతంలో బహిరంగ ప్రదేశంలో అక్రమంగా చికెన్ వ్యర్థాలను పారవేస్తున్న వ్యక్తిని మున్సిపల్ సిబ్బంది శనివారం పట్టుకుని జరిమానా విధించారు. కమిషనర్ తిరుపతి ఆదేశాల మేరకు ఈ చర్యలు చేపట్టినట్లు అధికారులు తెలిపారు.
అక్రమంగా వ్యర్థాలను పారవేసిన వ్యక్తికి జరిమానా విధించడంతో పాటు, భవిష్యత్తులో ఇలాంటి చర్యలకు పాల్పడవద్దని కౌన్సెలింగ్ నిర్వహించారు. పరిశుభ్రతకు భంగం కలిగించే చర్యలను మున్సిపాలిటీ ఎట్టి పరిస్థితుల్లోనూ సహించబోదని అధికారులు స్పష్టం చేశారు. ఈ సందర్భంగా మున్సిపల్ కమిషనర్ తిరుపతి మాట్లాడుతూ.. పట్టణంలో ఎవరైనా బహిరంగ ప్రదేశాల్లో చికెన్ వ్యర్థాలు లేదా ఇతర చెత్తను అక్రమంగా పారవేస్తే మున్సిపల్ చట్టాల ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రజలంతా పట్టణ పరిశుభ్రతను కాపాడడంలో సహకరించాలని ఆయన కోరారు. ఈ తనిఖీ కార్యక్రమంలో ఎన్విరాన్‌మెంటల్ ఇంజనీర్ శ్రీకాంత్, వర్క్ ఇన్‌స్పెక్టర్ మహిందర్ తదితరులు పాల్గొన్నారు.



## తండ్రి జ్ఞాపకార్థం మారేపల్లి అభివృద్ధి చేస్తున్న మాజీ ఎంపీపీ మనోజ్ రెడ్డి.

కొండాపూర్ ప్రజా జ్యోతి
తండ్రి జ్ఞాపకార్థంగా మారెపల్లిలో అభివృద్ధి చేసి తమ వంతు సహాయ సహకారాలు అందజేస్తామని మాజీ ఎంపీపీ మనోజ్ రెడ్డి అన్నారు. విద్యార్థులకు లాప్టాప్ లను అందజేశారు. మారేపల్లిలో మురికి కూపంగా మారిన కొత్త కుంటను అభివృద్ధి చేసి బతుకమ్మ మెట్లు నిర్మించి పర్యాటకంగా అభివృద్ధి చేస్తామన్నారు. జిల్లా పాఠశాల విద్యార్థులకు నారాయణ రెడ్డి కుమారులు తోడ్పాటునివ్వడం ఆనందంగా ఉందన్నారు. స్టేట్ బ్యాంక్ రూరల్ సెల్ఫ్ ఎంప్లాయిమెంట్ ట్రైనింగ్ ఇన్స్టిట్యూట్ లో శిక్షణ





శనివారం కొండాపూర్ మండల పరిధిలోని మారెపల్లి లో పట్లోళ్ల నారాయణ రెడ్డి ప్రథమ వర్ధంతి సందర్భంగా ఆయన జ్ఞాపకర్థం ఆయన కుమారులు మాజీ ఎంపీపీ మనోజ్ రెడ్డి, భాస్కర్ రెడ్డి, సంతోష్ రెడ్డి లు తమ సొంత నిధులు 20 లక్షలతో మారేపల్లి లోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రథమ ర్యాంకులు సాధించిన విద్యార్థులకు స్టేట్ ర్యాంక్ సాధించిన పరిషత్ ఉన్నత పాఠశాలలో 5 లక్షలతో విద్యార్థులకు శౌచాలయాలను నిర్మిస్తున్నామని చెప్పారు. ఈ సందర్భంగా తహసీల్దార్ అశోక్ మాట్లాడుతూ తండ్రి జ్ఞాపకార్థం కుమారులు ప్రభుత్వ పాఠశాల చర్య విద్యార్థులకు అండగా నిలవడం గ్రామ అభివృద్ధికి ముందుకు రావడం సంతోషంగా ఉందన్నారు. ఎంఈఓ దశరథ్ మాట్లాడుతూ పొందిన మహిళలకు కుట్టు మిషన్లను డైరెక్టర్ రాజేష్ తో కలిసి అందజేశారు.ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు సంజీవరావు, మాజీ సర్పంచ్ లు వెంకటేశం గౌడ్, రుక్మోద్దీన్, సొసైటి చైర్మన్ రాజు, ఉప సర్పంచ్ పట్నం శ్రీకాంత్, వివిధ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## యువ సంగ్రామ సదస్సుకు సంగారెడ్డి నుంచి భారీగా తరలిన విద్యార్థులు, యువజన నాయకులు

సంగారెడ్డి ప్రజా జ్యోతి ప్రతినిధి:
కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ప్రకటించిన "యూత్ డిక్లరేషన్" హామీలను అమలు చేయకుండా విద్యార్థులు, నిరుద్యోగ యువతను మోసం చేసిందని ఆరోపిస్తూ, భారత్ రాష్ట్ర సమితి (BRS) ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ★"యువ సంగ్రామ సదస్సు"★లో పాల్గొనేందుకు సంగారెడ్డి నియోజకవర్గం నుంచి విద్యార్థులు, యువజన నాయకులు పెద్ద ఎత్తున బయలుదేరారు. సంగారెడ్డి శాసనసభ్యులు చింతా ప్రభాకర్ ఆదేశాల మేరకు, యువ కిశోరం చింతా సాయినాథ్ పర్యవేక్షణలో విద్యార్థులు, యువజన నాయకులు ఉత్సాహంగా సదస్సుకు తరలివెళ్లారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, కాంగ్రెస్ ప్రభుత్వం నిరుద్యోగ భృతి, ఉద్యోగాల భర్తీ, పరీక్షల నిర్వహణ, యువత సంక్షేమానికి ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో పూర్తిగా విఫలమైందని విమర్శించారు. యువత సమస్యలపై ప్రభుత్వాన్ని నిలదీసి, వారి హక్కుల సాధన కోసం నిర్వహిస్తున్న యువ సంగ్రామ సదస్సు విజయవంతం అవుతుందని వారు ఆశాభావం వ్యక్తం చేశారు.
ఈ కార్యక్రమంలో సంగారెడ్డి నియోజకవర్గ విద్యార్థి విభాగం అధ్యక్షుడు శ్రీహరి, జిల్లా కోఆర్డినేటర్ రాజేందర్ నాయక్, కౌన్సిలర్ సోమశేఖర్, యువజన విభాగం అధ్యక్షుడు వాజీద్, నాని, ఎర్ర సంక్షయ్ గౌడ్ అడ్వకేట్ .సదాశివపేట, కొండాపూర్, కంది, సంగారెడ్డి మండల, పట్టణ అధ్యక్షులు, కార్యదర్శులు పాండు నాయక్, రోషన్, నాగేష్, ఏజాజ్, అఖిల్, చిన్నా, అక్షయ్, కార్తిక్, నవీన్, సందీప్ గౌడ్, పవన్, యువ సర్పంచులు హరిప్రసాద్, వినోద్, సందీప్,



ఖాదర్, సుభాష్, అలాగే నాయకులు చక్రి, నగేష్, బాబుజీ, శేఖర్, పర్వేద్ ప్రభాకర్ రెడ్డి, దప్పు నర్సింహులు, అహ్మద్, సాయి కిరణ్ రెడ్డి, చందు, వికాస్ తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థుల ఉన్నతికి తల్లిదండ్రుల సహకారం అవసరం

నారాయణఖేడ్, ప్రజాజ్యోతి జులై 18:
విద్యార్థులు ఉన్నత్తులుగా ఎదగాలంటే తల్లిదండ్రుల సహకారం చాలా అవసరమని జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు యాదవరెడ్డి అన్నారు. నారాయణఖేడ్ పట్టణంలోని జెడ్పిజిఎచ్ఎస్ పాఠశాలలలో శనివారం ఉపాధ్యాయులు మరియు విద్యార్థుల తల్లిదండ్రుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఉపాధ్యాయులు బాధ్యతగా పాఠశాలలో విద్యార్థులకు విద్యాబోధన చేస్తారని, విద్యార్థులు ఇంటికి వచ్చాక సరిగ్గా చదువుతు



న్నారా లేదా? హోంవర్క్ చేస్తున్నారా లేదా? ఏం చదువుతున్నారు?అంటూ పిల్లలను అడగడం తల్లిదండ్రుల బాధ్యత అన్నారు. అప్పుడప్పుడు పాఠశాలకు వచ్చి తమ కూతురు బాగా చదువుతుందా? అని తరగతి టీచర్ ను ఇతర ఉపాధ్యాయులను అడిగి తల్లిదండ్రులు తెలుసుకోవాలి అన్నారు. ఒకవేళ ఇంటివద్ద చదవకుండా, హోంవర్క్ చేయకుండా ఉంటే తల్లిదండ్రులు తమ దృష్టికి తీసుకొని రావాలన్నారు. విద్యార్థుల తల్లిదండ్రులు సలహాలు, సూచనలు ఇస్తేనే తప్పొప్పులు తెలుసుకొని విద్యార్థులను సక్రమ దారిలో పెట్టడానికి అవకాశం ఉంటుంది అన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాష, కవిత, గౌరమ్మ, అనురాధ, సౌమ్య, ఫయీమ్, శ్రీకాంత్, హాస్టల్ వార్డెన్ రజిత, విద్యార్థుల తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

## కంది సెంట్రల్ జైల్లో జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఆకస్మిక తనిఖీ

సంగారెడ్డి ప్రజా జ్యోతి ప్రతినిధి:
కందిలోని సెంట్రల్ జైలును జిల్లా ప్రధాన న్యాయమూర్తి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్ జి. భవాని చంద్ర ఆకస్మికంగా తనిఖీ చేశారు. జాతీయ, రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థల ఆదేశాల మేరకు ఈ తనిఖీలు నిర్వహించారు. జైలులోని బ్యారక్‌లు, గదులు, వంటగది మరియు జైలు ఆవరణను న్యాయమూర్తి క్షుణ్ణంగా పరిశీలించారు. ఖైదీలకు అందుతున్న భోజనాన్ని స్వయంగా రుచి చూసి, నిల్వ ఉంచిన బియ్యం, కూరగాయలను తనిఖీ చేశారు. అర్హులైన ప్రతి ఖైదీకి ఉచితంగా న్యాయవాదిని నియమించి, న్యాయ సహాయం అందిస్తామని భవాని చంద్ర భరోసా ఇచ్చారు. బెయిల్స్, ములాఖత్‌లు సమయానికి అందుతున్నాయా లేదా అని ఖైదీలను



అడిగి తెలుసుకున్నారు. అధికారులకు ఆదేశాలు: ఖైదీల హక్కుల పరిరక్షణే లక్ష్యంగా జైలు నిర్వహణలో పరిశుభ్రత, ఆరోగ్య సేవలు, సంక్షేమ కార్యక్రమాలను మరింత మెరుగుపరచాలని జైలు సూపరింటెండెంట్ సంతోష్ కుమార్ రాయ్‌ను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి బి. సౌజన్య, జైలు సూపరింటెండెంట్ సంతోష్ కుమార్ రాయ్, అడ్వకేట్లు మరియు జైలు సిబ్బంది పాల్గొన్నారు. ఖైదీల సంక్షేమం కోసం ఇలాంటి తనిఖీలు క్రమం తప్పకుండా కొనసాగుతాయని న్యాయమూర్తి స్పష్టం చేశారు.

## మహిళల్లో రొమ్ము క్యాన్సర్‌ను ప్రారంభ దశలోనే గుర్తించి చికిత్స అందించేందుకు సమన్వయంతో పనిచేయాలి

సంగారెడ్డి ప్రజా జ్యోతి ప్రతినిధి జూలై 18:–
–జిల్లాలో మహిళల్లో రొమ్ము క్యాన్సర్ కేసులను ప్రారంభ దశలోనే గుర్తించి, అనుమానితులను సకాలంలో వైద్య పరీక్షలు, చికిత్స కోసం రిఫర్ చేసే విధంగా అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ అధికారులను ఆదేశించారు. శనివారం జిల్లా కలెక్టర్ అధ్యక్షతన ఎస్ఇఆర్పి శాఖ, యునో బ్రెస్ట్ ఫౌండేషన్, గ్రాన్యూల్స్ ఇండియా, సంస్థల సమన్వయంతో రొమ్ము క్యాన్సర్ గుర్తింపు, ముందస్తు నిర్ధారణ కార్యక్రమాల అమలుపై వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, మహిళల్లో రొమ్ము క్యాన్సర్‌పై విస్తృత అవగాహన కల్పించడం, గ్రామ స్థాయిలో స్క్రీనింగ్ కార్యక్రమాలను సమర్థవంతంగా నిర్వహించడం, అనుమానిత కేసులను వెంటనే ఉన్నత వైద్య కేంద్రాలకు రిఫర్ చేసే వ్యవస్థను బలోపేతం చేయాలని సూచించారు. వ్యాధిని ప్రారంభ దశలోనే గుర్తిస్తే చికిత్స విజయవంతం అయ్యే



అవకాశాలు ఎక్కువగా ఉంటాయని తెలిపారు. జిల్లాలో ఈ కార్యక్రమాన్ని విజయవంతంగా అమలు చేసేందుకు వైద్య ఆరోగ్య శాఖ, గ్రామీణాభివృద్ధి శాఖ, ఎస్ఈఆర్ పి తో పాటు సంబంధిత అన్ని శాఖలు పరస్పర సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు. గ్రామీణ ప్రాంత మహిళలకు రొమ్ము క్యాన్సర్ లక్షణాలు, ముందస్తు పరీక్షల అవసరంపై విస్తృత ప్రచారం నిర్వహించి, ఎక్కువ మంది మహిళలు స్క్రీనింగ్‌లో పాల్గొనేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.క్షేత్రస్థాయిలో అవగాహన కార్యక్రమాలు, స్క్రీనింగ్ శిబిరాల నిర్వహణలో ఎస్ఈఆర్ పి శాఖ, యునో బ్రెస్ట్ ఫౌండేషన్, గ్రాన్యూల్స్ ఇండియాకు అధికారులు పూర్తి సహకారం అందించాలని కలెక్టర్ ఆదేశించారు. ఈ కార్యక్రమం ద్వారా మహిళల్లో రొమ్ము క్యాన్సర్‌ను ప్రారంభ దశలోనే గుర్తించి, సకాలంలో చికిత్స అందేలా చర్యలు చేపట్టాలని పేర్కొన్నారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి జ్యోతి , జిల్లా వైద్య ఆరోగ్య అధికారి డా.లలితా దేవి , డిప్యూటీ జిల్లా వైద్య ఆరోగ్య అధికారులు , ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వైద్యాధికారులు, మండల పరిషత్ అభివృద్ధి అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# తల్లిదండ్రుల భాగస్వామ్యంతోనే విద్యార్థుల ఉజ్వల భవిష్యత్

## ఎంఈఓ బుచ్చ నాయక్, ప్రధానోపాధ్యాయులు బి సాంబయ్య

వెల్దుర్తి (ప్రజాజ్యోతి) జూలై 18:
వెల్దుర్తి పీఎం శ్రీ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శనివారం ఉపాధ్యాయులు–తల్లిదండ్రుల సమావేశం ఉత్సాహభరితంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన మండల విద్యాధికారి బుచ్చ నాయక్ విద్యార్థుల సమగ్ర





అభివృద్ధికి తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు సమన్వయంతో పనిచేయాల్సిన అవసరాన్ని వివరించారు. ప్రతి విద్యార్థి క్రమం తప్పకుండా పాఠశాలకు హాజరవుతూ చదువుతో పాటు మంచి క్రమశిక్షణను అలవర్చుకోవాలని సూచించిన ఆయన, తల్లిదండ్రులు పిల్లల విద్యపై నిరంతరం శ్రద్ధ చూపాలని కోరారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు సాంబయ్య మాట్లాడుతూ పీఎం శ్రీ పథకం కింద పాఠశాలలో అమలవుతున్న విద్యా కార్యక్రమాలు, విద్యార్థుల అభ్యాస నైపుణ్యాల పెంపు, హాజరు శాతం మెరుగుదల కోసం చేపడుతున్న ప్రత్యేక చర్యలను తల్లిదండ్రులకు వివరించారు. సమావేశంలో గత జూన్ నెలలో 100 శాతం హాజరు సాధించిన విద్యార్థులను ఎంఈఓ బుచ్చ నాయక్, ప్రధానోపాధ్యాయులు సాంబయ్య ప్రశంసాపత్రాలతో సత్కరించి అభినందించారు. ఇదే స్ఫూర్తితో ప్రతి విద్యార్థి నిరంతర హాజరుతో ఉత్తమ ఫలితాలు సాధించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, విద్యార్థులు పాల్గొని విద్యాభివృద్ధిపై తమ అభిప్రాయాలను పంచుకున్నారు.

# గ్రామ పంచాయతీల సమగ్ర అభివృద్ధి ప్రణాళికపై కీలక సమావేశం

## ఎంపీడీవో జెట్టి విగ్నేష్

వెల్దుర్తి (ప్రజాజ్యోతి) జూలై 18:
గ్రామాల సమగ్ర అభివృద్ధే లక్ష్యంగా తెలంగాణ గ్రామ పంచాయతీ సమగ్ర అభివృద్ధి ప్రణాళిక అమలుపై వెల్దుర్తి ఎంపీడీవో కార్యాలయంలో శనివారం కీలక





సమావేశం నిర్వహించారు. మండల పరిషత్ అభివృద్ధి అధికారి విగ్నేష్ ఆధ్వర్యంలో జరిగిన ఈ సమావేశంలో మండలంలోని గ్రామా సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎంపీడీవో విగ్నేష్ మాట్లాడుతూ, గ్రామ ప్రజల అవసరాలు, మౌలిక సదుపాయాల అభివృద్ధి, తాగునీరు, పారిశుద్ధ్యం, రహదారులు, విద్య, ఆరోగ్యం వంటి అంశాలకు ప్రాధాన్యత ఇస్తూ సమగ్ర అభివృద్ధి ప్రణాళికను రూపొందించాలని సూచించారు. గ్రామాల అభివృద్ధిలో ప్రజల భాగస్వామ్యాన్ని పెంచుతూ, ప్రభుత్వం నిర్దేశించిన మార్గదర్శకాల ప్రకారం ప్రణాళికలను సిద్ధం చేసి సమర్థవంతంగా అమలు చేయాలని సర్పంచులు మరియు పంచాయతీ కార్యదర్శులకు వివరించారు. గ్రామాభివృద్ధికి సమగ్ర ప్రణాళికే బలమైన పునాది అని పేర్కొన్నారు. ఈ సమావేశంలో గ్రామ పంచాయతీల అభివృద్ధికి సంబంధించిన పలు అంశాలపై విస్తృతంగా చర్చించి, అధికారులు అవసరమైన సూచనలు, సలహాలు అందించారు.

# ఉరి వేసుకుని యువకుడి మృతి

చిన్నకోడూరు, జూలై18, (ప్రజాజ్యోతి):– ఉరివేసుకొని యువకుడు ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండల పరిధి చంద్లాపూర్ గ్రామంలో చోటుచేసుకుంది.



ఎస్ఐ చంద్రమోహన్ తెలిపిన వివరాల ప్రకారం గ్రామానికి చెందిన దరిపల్లి శ్రీనివాస్(33) గత మూడు సంవత్సరాలుగా హైదరాబాదులో ప్రైవేటు ఉద్యోగం చేస్తున్నాడు. గత నెల రోజుల క్రితం స్వగ్రామమైన చంద్లాపూర్ కు వచ్చి ఇరవై రోజుల నుండి సిద్దిపేటలోని ఓ బట్టల షోరూంలో పనిచేస్తున్నాడు. శనివారం నాడు మృతుడు తల్లి నరసవ్వ సిద్దిపేటలోని తన కూతురింటికి వెళ్ళగా శ్రీనివాస్ ఇంట్లో దూలానికి ఉరి వేసుకున్నాడు. స్థానికులు గమనించి నరసవ్వకు ఫోన్లో సమాచారం అందించగా కుటుంబీకులు ఇంటికి చేరుకుని చూడగా శ్రీనివాస్ మృతి చెందాడు. తన కుమారుడు చనిపోయేముందు ఓ అమ్మాయి ఫోటో వాట్సప్ స్టేటస్ పెట్టి ఆత్మహత్య చేసుకున్నందున తన కుమారుడి మృతి పై విచారణ జరపాలని మృతుడు తల్లి ఫిర్యాదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

# దేశం కోసం రైతు... రైతు కోసం ఎవరు?

## వరుణుడి కోసం రైతు ఎదురుచూపులు.. రాజకీయాల కోసం నేతల పరుగులు

కొండపాక, జూలై ,18(ప్రజా జ్యోతి ):
దేశానికి అన్నం పెట్టే రైతు నేడు తన కడుపు నింపుకోవడానికి ప్రకృతి కరుణ కోసం



ఎదురుచూడాల్సిన దుస్థితి ఏర్పడింది. ఒకప్పుడు నెర్రబారిన నల్లరేగడి నేలను ముద్దాడి నాగలికి కొత్త నడక నేర్పిన రైతు చేతులు నేడు ఆకాశం వైపు ప్రార్థనగా ఎత్తబడ్డాయి. నీలి నింగిలో మెరుపులు కనిపించడం లేదు. నల్లని మేఘాలు కమ్ముకోవడం లేదు. తొలకరి జల్లులు రైతు ఆశలను తడపడం లేదు. విత్తనం నేలలో పడింది... కానీ జీవం పోసే చినుకు మాత్రం ఇంకా రాలేదు. పొలం ఎండితే పంట పోతుంది... రైతు ఎండితే దేశం పోతుంది రైతు జీవితం కేవలం వానపై ఆధారపడిన కథ కాదు. అది అప్పులు, ఆశలు, కన్నీళ్లు, కష్టాల కలయిక. అప్పు చేసి విత్తనం కొన్నాడు. ఎరువులు తెచ్చాడు. పొలం దున్నాడు. చివరకు ఆకాశం వైపు చూసే పరిస్థితికి చేరుకున్నాడు. పొలంలో పడ్డ పగుళ్లను పూడ్చవచ్చు. కానీ రైతు గుండెల్లో పడ్డ గాయాలను ఎవరు పూడుస్తారు?

### వ్యవస్థ వైఫల్యానికి అద్దం పట్టే చేదు నిజం.

రైతు వాన కోసం చూస్తుంటే... నాయకులు కెమెరాల కోసం చూస్తున్నారు
ఒకవైపు రైతులు ఆకాశం వైపు ఆశగా చూస్తుంటే, మరోవైపు రాజకీయ నాయకులు కెమెరాల వైపు చిరునవ్వులు చిందిస్తున్నారు. కాలువల వెంట పర్యటనలు, వరుస ప్రకటనలు, హామీల వరద... కానీ రైతు పొలంలో మాత్రం నీటి చుక్క లేదు.

### రైతు అడిగేది ఒక్కటే—— "నా పంటను కాపాడేది ఎవరు?"

ప్రచార యాత్రలతో పంటలు పండవు. సభలతో సాగునీరు రాదు. ప్రకటనలతో రైతు అప్పులు తీరవు. రైతు కష్టాన్ని ఎన్నికల వేదికలపై వినిపించే నినాదంగా కాకుండా, పరిష్కరించాల్సిన జాతీయ సమస్యగా చూడాల్సిన సమయం వచ్చింది.

దేశానికి అన్నం పెట్టే చేతికి నేడు తినడానికి అన్నమే కరువైతే అది కేవలం ప్రకృతి వైపరీత్యం కాదు

### అన్నదాత ఆకలి కేక వినిపించకపోతే... దేశం చెవిటిదైనట్టే

దేశ ప్రజల ఆకలిని తీర్చే రైతు ఇంట్లోనే ఆకలి రాజ్యమేలితే, అది రైతు ఓటమి కాదు——సమాజం ఓటమి.
రైతు ఆత్మహత్య ఒక గణాంకం కాదు. అది





ఒక కుటుంబం కూలిపోవడం. ఒక గ్రామం విషాదంలో మునిగిపోవడం. ఒక దేశం తన అన్నదాతను నిర్లక్ష్యం చేసిన చరిత్ర.

### రైతుకు ఉపకారం కాదు... హక్కు ఇవ్వండి

రైతు దానం అడగడం లేదు. గౌరవప్రదమైన జీవితం కోరుతున్నాడు. అతనికి కావాల్సింది సమయానికి సాగునీరు, గిట్టుబాటు ధర, నాణ్యమైన విత్తనాలు, పంట నష్టానికి వెంటనే పరిహారం, అప్పుల నుంచి విముక్తి కలిగించే విధానాలు. ఇవన్నీ ప్రభుత్వం చేసే ఉపకారాలు కావు. దేశానికి అన్నం పండించే రైతుకు దక్కాల్సిన హక్కులు.

### చివరి మాట

దేశం కోసం రైతు తన చెమటను నేలలో చల్లుతున్నాడు. ఆ రైతు కన్నీళ్లు కూడా అదే నేలలో కలిసిపోతున్నాయి.
రైతు బతికితేనే వ్యవసాయం బతుకుతుంది. వ్యవసాయం బతికితేనే దేశం బతుకుతుంది.

"అన్నదాతను కాపాడటం సంక్షేమ పథకం కాదు... దేశ భవిష్యత్తును కాపాడే జాతీయ బాధ్యత.

నిమ్మ నరసింహారెడ్డి
ప్రజా జ్యోతి,కొండపాక

# గ్రామ అభివృద్దే లక్ష్యంగా పనిచేస్తాం

## – గుడికందుల గ్రామ సర్పంచ్ కన్నయ్యగారి లక్ష్మి

తొగుట, జులై 18 (ప్రజాజ్యోతి):
గుడికందుల గ్రామ అభివృద్ధికే లక్ష్యంగా పనిచేస్తామని గ్రామ సర్పంచ్ కన్నయ్య గారి లక్ష్మి పేర్కొన్నారు. గ్రామంలోని ఎస్సీ కాలనీలో శనివారం సీసీ రోడ్డు



నిర్మాణానికి పిఏసిఎస్ చైర్మెన్ కే. హరికృష్ణ రెడ్డి తో కలిసి సర్పంచ్ లక్ష్మీ భూమి పూజ చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి సహకారంతో గ్రామ అభివృద్దే లక్ష్యంగా ముందుకు సాగుతామని తెలిపారు. ఎన్ఆర్ఈజీఎస్ ద్వారా పది లక్షల రూపాయల నిధులు మంజూరయ్యాయని, గ్రామ తమ నూతన పాలకవర్గం ఎన్నికైనప్పటినుండి దాదాపుగా ఇప్పటివరకు పది లక్షల రూపాయల డ్రైనేజీ నిర్మాణాన్ని పూర్తి చేసామని తెలిపారు.
రాజకీయాలకతీతంగా గ్రామ అభివృద్ధికి ప్రతి ఒక్కరు సహకరించాలని కోరారు. రాబోయే రోజులలో దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి సహకారంతో మరిన్ని అభివృద్ధి పనులను పూర్తి చేసి గ్రామ ప్రజలకు అందుబాటులోకి తీసుకొస్తామని హామీ ఇచ్చారు. గ్రామంలో ఇంకా ఏమైనా సమస్యలున్న తమ దృష్టికి తీసుకురావాలని ఒక్కొక్కటిగా సమస్యలను పరిష్కారం చేసుకుంటూ గ్రామాన్ని అభివృద్ధి చేసుకుందామన్నారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ పర్శయ్య, పంచాయతీ కార్యదర్శి రవి, వార్డ్ సభ్యులు ధావుల గళ్ళ కృష్ణ, బేజుగామ మహేష్, బంగారుగళ్ల ఈశ్వర్, ఉప్పరి కమలాకర్, హనుమండ్ల కాడి మధుసూదన్ రెడ్డి, మాజీ సర్పంచ్ మల్లయ్య, నాయకులు ఎల్లం, శ్రీకాంత్, బేజుగామ రాజు తదితరులు పాల్గొన్నారు.

# నాయకత్వం అంటే పదవి కాదు బాధ్యత

## గజ్వేల్ సీఐలు రవికుమార్, సత్యనారాయణ

గజ్వేల్, జూలై 18(ప్రజా జ్యోతి):
సిద్దిపేట జిల్లా గజ్వేల్–ప్రజ్ఞాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని సెయింట్ మేరీస్ విద్యానికేతన్ హై స్కూల్లో విద్యార్థి నాయకుల ప్రమాణ స్వీకారోత్సవం ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమానికి గజ్వేల్ సీఐలు రవికుమార్, సత్యనారాయణ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నాయకత్వం అంటే బ్యాడ్జ్ ధరించడం కాదు,బాధ్యతను



స్వీకరించడం అని అన్నారు.విద్యార్థి నాయకులు ఇతరులకు ఆదర్శంగా ఉండాలని, నిజాయితీ, క్రమశిక్షణ, సేవాభావంతో వ్యవహరించాలని సూచించారు.నాయకుడు ఆదేశాలు ఇచ్చేవాడు కాదని, ముందుగా తానే ఆచరించి చూపేవాడని పేర్కొన్నారు.పాఠశాలలో ఏర్పాటు చేసిన హౌస్‌ల లక్ష్యాలను వివరిస్తూ, జూపిటర్ గ్రూప్ సభ్యులు మంచి మనసుతో అందరితో కలిసిమెలిసి ఉండాలని, వీనస్ గ్రూప్ ప్రేమాభిమానాలతో పాఠశాలకు కీర్తి తీసుకురావాలని, మెర్క్యూరీ గ్రూప్ తెలివితేటలతో చురుకైన నిర్ణయాలు తీసుకోవాలని, నెప్ట్యూన్ గ్రూప్ ఆదర్శవంతంగా వ్యవహరించాలని సూచించారు. విద్యార్థులు సామాజిక మాధ్యమాలకు దూరంగా ఉండి చదువుపై దృష్టి సారించాలని, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, పాఠశాలకు మంచి పేరు తీసుకురావాలని కోరారు.పాఠశాల కరస్పాండెంట్ గోపు ఇన్నారెడ్డి మాట్లాడుతూ, నాయకత్వ పదవి గౌరవం మాత్రమే కాదని, అది బాధ్యత అని అన్నారు.పాఠశాలలో క్రమశిక్షణను కాపాడడం విద్యార్థి నాయకుల ప్రధాన కర్తవ్యమని, క్రమశిక్షణ కలిగిన విద్యార్థుల చేతిలోనే దేశ భవిష్యత్తు ఉందన్నారు. అలాగే, పాఠశాలను ప్లాస్టిక్ నిషేధిత పాఠశాలగా ప్రకటిస్తూ, పాఠశాలలోనూ, ఇళ్లలోనూ ప్లాస్టిక్ వస్తువుల వినియోగాన్ని తగ్గించాలని పిలుపునిచ్చారు.ఎన్నికైన విద్యార్థి నాయకులు తమ బాధ్యతలను నిజాయితీగా, క్రమశిక్షణతో నిర్వర్తిస్తూ పాఠశాల ప్రతిష్ఠను మరింత పెంచేందుకు కృషి చేస్తామని ప్రమాణం చేశారు. ఎస్ఎస్‌సీ విభాగంలో ఎన్నికైన హౌస్ నాయకులు, జూపిటర్ హౌస్ కెప్టెన్, బి. రిషికేష్, వైస్ కెప్టెన్ – కె. భృతిక వీనస్ హౌస్ కెప్టెన్,తట్ట ఎం. హర్షవర్ధన్, వైస్ కెప్టెన్,జే. సహస్ర మెర్క్యూరీ హౌస్ కెప్టెన్ ఎన్. శ్రీకర్, వైస్ కెప్టెన్ పి. ప్రణయ నెప్ట్యూన్ హౌస్ కెప్టెన్ బి. దీక్షిత్, వైస్ కెప్టెన్ మోక్షిత సీబీఎస్ఈ కోసం విభాగంలో ఎన్నికైన హౌస్ నాయకులు ఆకాష్ హౌస్ కెప్టెన్ యుగంధర్, వైస్ కెప్టెన్ శ్రీనిత్య అగ్ని హౌస్ కెప్టెన్ పవన్, వైస్ కెప్టెన్ రిత్విక పృథ్వి హౌస్ కెప్టెన్ చరణ్ రాజ్, వైస్ కెప్టెన్ శ్రీమాన్య వాయు హౌస్ కెప్టెన్ అంకిత్ పాల్, వైస్ కెప్టెన్ అభిజ్ఞ.ఈ కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్ థామస్ రెడ్డి, ప్రిన్సిపల్ కాటరాయప్ప, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.



# అధైర్య పడొద్దు..అండగా ఉంటాం

## జెండా మోసిన మిమ్మల్ని గౌరవిస్తాం "నాయిని" ని పరామర్శించిన మైనంపల్లి

సిద్దిపేటఅర్బన్ ,జూలై 18(ప్రజాజ్యోతి):
అధైర్యపడకు "నర్సన్న" అండగా ఉంటామంటూ మాజీ శాసనసభ్యులు మైనంపల్లి హనుమంతారావు భరోసా ఇచ్చారు. ఇటీవల శస్త్ర చికిత్స జరగి ఇంట్లో విశ్రాంతి పొందుతున్న రాష్ట్ర కిసాన్ సెల్ కో కన్వీనర్ నాయిని నరసింహారెడ్డిని మాజీ శాసనసభ్యుడు, సిద్దిపేట మునిసిపాలిటీ ఎన్నికల ఇంచార్జి మైనంపల్లి హనుమంతారావు కాంగ్రెస్ నాయకులతో కలిసి శనివారం నాడు పరామర్శించి





ధైర్యం చెప్పారు. ఒక్కటే కాంగ్రెస్ జెండా ను నమ్ముకున్న మీ సేవలను తప్పక గుర్తిస్తామన్నారు. ధైర్యంగా ఉండాలని మళ్ళీ మునుపటి జోష్ తో పార్టీ కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొనేలా దేవుడు శక్తిని ఇవ్వాలని కోరుకుంటున్నామన్నారు. ఏ విషయానికి అయినా తాను అండగా ఉంటానని అభయమిచ్చారు. తదుపరి వైద్య ఖర్చుల నిమిత్తం లక్ష రూపాయల ఇస్తానని హామీ ఇచ్చారు. పరామర్శించిన వారిలో మార్కెట్ కమిటీ చైర్మన్లు దేవులపల్లి యాదగిరి, మీసం మహేందర్, ఎస్సి డిపార్ట్మెంట్ చైర్మన్ తప్పేట శంకర్, నాయకులు తాడూరి శ్రీనివాస్, గంప మహేందర్, సాకి ఆనంద్, ఆలకుంట మహేందర్, సందీప్ యాదవ్ తదితరులు ఉన్నారు.

# ఓటర్ల జాబితా సవరణ వేగవంతం చేయాలి

## మాజీ ఎమ్మెల్యే తుంకుంట నర్సారెడ్డి

కొండపాక, జూలై 18: (ప్రజా జ్యోతి ):
కొండపాక మండలంలోని తిమ్మారెడ్డిపల్లి, కొండపాక గ్రామాల్లో శనివారం ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) కార్యక్రమంపై



అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా గజ్వేల్ మాజీ ఎమ్మెల్యే తుంకుంట నర్సారెడ్డి మాట్లాడుతూ, అర్హులైన ప్రతి ఒక్కరి పేరు ఓటర్ల జాబితాలో నమోదు అయ్యేలా ప్రత్యేక చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. ఓటరు నమోదు ఫారాలను వేగంగా పూర్తి చేసేందుకు ప్రత్యేక బృందాలు ఏర్పాటు చేయాలని, బూత్ లెవల్ అధికారులు, బూత్ లెవల్ ఏజెంట్లు సమన్వయంతో గ్రామాల్లో ప్రజలకు విస్తృతంగా అవగాహన కల్పించాలని కోరారు. తిమ్మారెడ్డిపల్లి గ్రామంలో ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమాన్ని 100 శాతం పూర్తి చేసిన సందర్భంగా బీఎల్ఓతో పాటు కాంగ్రెస్ పార్టీ బీఎల్ఏను మాజీ ఎమ్మెల్యే తుంకుంట నర్సారెడ్డి శాలువాతో సన్మానించి అభినందించారు. ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు అత్యంత విలువైనదని, ప్రతి అర్హుడూ ఓటరుగా నమోదు కావాలని ఆయన పిలుపునిచ్చారు.

## ప్రజా సేవలో కాంగ్రెస్ హెల్ప్ డెస్క్..

మెట్‌పల్లి, జూలై 18, ప్రజా జ్యోతి:
మెట్‌పల్లి పట్టణంలోని 3వ వార్డులో నిర్వహించిన 'సార్' దరఖాస్తుల నమోదు కార్యక్రమం ప్రజల భాగస్వామ్యంతో విజయవంతంగా ముగిసింది. దరఖాస్తుల నమోదు సమయంలో ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులను గుర్తించిన జగిత్యాల జిల్లా కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి బర్ల సూరి తన మిత్ర బృందంతో కలిసి ప్రత్యేక హెల్ప్ డెస్క్ ఏర్పాటు చేసి





ప్రజలకు అండగా నిలిచారు.శుక్రవారం ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు నిరంతరంగా సేవలందించిన బర్ల సూరి, ఆయన బృందం సాంకేతిక అవగాహన లేని వృద్ధులు, మహిళలు, సామాన్య ప్రజల దరఖాస్తులను స్వయంగా పూర్తి చేస్తూ సుమారు 200 మందికి పైగా లబ్ధిదారులకు సహాయం అందించారు.
ఈ కార్యక్రమాన్ని రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు జువ్వాడి కృష్ణారావు, మెట్‌పల్లి టౌన్ కాంగ్రెస్ అధ్యక్షుడు రైసోద్దీన్ ప్రత్యక్షంగా పర్యవేక్షించారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు ప్రజలకు ప్రభుత్వ పథకాలపై అవగాహన కల్పిస్తూ, దరఖాస్తుల ప్రక్రియలో పూర్తి సహకారం అందించడం అభినందనీయమని వారు పేర్కొన్నారు.
ఎండ, వానలను సైతం లెక్కచేయకుండా ప్రజా సేవను లక్ష్యంగా పెట్టుకుని హెల్ప్ డెస్క్ నిర్వహించిన బర్ల సూరి, ఆయన మిత్ర బృందానికి 3వ వార్డు ప్రజలు ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు.
ఈ కార్యక్రమంలో బీఎల్ఓ అనురాధ విజయలక్ష్మి , స్థానిక కాంగ్రెస్ కౌన్సిలర్లు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## అంగన్వాడి కేంద్రాల్లో మౌలిక వసతుల తనిఖీ

మేడిపల్లి జూలై 18 ప్రజా జ్యోతి
జగిత్యాల ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలోని మేడిపల్లి మండలంలోని వల్లంపెల్లి, కల్వకోట అంగన్వాడి కేంద్రాలను సీడీపీఓ జయప్రద శుక్రవారం సందర్శించారు. కేంద్రాల నిర్వహణ, మౌలిక వసతులు,



పరిసరాల పరిశుభ్రతను పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. మిషన్ భగీరథ పైప్‌లైన్‌ను స్థానిక ప్రజాప్రతినిధులు, ఆర్డబ్ల్యూఎస్ అధికారులతో కలిసి తనిఖీ చేసిన అనంతరం అర్హులైన లబ్ధిదారులకు టేక్ హోమ్ రేషన్ (టీహెచ్ఆర్) పంపిణీ చేశారు.కార్యక్రమంలో సర్పంచ్‌లు సట్టా భూమేష్, గుగ్గిళ్ల రమేష్, ఆర్డబ్ల్యూఎస్ డీఈవీ తార, ఏఈ శివాని, పంచాయతీ కార్యదర్శులు ప్రవీణ్, ఇళయ చంద్ర, ఐసీడీఎస్ సూపర్వైజర్లు మమత, షైనీ మాథ్యూ, భాగ్యలక్ష్మి , అంగన్వాడీ టీచర్లు శారద, స్వప్న, బాలభారతి, సుమలత, పద్మతో పాటు గ్రామ పెద్దలు, లబ్ధిదారులు, తల్లులు, చిన్నారులు పాల్గొన్నారు.

## వ్యక్తిత్వ వికాసంపై ప్రత్యేక శిక్షణ

కొడిమ్యాల, జూలై 18,(ప్రజాజ్యోతి):
మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్ విద్యార్థులకు శనివారం ప్రత్యేక వ్యక్తిత్వ వికాస తరగతులను



ప్రారంభించారు. ఇంటర్మీడియట్ బోర్డు ఆదేశాల మేరకు ప్రతి శనివారం ఈ తరగతులు నిర్వహిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ పి. గోపాల్ తెలిపారు. ఇవి విద్యార్థుల సమగ్ర అభివృద్ధికి దోహదపడతాయని పేర్కొన్నారు. ఈ సందర్భంగా స్టూడెంట్ కౌన్సిలర్ డాక్టర్ పి. తిరుపతి "లక్ష్యాలు–ఆశయాలు" అంశంపై మాట్లాడారు. ప్రతి విద్యార్థి ఉన్నత లక్ష్యాన్ని నిర్దేశించుకొని పట్టుదల, క్రమశిక్షణ, అంకితభావం, ప్రణాళికతో కృషి చేస్తే విజయాన్ని సాధించవచ్చని సూచించారు. కార్యక్రమంలో అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## ఉండేడ లో పూర్వ ప్రాథమిక పాఠశాల తరగతులు ప్రారంభం ,

ఎండపల్లి,జులై 18 ప్రజా జ్యోతి
జగిత్యాల జిల్లా ఎండపల్లి మండలంలోని ఉండేడ ప్రాథమిక పాఠశాలలో పూర్వ ప్రాథమిక (ప్రీ–ప్రైమరీ)పాఠశాలను శనివారం మండల విద్యాధికారి సముద్రాల హరికృష్ణ ,పాఠశాల ప్రధానోపాధ్యాయులు శంకర్ తో కలిసి గ్రామ సర్పంచ్ ఆవుల మమత తిరుపతి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంఈఓ మాట్లాడుతూ ప్రీ –ప్రైమరీ పాఠశాలను గ్రామస్తులు సద్వినియోగం చేసుకొని తమ పిల్లలను ఈ పాఠశాలకు పంపించాలని ఆయన సూచించారు.ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ ఆవుల మమత తిరుపతి ఎండపల్లి మండల విద్యాధికారి సముద్రాల హరికృష్ణ,పాఠశాల ప్రధానోపాధ్యాయులు శంకర్ ఉపసర్పంచ్ పోతు రవి,వార్డ్ సభ్యులు గుండ మనోజ్, ప్రేమలత పాఠశాల విద్యార్థుల తల్లి తండ్రులు పాల్గొన్నారు



## కమ్మునూరులో రూ.10 లక్షల సీసీ రోడ్డు పనులకు ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్ శంకుస్థాపన

బీర్‌పూర్, జూలై 18 (ప్రజా జ్యోతి):
బీర్ పూర్ మండలంలోని కమ్మునూరు గ్రామంలో జగిత్యాల శాసనసభ్యులు డాక్టర్ సంజయ్ కుమార్ శనివారం విస్తృతంగా





పర్యటించారు. గ్రామంలోని పోచమ్మ తల్లి ఆలయానికి మంజూరైన రూ.10 లక్షల ప్రత్యేక నిధులతో నిర్మించనున్న సీసీ రోడ్డు పనులకు ఆయన శాస్త్రోక్తంగా భూమిపూజ చేసి, శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గ్రామాల్లోని దేవాలయాల అభివృద్ధికి, భక్తులకు అవసరమైన మౌలిక వసతుల కల్పనకు ప్రభుత్వం ఎల్లప్పుడూ కట్టుబడి ఉంటుందని స్పష్టం చేశారు కొల్వాయిలో 'వరద పాశం' పూజల్లో ఎమ్మెల్యే సకాలంలో సమృద్ధిగా వర్షాలు కురవాలని ఆకాంక్షిస్తూ బీర్ పూర్ మండలంలోని కొల్వాయి గ్రామంలో గ్రామస్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. గ్రామంలోని సీతారామ ఆలయ ఆవరణలో సాంప్రదాయబద్ధంగా ఏర్పాటు చేసిన ఈ 'వరద పాశం' కార్యక్రమంలో జగిత్యాల శాసనసభ్యులు డాక్టర్ సంజయ్ కుమార్ పాల్గొన్నారు. వానలు బాగా కురిసి, పంటలు సమృద్ధిగా పండాలని, రైతులు సుభిక్షంగా ఉండాలని కోరుకుంటూ ఆయన గ్రామస్తులతో కలిసి దేవునికి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ భీమేష్, తహసీల్దార్ సుజాత, ప్యాక్స్ చైర్మన్ నవీన్ రావు, మండల పార్టీ అధ్యక్షుడు నారపాక రమేష్, జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యదర్శి నరేందర్, రామకిష్టు గంగాధర్ సర్పంచ్‌లు తోట శ్రీనివాస్, రంగు లక్ష్మణ్, రాజగోపాల్ రావు, చిక్రం మారుతి, సాగర్, సతీష్, నర్సయ్య, సుశీన్, హరీష్, శ్వేత రాజకుమార్, మాజీ సర్పంచ్ బండెల మరియ రాజేశంతో పాటు వివిధ శాఖల అధికారులు, మండల, గ్రామ నాయకులు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

## తల్లిదండ్రుల భాగస్వామ్యంతోనే విద్యార్థుల ప్రగతి

- జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష
- రానున్న ఆరు నెలల్లో పాఠశాలల మౌలిక వసతుల పనులు పూర్తి
- ప్రతి తల్లిదండ్రులు పేరెంట్–టీచర్ సమావేశాలకు తప్పనిసరిగా హాజరుకావాలి
- తుర్కల మద్దికుంట ఎంపీపీ ఎస్ పాఠశాలలో తల్లిదండ్రుల సమావేశంలో జిల్లా కలెక్టర్

పెద్దపల్లి, ప్రతినిధి జూలై–18 ప్రజా జ్యోతి;
విద్యార్థుల విద్యా ప్రగతిలో తల్లిదండ్రుల భాగస్వామ్యం అత్యంత కీలకమని, తల్లిదండ్రులు చేపడుతున్న మౌలిక వసతుల అభివృద్ధి, విద్యార్థుల విద్యా ప్రమాణాల పెంపు, తల్లిదండ్రుల బాధ్యతలపై పలు సూచనలు చేశారు.
ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష మాట్లాడుతూ, ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతుల అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందన్నారు. తుర్కల మద్దికుంట ఎంపీపీ ఎస్ పాఠశాలలో ప్రహరీ గోడ నిర్మాణం పూర్తయిందని, జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలలకు సంబంధించిన మౌలిక వసతుల పనులన్నింటినీ రానున్న ఆరు నెలల్లో పూర్తి చేసేలా చర్యలు చేపడుతున్నామని తెలిపారు.
మౌలిక వసతుల కల్పనతో పాటు విద్యార్థుల విద్యా ప్రమాణాలను పెంచడంపై కూడా ప్రత్యేక దృష్టి సారిస్తున్నామని కలెక్టర్ పేర్కొన్నారు. ఈ లక్ష్యం సాధించడంలో తల్లిదండ్రుల సహకారం తద్వారా వారు మిస్సైన పాఠాలను ప్రత్యేకంగా బోధించే అవకాశం ఉంటుందని అన్నారు.
ప్రతి రోజు పాఠశాల నుంచి ఇంటికి వచ్చిన తర్వాత కొంత సమయం పిల్లలతో గడపాలని, పాఠశాలలో ఏమి నేర్చుకున్నారో, హోంవర్క్ ఇచ్చారా అని అడిగి తెలుసుకోవాలని సూచించారు. ప్రతిరోజూ హోంవర్క్ పూర్తి చేసేలా తల్లిదండ్రులు పర్యవేక్షించాలని కోరారు. తల్లిదండ్రులు ఎప్పుడైనా పాఠశాలకు వచ్చి తమ పిల్లల విద్యా పురోగతి, ప్రవర్తన గురించి ఉపాధ్యాయులను సంప్రదించవచ్చని కలెక్టర్ తెలిపారు. తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, జిల్లా యంత్రాంగం సమిష్టిగా పనిచేస్తే ప్రభుత్వ పాఠశాలలను మరింత బలోపేతం చేయడంతో పాటు విద్యార్థులను అన్ని రంగాల్లో ఉన్నత స్థాయికి తీసుకెళ్లవచ్చని పేర్కొన్నారు.
తల్లిదండ్రుల సంపూర్ణ సహకారం లభిస్తే





ఉపాధ్యాయులతో సమన్వయంతో పనిచేస్తే ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు కార్పొరేట్ పాఠశాలల విద్యార్థుల కంటే మెరుగైన ప్రతిభ కనబరుస్తారని జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష తెలిపారు.
శనివారం పెద్దపల్లి మండలంలోని తుర్కల మద్దికుంట ఎంపీపీ ఎస్ పాఠశాలలో నిర్వహించిన తల్లిదండ్రుల సమావేశంలో జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష పాల్గొని పాఠశాలలో ఎంతో అవసరమని, ప్రతి తల్లిదండ్రులు తప్పనిసరిగా పేరెంట్–టీచర్ సమావేశాలకు హాజరై తమ పిల్లల చదువు, ప్రగతి గురించి ఉపాధ్యాయులను అడిగి తెలుసుకోవాలని సూచించారు.
విద్యార్థులు ప్రతిరోజూ క్రమం తప్పకుండా పాఠశాలకు హాజరయ్యేలా తల్లిదండ్రులు చూడాలని కలెక్టర్ తెలిపారు. ఏదైనా కారణంతో కొద్ది రోజులు పాఠశాలకు రాలేకపోతే వెంటనే ఉపాధ్యాయులకు సమాచారం అందించాలని, ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు కార్పొరేట్ పాఠశాలల విద్యార్థుల కంటే మెరుగైన ఫలితాలు సాధిస్తారని జిల్లా కలెక్టర్ విశ్వాసం వ్యక్తం చేశారు.
ఈ కార్యక్రమంలో డి.ఈ.ఓ. శారద , జి.సి.డి.ఓ. కవిత,సర్పంచ్ రాజయ్య, ఉప సర్పంచ్ తిరుపతి,పాఠశాల ప్రధానోపాధ్యాయులు మంజులత, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు ,తదితరులు, పాల్గొన్నారు.

## ప్రజల సహకారంతోనే రెండేళ్ల ప్రయాణం విజయవంతం

### చొప్పదండి మార్కెట్ కమిటీ చైర్మన్ కొత్తూరి మహేష్

చొప్పదండి, జూలై 18(ప్రజా జ్యోతి):
చొప్పదండి మార్కెటింగ్ కమిటీ చైర్మన్ గా తన రెండేళ్ల పదవీకాలం విజయవంతంగా పూర్తి చేసుకున్న సందర్భంగా కొత్తూరి మహేష్ అందరికీ కృతజ్ఞతలు తెలిపారు.ఈ రెండేళ్ల ప్రయాణంలో నన్ను నమ్మి,నాతో కలిసి నడిచి,ప్రతి అడుగులోనూ అండగా నిలిచిన ప్రతి ఒక్కరికీ నా హృదయపూర్వక ధన్యవాదాలు అని ఆయన అన్నారు.ఈ బాధ్యతను సక్రమంగా నిర్వర్తించే అవకాశం కల్పించిన చొప్పదండి శాసన సభ్యులు మేడిపల్లి సత్యం ప్రేమ, నమ్మకం,సహకారం తన జీవితంలో ఎప్పటికీ మరువలేనని కొత్తూరి మహేష్ చెప్పారు.చొప్పదండి మండల, పట్టణ రైతులు, ప్రజలు, నాయకులు,పాత్రికేయులు,శ్రేయోభిలాషులు,అధికారులు,మార్కెటింగ్ సిబ్బంది,ట్రేడర్స్,హమాలీలు ఇలా ప్రతిఒక్కరిసహకారంతోనే కమిటీ కార్యకలాపాలు సజావుగా సాగాయని పేర్కొన్నారు. అందరి ఆశీర్వాదం,సూచనలు, ప్రోత్సాహమే ఈ విజయానికి కారణం.ఈ పదవి నాది మాత్రమే కాదు,మీ అందరి ప్రేమకు,నమ్మకానికి ప్రతీక అని ఆయన అన్నారు.ప్రత్యక్షంగా, పరోక్షంగా సహకరించినప్రతిఒక్కరికీశిరస్సువంచినమస్కరిస్తున్నానని, అభిమానం,ఆదరణ ఎప్పటికీ ఇలాగే ఉండాలని ఈ సందర్భంగా ఆయన కోరుకున్నారు.సేవే నా ధ్యేయం,ప్రజల సంక్షేమమే నా లక్ష్యం. ప్రజల ఆశీస్సులతో భవిష్యత్తులో కూడా ఇదే సేవా స్ఫూర్తితో పని చేస్తాను. చొప్పదండి పట్టణ,మండల ప్రజలకు నేను జీవితాంతం రుణపడి ఉంటాను అని కొత్తూరి మహేష్ పేర్కొన్నారు.



## ట్రినిటీ ఇంజనీరింగ్ కళాశాలకు రెండు బీటెక్ కోర్సులకు అనుమతి

### ...ఈఏపీసెట్ రెండో విడత కౌన్సెలింగ్‌లో ..అందుబాటులోకి సీఎస్ఈ (ఐఓటీ), సీఎస్ఈ (డేటా సైన్స్) కోర్సులు

పెద్దపల్లి, ప్రతినిధి జూలై 18 (ప్రజాజ్యోతి):
స్థానిక ట్రినిటీ ఇంజనీరింగ్ కళాశాల (అటానమస్)కు 2026–27 విద్యా సంవత్సరానికి జేఎన్‌టీయూహెచ్ అనుమతితో బీటెక్ కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్ (ఐఓటీ), కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్ (డేటా సైన్స్) నూతన కోర్సులను తెలంగాణ ఈఏపీసెట్ రెండో విడత కౌన్సెలింగ్‌లో ప్రవేశపెట్టేందుకు అనుమతి లభించింది.
ఈ సందర్భంగా కళాశాల వ్యవస్థాపకులు దాసరి మనోహర్ రెడ్డి, చైర్మన్ దాసరి ప్రశాంత్ రెడ్డి, డాక్టర్ దాసరి మమతా రెడ్డి మాట్లాడుతూ.. 2008లో స్థాపించబడిన ట్రినిటీ ఇంజనీరింగ్ కళాశాల పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా ఎప్పటికప్పుడు ఉద్యోగావకాశాలు అధికంగా ఉన్న నూతన కోర్సులను ప్రవేశపెడుతూ వస్తోందన్నారు. జేఎన్‌టీయూహెచ్, రాష్ట్ర ప్రభుత్వ అనుమతులతో సీఎస్ఈ (ఐఓటీ), సీఎస్ఈ (డేటా సైన్స్) కోర్సులను ఈఏపీసెట్ రెండో విడత కౌన్సెలింగ్‌లో అందుబాటులోకి తీసుకువచ్చినట్లు తెలిపారు.
అటానమస్ హోదా, నాక్ గుర్తింపు, కేంద్ర ప్రభుత్వ ఆమోదంతో ఎంఎస్ఎంఈ ఇంక్యుబేషన్ సెంటర్ కలిగిన కళాశాలగా ట్రినిటీ ప్రత్యేక గుర్తింపు పొందిందన్నారు.




ఇప్పటి వరకు వేలాది మంది విద్యార్థులు ఇక్కడ విద్యాభ్యాసం చేసి దేశ, విదేశాల్లోని ప్రముఖ బహుళజాతి సంస్థలు, ప్రభుత్వ రంగ సంస్థల్లో ఉన్నత ఉద్యోగాల్లో స్థిరపడినట్లు పేర్కొన్నారు. విద్యార్థులు, తల్లిదండ్రులు కళాశాల విద్యా ప్రమాణాలు, అనుభవజ్ఞులైన అధ్యాపక బృందం, ఆధునిక సౌకర్యాలు, మెరుగైన ప్లేస్‌మెంట్ అవకాశాలను దృష్టిలో ఉంచుకుని ట్రినిటీ ఇంజనీరింగ్ కళాశాలను తొలి ప్రాధాన్యతగా ఎంపిక చేసుకోవాలని వారు కోరారు.
ఈ కార్యక్రమంలో అకాడమిక్ డైరెక్టర్ అశోక్ కుమార్, ప్రిన్సిపల్ డాక్టర్ మణి గణేషన్, ఏవో సురేష్, రాజిరెడ్డి, చొప్పరి వంశీ, విభాగాధిపతులు డాక్టర్ ఆరిఫ్, ప్రభాకర్, స్వాతి, లక్ష్మి , పద్మిని, వంశీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## ప్రజా సమస్యలే ధ్యేయంగా ,మండల బిజెపి కార్యవర్గ సమావేశం ,

ఎండపల్లి జులై 18, ప్రజా జ్యోతి
జగిత్యాల జిల్లా ఎండపల్లి మండలంలో భారతీయ జనతా పార్టీ మండల కార్యవర్గ సమావేశం కొత్తపేట లో విస్తృతంగా జరిగింది,ఈ సమావేశంలో పార్టీ సంస్థాగత బలోపేతం, బూత్ స్థాయి నిర్మాణం, సభ్యత్వ నమోదు, కేంద్ర ప్రభుత్వ సంక్షేమ పథకాల ప్రచారం, అలాగే రాష్ట్రంలో నెలకొన్న నిరుద్యోగం, రైతుల సమస్యలు, తాగునీటి కొరత, దెబ్బతిన్న రహదారులు, అవినీతి వంటి ప్రజా సమస్యలపై విస్తృతంగా చర్చించి పలు కీలక తీర్మానాలను ఏకగ్రీవంగా ఆమోదించారు.ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, ప్రజా సమస్యల పరిష్కారంలో కాంగ్రెస్ రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని విమర్శించారు. ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ నాయకత్వంలోని కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రతి



ఇంటికి తీసుకెళ్లి పార్టీని గ్రామస్థాయి నుంచి మరింత బలోపేతం చేయాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో బీజేపీ ఎండపల్లి మండల అధ్యక్షులు రావు హనుమంతరావు , బీజేపీ ఎస్సీ మోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఒరగంటి చంద్రశేఖర్ ధర్మపురి అసెంబ్లీ ఇన్‌చార్జ్ కన్నం అంజయ్య ,ధర్మపురి అసెంబ్లీ కన్వీనర్ కొమ్ము రాంబాబు ,జగిత్యాల జిల్లా ఉపాధ్యక్షులు గుజ్జుల వేణుగోపాల్ రెడ్డి ,ఎస్ఐఆర్ ధర్మారం,ఎండపల్లి మండల ఇన్‌చార్జ్ లక్ష్మణ్ యువమోర్చా జగిత్యాల జిల్లా కార్యదర్శి ఈర్ల నవీన్ ఎస్సీ మోర్చా జిల్లా ఉపాధ్యక్షులు దుర్గం రమేష్ యువ మోర్చా అధ్యక్షులు జక్కుల సాగర్, కిసాన్ మోర్చ అథ్యక్షలు సబ్బు సంతోష్, బి ఎం ఎస్ అద్యక్షలు అనంద్ మండల ప్రధాన కార్యదర్శులు పొన్నం నరేష్,మేడిపల్లి రాజశేఖర్, మంచికట్ల రవి , ఉపాధ్యక్షలు గోపనవేని గంగాచలం కట్కూరి వెంకటేశ్, కార్యదర్శులు మామిడిపల్లి రమేష్ , రమేష్, మీడియా కన్వీనర్ జెల్ల శ్రీనివాస్, శక్తికేంద్ర ఇన్‌చార్జ్లు, బూత్ అధ్యక్షులు పార్టీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## ఆరుతడి పంటలను వేసుకోవాలి వ్యవసాయశాఖ

ఇల్లంతకుంట జూలై 18 (ప్రజజ్యోతి)
రాజన్న సిరిసిల్ల జిల్లా ఇల్లంతకుంట మండలంలోని పోత్తూరు నర్సక్కపేట గ్రామంలో గ్రామ పంచాయతీలయందు వ్యవసాయ విస్తరణ అధికారిని.లలిత ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించినరూ ఈ సందర్భంగా లలిత మాట్లాడుతూ ఎల్నినో ప్రభావం వలన వర్షాలు వర్షపాతం పరిస్థితులు లేకపోవడం వలన ఆరుతడి పంటలు కంది, పెసర, జొన్న లాంటి నీటి అవసరం తక్కువగా ఉన్న పంటలను వేసుకోవాలని రైతులకి సూచించరూ. ఈ కార్యక్రమంలో పోత్తూరు వ్యవసాయ విస్తరణ అధికారినీ లలిత గ్రామ కార్యదర్శి పద్మ, జాఫర్ గ్రామ సర్పంచ్ అశ్విని శ్రీనివాస్ ఉపసర్పంచ్ నరేష్ నర్సక్కపేట గ్రామ సర్పంచ్ బెంద్రం శంకరమ్మ ఉప సర్పంచ్ నరేష్ గ్రామ రైతులు పాల్గొన్నారు.



## యువ సంగ్రామ సదస్సుకు ముస్తాబాద్ నుంచి బీఆర్ఎస్ యువత భారీగా తరలివేత

ముస్తాబాద్, జూలై 18: ( ప్రజా జ్యోతి )
కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సమయంలో "యూత్ డిక్లరేషన్" పేరుతో యువతకు, నిరుద్యోగులకు పలు హామీలు ఇచ్చి వారి ఓట్లను పొందిందని, అయితే అధికారంలోకి వచ్చిన తర్వాత ఆ హామీలను పూర్తిగా విస్మరించిందని బీఆర్ఎస్ నాయకులు విమర్శించారు. ఇచ్చిన హామీలను అమలు చేయాలని, కాంగ్రెస్ ప్రభుత్వానికి బుద్ధి రావాలనే సంకల్పంతో హైదరాబాద్‌లోని సరూర్‌నగర్‌లో బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ★"యువ సంగ్రామ సదస్సు"★కు ముస్తాబాద్ మండలం నుంచి బీఆర్ఎస్ యువత భారీగా తరలివెళ్లింది. ఈ సదస్సుకు బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ముఖ్య అతిథిగా హాజరవుతున్నారు. కార్యక్రమంలో పాల్గొనేందుకు ముస్తాబాద్ మండలం నుంచి పెద్ద సంఖ్యలో యువ నాయకులు బయలుదేరారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ పార్టీ మండల యువజన అధ్యక్షుడు శీలం స్వామి, యూత్ సీనియర్ నాయకుడు రాచమడుగు సంతోష్ రావు, యూత్ రాష్ట్ర నాయకులు మెంగని మనోహర్, విద్యార్థి




విభాగం మండల అధ్యక్షుడు యండి. నవాజ్, నరేష్, పల్లె ఆనంద్, శ్రీనివాస్, వంగురి దిలీప్, వెంకటేష్, రాజు, మనీష్ తదితరులు పాల్గొన్నారు.

## వర్షాలు కురవాలని ముస్లింల ప్రార్థనలు.

కాల్వ శ్రీరాంపూర్ జూలై 18 (ప్రజా జ్యోతి)
కాల్వ శ్రీరాంపూర్ మండలంలోని పెద్ద రాతుపల్లి గ్రామంలో గల. మధునం పోచమ్మ తల్లి దేవత ఆలయం సమీపంలో. మండలంలోని ముస్లిం సోదరులు వర్షాలు కురవాలని శనివారం రోజున భార్య పిల్లల తోప్రార్థనలు చేశారు. అనంతరం అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు .వారిని మాజీ ఎంపీపీ గోపగోని సారయ్య గౌడ్ అభినందించారు .ఈ కార్యక్రమంలో సదర్ రహీం. నాయక్ సదర్ ఎండి అబ్దుల్లా. సెక్రటరీ ఎండి ఇబ్రహీం . జెం టుసెక్రటరీ ఉపసర్పంచుల ఫోరం జిల్లా ఉపాధ్యక్షుడు మేడి అశోక్. మండల అధ్యక్షుడు గోలి సుధాకర్ .మాజీ సర్పంచ్ ఓరుగంటి కొమురయ్య గౌడ్. కోశాధికారి మద్దూం హ్యాపీ జొద్దీన్ .మునీర్ .ఫకీర్. రహీంఖాన్ .రాజ్ మహమ్మద్. హుస్సేన్. బాస్మియా ఖదీర్. లాల్ మహమ్మద్ . తదితరులు పాల్గొన్నారు



## రైల్వే సిగ్నల్ స్టేషన్‌ను పరిశీలించిన ఐఎన్‌టీయూసీ వైస్ ప్రెసిడెంట్ కోటేశ్వరరావు

సత్తుపల్లి జూలై18(ప్రజా జ్యోతి)
సత్తుపల్లి పరిధిలోని రైల్వే సిగ్నల్ స్టేషన్‌తో పాటు రైల్వే వ్యాగన్లలో బొగ్గు లోడింగ్, రవాణా వ్యవస్థను ఐఎన్‌టీయూసీ వైస్ ప్రెసిడెంట్ కోటేశ్వరరావు శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా స్టేషన్‌లోని సిగ్నలింగ్ వ్యవస్థ, భద్రతా ప్రమాణాలు, లోడింగ్ ప్రక్రియ, నిర్వహణ విధానాలను పరిశీలించి



సంబంధిత అధికారులతో మాట్లాడారు.బొగ్గు లోడింగ్, రవాణా ప్రక్రియ ఎలాంటి ఆటంకాలు లేకుండా సజావుగా కొనసాగేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని, రైల్వే ఉద్యోగులు సురక్షితమైన వాతావరణంలో విధులు నిర్వహించేలా,అన్ని మౌలిక సదుపాయాలు కల్పించాలని ఆయన సూచించారు. అలాగే సిగ్నలింగ్ వ్యవస్థ ఎల్లప్పుడూ సమర్థవంతంగా పనిచేసేలా అధికారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని కోరారు. ఈ సందర్భంగా కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకుని,వాటి పరిష్కారానికి తన వంతు సహకారం అందిస్తానని కోటేశ్వరరావు హామీ ఇచ్చారు. కార్మికుల సంక్షేమం, భద్రత విషయంలో ఐఎన్‌టీయూసీ ఎల్లప్పుడూ ముందుంటుందని ఆయన తెలిపారు.

ఈ కార్యక్రమంలో ఐఎన్‌టీయూసీ బ్రాంచ్ సెక్రటరీ మురళీకృష్ణ, బ్రాంచ్ చీఫ్ ఆర్గనైజింగ్ సెక్రటరీ షాట్రాక్ బాబు, వేణునాథ్, యశ్వంత్ రెడ్డి, జేవీఆర్ సీహెచ్‌పీ పిట్ సెక్రటరీ నగేష్,రమేష్, ఇక్బాల్, డి ఎల్ ఆర్ ఇంచార్జ్ సుభాని, శ్రీను తదితరులు పాల్గొన్నారు

## చెత్త సేకరణ పేరుతో అదనపు సెస్ ను రద్దు చేయాలి

ఇల్లందు, జులై 18 (ప్రజా జ్యోతి):
మున్సిపల్ పరిధిలో ఇంటి పన్ను కడుతున్నప్పటికి చెత్త పన్ను ఎందుకని, చెత్త సేకరణ పేరుతో అదనపు సెస్ (సెస్) భారాన్ని మోపకుండా వెంటనే





రద్దు చేయాలని 19వ వార్డు కౌన్సిలర్ పింగళి అనూహ్య నరేష్ డిమాండ్ చేశారు. శనివారం మున్సిపల్ కార్యాలయంలో కమిషనర్ కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి ఇల్లు మున్సిపాలిటీకి చట్టబద్ధంగా ఇంటి పన్ను చెల్లిస్తున్నప్పుడు, పారిశుధ్య నిర్వహణ బాధ్యత పూర్తిగా మున్సిపాలిటీదేనని స్పష్టం చేశారు. ఇంటి పన్ను వసూలు చేస్తూ, మళ్లీ చెత్త సేకరించడానికి ఇంటికి రూ. 50, రూ. 100, రూ. 200 చొప్పున అదనంగా వసూలు చేయడం మున్సిపల్ నిబంధనలకే విరుద్ధమని విమర్శించారు. ప్రజల నుంచి వసూలు చేస్తున్న పన్నుల డబ్బులన్నీ ఏమవుతున్నాయని, పారిశుద్ధ్యనికి ఆ బడ్జెట్ ఎందుకు వాడటం లేదన్నారు. 24 వార్డుల్లోని పేద, మధ్యతరగతి ప్రజలపై ఇలాంటి భారాలు వేయడం న్యాయమేనా అని, పట్టణ ప్రజలను ఆర్థికంగా ఇబ్బందులకు గురిచేసే ఈ అక్రమ వసూళ్లను తక్షణమే నిలిపివేయాలని డిమాండ్ చేశారు. మున్సిపల్ అధికారులు, పాలకవర్గం ఈ నిర్ణయాన్ని వెనక్కి తీసుకోకపోతే, ప్రజలందరితో కలిసి మున్సిపల్ కార్యాలయాన్ని ముట్టడిస్తామని, న్యాయపరమైన పోరాటానికి సిద్ధంగా ఉన్నామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో వార్డు ప్రజలు పాల్గొన్నారు.

## మధ్యాహ్న భోజన కార్మికుల సమస్యల పరిష్కారానికి జూలై 23న కలెక్టరేట్ ముట్టడి

### రూ.26 వేల కనీస వేతనం, ఉద్యోగ భద్రత సహా 8 డిమాండ్లు

టేకులపల్లి,జూలై18, ప్రజాజ్యోతి: మధ్యాహ్న భోజన పథకం కార్మికుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 23న కొత్తగూడెం కలెక్టరేట్ ఎదుట నిర్వహించే ధర్నాను విజయవంతం చేయాలని తెలంగాణ మధ్యాహ్న భోజన పథకం కార్మికుల యూనియన్ (సీఐటీయూ) జిల్లా కమిటీ పిలుపునిచ్చింది. శుక్రవారం టేకులపల్లి ఎంఈఓ కార్యాలయంలో ఎంఈఓ అందుబాటులో లేకపోవడంతో కార్యాలయ సిబ్బందికి సీఐటీయూ నాయకులు వినతిపత్రం అందజేశారు. ప్రస్తుతం ఉన్న రూ.10 వేల వేతనాన్ని రూ.26 వేలకు పెంచడం, ఈపీఎఫ్–ఈఎస్ఐ అమలు, ఉద్యోగ భద్రత, గ్యాస్ బకాయిలు, ప్రోత్సాహకాలు వెంటనే చెల్లించడం, మెనూ ఛార్జీలు పెంపు, గర్భిణీ కార్మికులకు వేతనంతో కూడిన ప్రసూతి సెలవులు, ప్రతి నెల సకాలంలో వేతనాలు, రూ.10 లక్షల ప్రమాద బీమా అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఈసం రాణి, కడుగుల వీరన్న, కొట్టెమ్మ, వెంకటమ్మ, సుమతి తదితరులు పాల్గొన్నారు.



# వర్షాలు తక్కువ. రైతులు మెట్ట పంటల వైపు దృష్టి సారించాలి

**శాస్త్రవేత్తల సూచనల ప్రకారం సాగు విధానాలు మార్చుకోవాలి**

**కూసుమంచి మండల పర్యటనలో తెలంగాణ రెవెన్యూ, గృహ నిర్మాణం, సమాచార పౌరసంబంధాల శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి**

**రూ.4.61 కోట్లతో ప్రగతి పనులకు శంకుస్థాపన.. చెక్కుల పంపిణీ**

పాలేరు ఆర్ సీ, జూలై18 ప్రజా జ్యోతి;
ఎల్ నినో ప్రభావం వల్ల ఈ ఏడాది వర్షాలు తక్కువగా నమోదవుతాయని వాతావరణ



శాస్త్రవేత్తలు హెచ్చరిస్తున్నారని, ఈ పరిస్థితుల్లో రైతాంగం సాంప్రదాయ సాగు మొండిపట్టు వీడి, మారుతున్న ప్రకృతి సవాళ్లకు అనుగుణంగా అప్రమత్తం కావాలని, అధిక నీటి వినియోగం ఉండే పంటల జోలికి వెళ్లకుండా, తక్కువ నీటి అవసరాలతో చేతికొచ్చే ప్రత్యామ్నాయ మెట్ట పంటల వైపే దృష్టి సారించాలని రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణం, సమాచార పౌరసంబంధాల శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి అన్నారు. శనివారం పాలేరు నియోజకవర్గ పరిధిలోని కూసుమంచి మండలంలో మంత్రి,జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్ తో కలిసి విస్తృతంగా పర్యటించారు. మండల పర్యటనలో భాగంగా



మంత్రి, పలు చోట్ల శంకుస్థాపనలు చేశారు. మల్లాయిగూడెంలో రూ. 2.52 కోట్లతో పెరిక సింగారం ఎన్ఎస్పీ కెనాల్ నుంచి భగవాన్ తండా మీదుగా మల్లాయిగూడెం వరకు నిర్మించనున్న బీటీ రోడ్డు పనులకు, రూ. 20 లక్షలతో నిర్మించే గ్రామ పంచాయతీ కార్యాలయ భవనానికి భూమిపూజ చేశారు. అనంతరం కోక్యా తండాలో రూ. 1.69 కోట్లతో లింగారం తండా నుంచి లోక్యా తండా ఎన్ఎస్పీ కాలువ వరకు నిర్మించే బీటీ రోడ్డు పనులకు, అగ్రహారంలో రూ. 20 లక్షలతో నిర్మించనున్న పంచాయతీ భవనానికి శంకుస్థాపనలు చేశారు. అనంతరం కూసుమంచిలోని మంత్రి క్యాంపు కార్యాలయంలో లబ్ధిదారులకు మంత్రి చేతుల మీదుగా సంక్షేమ చెక్కుల పంపిణీ జరిగింది. మండల వ్యాప్తంగా 66 మందికి కల్యాణలక్ష్మి , షాదీ ముబారక్ చెక్కులను లబ్ధిదారులకు అందజేశారు. అదేవిధంగా వివిధ అనారోగ్య కారణాలతో ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్న 111 మంది బాధితులకు రూ. 35.16 లక్షల విలువైన ముఖ్యమంత్రి సహాయ నిధి (సీఎంఆర్ఎఫ్) చెక్కులను మంత్రి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమాలను ఉద్దేశించి మంత్రి మాట్లాడుతూ, ప్రజా ప్రభుత్వం ఎల్లప్పుడూ రైతుల పక్షపాతి అని, ఇప్పటికే 'రైతు భరోసా' అందించి అన్నదాతలకు అండగా నిలిచామని స్పష్టం చేశారు. మారుతున్న వాతావరణ పరిస్థితుల దృష్ట్యా శాస్త్రవేత్తల సూచనలను పాటిస్తూ సాగు విధానాల్లో మార్పులు చేసుకోవడం అత్యంత ఆవశ్యకమని అన్నారు.ప్రజాప్రభుత్వం పేదవారికి అండగా పనిచేస్తున్నదని మంత్రి తెలిపారు. 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్, సన్నబియ్యం, కొత్త రేషన్ కార్డుల జారీ చేశామన్నారు. మొదటి విడత ఇందిరమ్మ ఇళ్ళు ఇచ్చామని, రెండో విడత ఇందిరమ్మ ఇళ్ళు త్వరలో ఇస్తామని, మూడో, నాలుగో విడతల ఇందిరమ్మ ఇళ్ళు ఇస్తామని, అర్హులైన ప్రతిఒక్క కుటుంబానికి ఇందిరమ్మ ఇళ్ళు వస్తాయని మంత్రి అన్నారు. రైతు భరోసా ఎకరాకు 6 వేలు రైతుల ఖాతాల్లో జమచేశామన్నారు.



రైతుల సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని తెలిపారు. ప్రజలకు కావాల్సిన అన్ని మౌళిక వసతుల కల్పన చేస్తామన్నారు.ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ పి. శ్రీనివాస రెడ్డి, పీఆర్ ఎస్ఇ వెంకట్ రెడ్డి, హౌజింగ్ పిడి శ్రీనివాస్, కూసుమంచి మండల తహసీల్దార్ సైదులు, ఎంపిడివో సిలార్ సాహెబ్, వివిధ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

## నారాయణలో వెల్లివిరిసింది ప్రజాస్వామ్య స్ఫూర్తి

### వైభవంగా విద్యార్థి కేబినెట్ ఎన్నికలు – ఘనంగా ప్రమాణ స్వీకారోత్సవం

సత్తుపల్లి జూలై18(ప్రజా జ్యోతి):
పట్టణంలోని కాకర్లపల్లి రోడ్డులో గల నారాయణ పాఠశాలలో శనివారం విద్యార్థి కేబినెట్ ఎన్నికలు, ప్రమాణ స్వీకారోత్సవం అత్యంత వైభవంగా శనివారం నిర్వహించారు. ప్రజాస్వామ్య విలువలు, నాయకత్వ లక్షణాలు,బాధ్యతాయుతమైన నిర్ణయాలు తీసుకునే సామర్థ్యాన్ని,విద్యార్థుల్లో పెంపొందించే లక్ష్యంతో నిర్వహించిన ఈ కార్యక్రమంలో విద్యార్థులు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు ఉత్సాహంగా పాల్గొని విజయవంతం చేశారు.ఎన్నికల ప్రక్రియలో టీ. ననిత్ భార్గవ్ రామ్ హెడ్ బాయ్‌గా, ఎ. జస్విత హెడ్ గర్ల్‌గా, ఆర్. లీలేంద్ర డిప్యూటీ హెడ్ బాయ్‌గా, వి. ఆరాధ్య డిప్యూటీ హెడ్ గర్ల్‌గా, జస్విన్ జూనియర్ హెడ్ బాయ్‌గా, మోక్ష శ్రీ జూనియర్ హెడ్ గర్ల్‌గా ఎన్నికయ్యారు. అలాగే అగ్ని, నాగ్, పృథ్వీ, త్రిశూల్, కూశమంత్, తనుజ్, కార్తిక, కాలి హౌస్ కెప్టెన్లుగా విజయం సాధించారు.అనంతరం నూతనంగా ఎన్నికైన విద్యార్థి ప్రతినిధులతో ఘనంగా ప్రమాణ స్వీకార కార్యక్రమం నిర్వహించారు. ఖమ్మం జోన్ ఏజీఎం రాంకీ ముఖ్య అతిథిగా హాజరై నూతన కేబినెట్ సభ్యులకు ప్రమాణం చేయించి అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, విద్యార్థి దశ నుంచే నాయకత్వ లక్షణాలు, క్రమశిక్షణ, బాధ్యత, ప్రజాస్వామ్య విలువలను అలవర్చే ఇటువంటి కార్యక్రమాలు వారి భవిష్యత్తుకు బలమైన పునాది వేస్తాయని అన్నారు. విశిష్ట అతిథిగా పాల్గొన్న హైస్కూల్ ఆర్ అండ్ డి హెడ్ అనిల్ కుమార్ మాట్లాడుతూ, విద్యార్థులు తమకు అప్పగించిన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వర్తిస్తూ పాఠశాల అభివృద్ధికి ఆదర్శంగా నిలవాలని ఆకాంక్షించారు.కార్యక్రమ ప్రారంభంలో విద్యార్థిని లక్ష్మి హంషిక ప్రదర్శించిన భరతనాట్య నృత్యం సభికులను విశేషంగా ఆకట్టుకుంది. విద్యార్థుల క్రమశిక్షణ, ఎన్నికల నిర్వహణలో చూపిన చొరవ, తల్లిదండ్రుల భాగస్వామ్యం కార్యక్రమానికి ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి.






ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు యనమల రామ్మూర్తి నూతనంగా ఎన్నికైన విద్యార్థి కేబినెట్ సభ్యులకు ప్రత్యేక శుభాకాంక్షలు తెలియజేస్తూ, తమ బాధ్యతలను నిబద్ధతతో నిర్వహించి పాఠశాలకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో హెచ్ఆర్ సతీష్, ఆర్ఐ క్రాంతి, ఆర్ఎస్‌టీ యశ్వంత్, హైస్కూల్ కోఆర్డినేటర్ ప్రవీణ్, ఈ–ఛాంప్స్ కోఆర్డినేటర్ వినోద్, ఈ–కిడ్స్ కోఆర్డినేటర్ నీలిమ, ప్రధానోపాధ్యాయులు యనమల రామ్మూర్తి, అకడమిక్ డీన్ రామకృష్ణ, వైస్ ప్రిన్సిపల్ రమ్య, ఏవో. భరత్, పీఈటీ గోపిరాజ్, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

## బదిలీపై వెళ్తున్న అధికారులకు సన్మానం

చర్ల, జూలై 18:(ప్రజా జ్యోతి ):
మిషన్ భగీరథ భద్రాచలం సబ్‌డివిజన్‌లో విశిష్ట సేవలందించి బదిలీపై వెళ్తున్న డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ (డీఈఈ) పీ. ఏసుబాబు, ఇంట్రా ఏఈ వి. రాములకు చర్ల రైతు వేదికలో శనివారం ఘనంగా సన్మాన కార్యక్రమం నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన చర్ల మేజర్ గ్రామపంచాయతీ సర్పంచ్ పూజారి సామ్రాజ్యం మాట్లాడుతూ డీఈఈ పీ. ఏసుబాబు అందించిన సేవలను కొనియాడారు. ప్రజలకు నాణ్యమైన తాగునీటిని



అందించడంలో ఆయన విశేష కృషి చేశారని తెలిపారు.సన్మానానికి స్పందించిన డీఈఈ పీ. ఏసుబాబు మాట్లాడుతూ మిషన్ భగీరథ సిబ్బంది తనకు కుటుంబ సభ్యుల్లాంటివారని అందరూ అంకితభావంతో పనిచేశారని ఉద్యోగంలో చిన్నపాటి తప్పిదాలు సహజమేనని వాటిని సరిదిద్దుకుంటూ ఉన్నత స్థాయికి ఎదగాలని సూచించారు. ప్రతి ఒక్కరూ భవిష్యత్తులో మరింత ఉన్నత స్థానాలకు చేరుకోవాలని ఆకాంక్షించారు.ఇంట్రా ఏఈ వి. రాము మాట్లాడుతూ చర్లలో పనిచేసిన రోజులు జీవితాంతం గుర్తుండిపోతాయని సహోద్యోగులు, ప్రజాప్రతినిధులు, సిబ్బంది అందించిన సహకారానికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మిషన్ భగీరథ ఏఈ ఎం. అరుణ్ కుమార్, ఇంట్రా డీఈఈ రవితేజ, ఇంట్రా ఏఈ ఉపేందర్ (దుమ్ముగూడెం), ఇంట్రా ఏఈ నారాయణరావు (భద్రాచలం), ఇరిగేషన్ ఏఈ సంపత్, ఎంపీఓ మూర్తి, చర్ల ఉప సర్పంచ్ కాపుల కృష్ణార్జునరావు, సీనియర్ నాయకుడు కాపుల నాగరాజు, చర్ల మండలంలోని సర్పంచులు, ఉప సర్పంచులు, మండల కార్యదర్శులు, మిషన్ భగీరథ సిబ్బంది, ప్రజాప్రతినిధులు, మండల ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# ముఖ్యమంత్రి పర్యటన ఏర్పాట్లను పకడ్బందీగా చేపట్టాలి

**జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్**

**గోద్రెజ్ ఆయిల్ పామ్ ఫ్యాక్టరీని ప్రారంభించనున్న ముఖ్యమంత్రి**

**ప్రోటోకాల్‌కు అనుగుణంగా అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలి**

**మినిట్ టు మినిట్ కార్యక్రమ షెడ్యూల్‌ను ఖచ్చితంగా అమలు చేయాలి**

**వాహనాల రాకపోకలకు అంతరాయం లేకుండా పార్కింగ్ ప్రణాళిక రూపొందించాలి**

**అంజనాపురంలో ముఖ్యమంత్రి పర్యటన సభా ప్రాంగణాన్ని, హెలిప్యాడ్ ఏర్పాట్లను పరిశీలించిన జిల్లా కలెక్టర్**

ఖమ్మం ప్రతినిధి ప్రజా జ్యోతి
గోద్రెజ్ ఆయిల్ పామ్ ఫ్యాక్టరీ ప్రారంభోత్సవానికి రాష్ట్ర ముఖ్యమంత్రి ఖమ్మం జిల్లాకు విచ్చేయనున్న నేపథ్యంలో ఏర్పాట్లను పకడ్బందీగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ అధికారులను ఆదేశించారు.వైరా నియోజకవర్గం కొణిజెర్ల మండలం అంజనాపురం గ్రామంలో నూతనంగా నిర్మించిన గోద్రెజ్ ఆయిల్ పామ్ ఫ్యాక్టరీ ప్రారంభోత్సవానికి రాష్ట్ర ముఖ్యమంత్రి విచ్చేయనున్న సందర్భంగా పర్యటన ఏర్పాట్లు సభా ప్రాంగణం,హెలిప్యాడ్,పార్కింగ్ ప్రాంతాలు, ఇతర ఏర్పాట్లను జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ శనివారం పరిశీలించి గోద్రెజ్ ఆయిల్ పామ్ ఫ్యాక్టరీ, సంబంధిత శాఖల అధికారులకు పలు సూచనలు, ఆదేశాలు జారీ చేశారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ మాట్లాడుతూ కార్యక్రమంలో ప్రోటోకాల్‌కు అనుగుణంగా సీటింగ్ ఏర్పాట్లు చేయాలని, ప్రతి గ్యాలరీకి స్పష్టమైన గుర్తింపు బోర్డులు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. మీడియా ప్రతినిధుల కోసం ప్రత్యేక గ్యాలరీ ఏర్పాటు చేయాలని, వీఐపీ పాస్‌లను అవసరానికి మించి జారీ చేయరాదని స్పష్టం చేశారు. సభా వేదికను సుమారు 100 మంది బరువును తట్టుకునే విధంగా నిర్మించాలని, అయితే ప్రోటోకాల్ ప్రకారం డయాస్‌పై సీట్లు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. మినిట్ టు మినిట్ కార్యక్రమ షెడ్యూల్ ను ముందుగానే సిద్ధం చేసి, ప్రతి శాఖ అదే ప్రకారం బాధ్యతలు నిర్వహించేలా చూడాలని సూచించారు.ముఖ్యమంత్రి పర్యటన సందర్భంగా పోలీసు శాఖ అత్యంత పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేయాలని,హెలిప్యాడ్,సభా ప్రాంగణం, రాకపోకల మార్గాలు,పార్కింగ్ ప్రాంతాల్లో కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేపట్టాలని ఆదేశించారు.మీడియా,అధికారులు,వీఐపీలువీవీఐపీలకు వేర్వేరు ప్రవేశ మార్గాలు ఏర్పాటు చేయాలని,సభా ప్రాంగణంలో అవసరమైన బారికేడింగ్‌ను పకడ్బందీగా పూర్తి చేయాలని కలెక్టర్ ఆదేశించారు. వాహనాల రాకపోకలకు ఎలాంటి అంతరాయం కలగకుండా ప్రభుత్వ వాహనాలు, వీఐపీ వాహనాలు, ఇతర వాహనాలకు వేర్వేరుగా పార్కింగ్ ప్రాంతాలు ఏర్పాటు చేయాలని సూచించారు.గోద్రెజ్ సంస్థ తరఫున కార్యక్రమంలో ప్రసంగించే ప్రతినిధి వివరాలను ముందు గానే ఖరారు చేసి సంబంధిత అధికారులకు తెలియజేయాలని కలెక్టర్ ఆదేశించారు.కార్యక్రమంలో ఆడియో,వీడియో ఏర్పాట్లలో ఎలాంటి లోపాలు ఉండకూడదని, గోద్రెజ్ ఆయిల్ పామ్ ఫ్యాక్టరీ వీడియోతో పాటు ప్రభుత్వ అభివృద్ధి కార్యక్రమాలకు సంబంధించిన వీడియోలను కార్యక్రమంలో ప్రదర్శించే అంశాన్ని రెవెన్యూ డివిజనల్ అధికారి తుది నిర్ణయం తీసుకోవాలని సూచించారు.ప్రారంభోత్సవ సభకు హాజరయ్యేవారందరికీ స్పష్టంగా కనిపించేలా అవసరమైన ఎల్ఈడీ స్క్రీన్లు ఏర్పాటు చేయాలని ఆదేశించారు.సభా ప్రాంగణంలో పారిశుద్ధ్య నిర్వహణను జిల్లా పంచాయతీ అధికారి నిరంతరం పర్యవేక్షించాలని, ముఖ్యమంత్రి, మంత్రులకు అందించే ఆహార నాణ్యతను ఆహార తనిఖీ అధికారి స్వయంగా తనిఖీ చేసి ధృవీకరించాలని ఆదేశించారు.కార్యక్రమానికి అవసరమైన సురక్షిత త్రాగునీటినీ ఆర్‌డబ్ల్యూఎస్ కార్యనిర్వాహక ఇంజనీర్ సమృద్ధిగా అందుబాటులో ఉంచాలని సూచించారు.ప్రోటోకాల్‌కు అనుగుణంగా వైద్యులు,పారామెడికల్ సిబ్బంది,అత్యవసర వైద్య బృందాలు, అంబులెన్స్‌లు, అవసరమైన వైద్య పరికరాలు సిద్ధంగా ఉండేలా జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు.కార్యక్రమం అంతటా నిరంతర విద్యుత్ సరఫరా ఉండేలా చర్యలు తీసుకోవాలని, విద్యుత్ అంతరాయం ఏర్పడకుండా తగినంత ఇంధనంతో స్టాండ్‌బై జనరేటర్లను కూడా సిద్ధంగా ఉంచాలని విద్యుత్ శాఖ అధికారులను ఆదేశించారు.

గోద్రెజ్ అగ్రోవెట్ సంస్థ ప్రతినిధులతో అన్ని శాఖల అధికారులు నిరంతరం సమన్వయం చేసుకుంటూ తమకు అప్పగించిన బాధ్యతలను వ్యక్తిగతంగా పర్యవేక్షించాలని కలెక్టర్ స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో ఖమ్మం రెవెన్యూ డివిజనల్ అధికారి శ్రీనివాస్, పోలీసు అధికారులు,ఆర్ అండ్ బి, జిల్లా మైనారిటీ సంక్షేమ అధికారి ముహమ్మద్ ముజాహిద్, డివైఎస్ఓ సునీల్ రెడ్డి, ఫుడ్ సేఫ్టీ అధికారి, డీపీఓ రాంబాబు, ఉద్యానవన శాఖ అధికారి అనిత, జిల్లా వైద్య,ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ రామారావు, వివిధ శాఖల జిల్లా అధికారులు, గోద్రెజ్ అగ్రోవెట్ సంస్థ ప్రతినిధులు పాల్గొన్నారు.





## ఓటర్ల సర్వే కు సహకరించిన చంద్రపురి కాలనీ రెసిడెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్

రంగారెడ్డి జూలై 18 (ప్రజాజ్యోతి): ఎల్బీనగర్ నియోజకవర్గం పరిధిలోని చంద్రపురి కాలనీలో ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ కార్యక్రమం అత్యంత వేగంగా నిర్వహించడం జరిగింది.సూపర్వైజర్ విక్రమ్,రాజేష్, మహేందర్ (ఏఆర్ఈఓ/ ఏఎంసి) ల నేతృత్వంలో బూత్ స్థాయి అధికారులు పిఎస్ నెంబర్ 162 బిఎల్ఓ వీమారెడ్డి, పిఎస్ నెంబర్ 160 బిఎల్ఓ ఎండి హమీద్,పిఎస్ నెంబర్ 161 బిఎల్ఓ సుమతి చంద్రపురి



కాలనీ రెసిడెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రతినిధులతో కలిసి కాలనీలో విస్తృతంగా పర్యటించారు. ఈ పర్యటనలో భాగంగా స్థానిక ప్రజల నుండి ఎన్యుమరేషన్ ఫార్మ్స్ స్వీకరణ కార్యక్రమం ముమ్మరంగా సాగింది. చంద్రపురి కాలనీ రెసిడెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రెసిడెంట్ సోమరెడ్డి,సెక్రెటరీ రాజశేఖర్ రెడ్డి,వారి కమిటీ బృందం ఈ కార్యక్రమానికి ఎంతో అద్భుతమైన సహాయ సహకారాలు అందించారు. అసోసియేషన్ కాలనీ వాసుల చొరవతో ఫార్మ్స్ సేకరణ ప్రక్రియ బ్రహ్మాండంగా,ఎలాంటి ఆటంకాలు లేకుండా సాగింది. నేడు కూడా ముమ్మరంగా సర్వే – ఈఆర్ఓ శ్రీ వికాస్ మహ తో ఆదేశాల మేరకు ఈ ప్రక్రియను మరింత వేగవంతం చేయడంలో కీలక ఆదేశాలు జారీ చేశారు. నేడు కూడా బిఎల్ఓలు అందరూ క్షేత్రస్థాయిలో (ఫీల్డ్‌లో) అందుబాటులో ఉండాలని ఆయన స్పష్టం చేశారు. అధికారుల విజ్ఞప్తి అసోసియేషన్లకు పిలుపు: చంద్రపురి కాలనీ అసోసియేషన్ అందించిన సహకారాన్ని స్ఫూర్తిగా తీసుకుని, ఎల్బీనగర్ నియోజకవర్గంలోని మిగిలిన అన్ని కాలనీల రెసిడెన్షియల్ వెల్ఫేర్ అసోసియేషన్స్ ప్రెసిడెంట్లు, సెక్రెటరీలు కూడా మా బూత్ స్థాయి అధికారులకు పూర్తి స్థాయిలో సహకరించాలని కోరడం జరిగింది.

## బుల్లెట్ ట్రైన్ కోసం భూ సేకరణ

మొదటిపేజీ తరువాయి..

ప్రభుత్వం ప్రజల కోసం పనిచేస్తుందని అనుకున్నాం. కానీ మీరు బ్లాక్ మెయిలర్‌లు ప్రజలను భయపెట్టడానికి వచ్చిన హైడ్రా అంటూ విరుచుకుపడ్డారు. బహదూర్‌గూడా భూములపై స్టాటస్‌కో ఉంది కాబట్టి జిల్లా కలెక్టర్ కోర్టు అనుమతి లేకుండా భూముల జోలికి వస్తే ఊరుకునేది లేదని ప్రజాక్షేత్రంలో నిలబెడతామని అన్నారు. రంగారెడ్డి జిల్లా శంషాబాద్ మండలం బహదూర్‌గూడలో చేపట్టిన రైతు నిరసన ఐదో రోజుకు చేరింది. రైతులకు ఈరోజు మద్దతుగా బీఆర్ఎస్ పార్టీ రాజేందర్ నగర్ ఇంచార్జ్ పట్ల




కార్తీక్ రెడ్డి నిలబడ్డారు. బహదూర్ గూడ లోని వ్యవసాయ పొలాలని తరతరాలుగా సాగు చేసుకుంటూ వస్తున్న ప్రజలకు బులెట్ ట్రైన్ పేరుతో లాక్కోవాలని చూస్తుంది. కానీ ముమ్మాటికి రైతుల పక్షాన ఉండి పోరాడుతాం, ఎక్కడికైనా వెళతాం కానీ రైతుల భూములను లాక్కునే ప్రసక్తి లేదంటూ ప్రభుత్వానికి సవాల్ విసిరారు. భూముల రైతులను పిలిచి బెదిరించి భూములను తీసుకునే ప్రయత్నం చేస్తున్నారని తెలిసింది. కానీ బీఆర్ఎస్ పార్టీ రైతుల పక్షాన నిలబడుతుందని ఎట్టి పరిస్థితుల్లో రైతులకు అన్యాయం జరగకుండా చూస్తామని రైతులకు హామీ ఇచ్చారు. రానున్న 2 సంవత్సరాల్లో కెసిఆర్ ప్రభుత్వం రాబోతుంది కాబట్టి బహదూర్ గూడా రైతులు ఎట్టి పరిస్థితుల్లో ఆందోళన చెందొద్దని అందరికీ కెసిఆర్ చేతుల మీదుగా పట్టా, పాసు పుస్తకాలు ఇప్పిస్తామని హామీ ఇచ్చారు.
బహదూర్‌గూడలో మరోసారి ఉద్రిక్తత చోటు చేసుకుంది. ఇక్కడి ప్రభుత్వ భూమికి హైడ్రా అధికారులు ఫెన్సింగ్ వేయడంతో స్థానికులు ఆందోళనకు దిగారు. భూములు సాగు చేసుకుంటున్న తమకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. ఈ క్రమంలో ఉద్రిక్తత చోటు చేసుకుంది. ఆందోళనకారులు పోలీసులపైకి కారం చల్లి, కుర్చీలు విసిరేశారు. డీసీపీ యోగేశ్ గౌతమ్‌తో సహా పలువురు సీఐల కళ్లలో కారం పడింది. ఈ క్రమంలో రైతులకు మద్దతిస్తున్న నేతలను పోలీసులు అరెస్టు చేశారు. పోలీసులపై కారం చల్లి, కుర్చీలు విసరడం సరికాదని డీసీపీ యోగేశ్ గౌతమ్ అన్నారు. ప్రభుత్వ భూమికి ఫెన్సింగ్ మాత్రమే వేస్తున్నామని, సాగులో ఉన్న పంటను పాడు చేయడం లేదని అన్నారు.

## వికసిత్ భారత్ శిక్ష అధిష్టాన్ బిల్లును వ్యతిరేకించాలి

రంగారెడ్డి జూలై18 (ప్రజాజ్యోతి) రేపటినుండి నిర్వహించబోయే పార్లమెంటు సమావేశాల్లో కేంద్ర ప్రభుత్వం విద్యారంగ విధానానికి వ్యతిరేకంగా, సమైక్య స్ఫూర్తికి విరుద్ధంగా,రాష్ట్రాల హక్కులను కాలరాసే వికసిత్ భారత్ శిక్షా అధిష్ఠాన్ బిల్లు(2025) పార్లమెంట్ లో వ్యతిరేకించాలని కోరుతూ రాజ్యసభ సభ్యులు మందాడి అనిల్ కుమార్ యాదవ్ కు వినతి పత్రం సమర్పించడం జరిగింది.హైదరాబాద్ జిల్లా



అధ్యక్ష,కార్యదర్శిలు అనిల్ కుమార్,మెట్టెల చైతన్య యాదవ్ లు,మాట్లాడుతూ వికసిత్ భారత్ శిక్షా అధిష్ఠాన్ బిల్లు 2025ను ఏఐఎస్ఎఫ్ తీవ్రంగా వ్యతిరేకిస్తుందని,ఈ బిల్లు రాజ్యాంగ పరిమితులను ఉల్లంఘిస్తూ కేంద్రరాష్ట్రాల మధ్య ఫెడరల్ (సమాఖ్య) విధానాన్ని బలహీనపరుస్తుంది, సంస్థాగత స్వయం ప్రతిపత్తిని దెబ్బతీస్తుంది. ఉన్నత విద్య యొక్క ప్రజాస్వామ్య మరియు సమగ్ర స్వభావాన్ని ముప్పులోకి తీసుకువస్తూ, విద్యార్థులు, ఉపాధ్యాయుల ప్రజాస్వామ్య హక్కులపై ప్రభావాలను చూపుతుంది.
దేశంలో ఉన్నత విద్యారంగ నియంత్రణ సంస్థలైన యూనివర్సిటీ గ్రాండ్ కమిషన్ (యుజిసి),ఆల్ ఇండియా కౌన్సిల్ ఫర్ టెక్నాలజీ ఎడ్యుకేషన్ (ఏఐసిటిఈ), నేషనల్ కౌన్సిల్ ఫర్ టీచర్ ఎడ్యుకేషన్ (ఎన్సిటిఈ) స్థానంలో ఒకే ఒక సర్వోన్నత సంస్థగా విబిఎస్ఏ ను ఏర్పాటు చేయాలని ఈ బిల్లు ప్రతిపాదిస్తు విద్య రంగాన్ని నిర్వీర్యం చేసే కుట్రగా ఈ బిల్లు ఉందని,విద్యా నియంత్రణ సంస్థలు కేవలం ప్రభుత్వంలో ఒక భాగంగా మారిపోతాయని, వర్సిటీల స్వయంప్రతిపత్తి పూర్తిగా దెబ్బతిం టుందని,బిల్లు ద్వారా ఉన్నత విద్యపై రాష్ట్రాలకు ఉన్న హక్కులను కేంద్రం లాక్కుంటోందని,విబి ఎస్ఏ నియంత్రణలోకి వస్తే విద్యారంగానికి స్వయంకృతప్రత్తిపతి ఎక్కడుంటుందని,
రాష్ట్ర విశ్వవిద్యాలయాల స్వయం ప్రతిపత్తికి భంగం కలిగించేలా ఈ బిల్లు ప్రతిపాదనలు ఉన్నాయని ఇది పూర్తిగా ప్రభుత్వ విద్యారంగ బలోపేతానికి పూర్తిగా వ్యతిరేకంగా ఉందని ఇప్పటికే ఈ బిల్లును విపక్ష పార్టీలతోపాటు, బిజెపి కూటమి పార్టీలు కూడా విబిఎస్ఏ బిల్లును వ్యతిరేకించాయని, ప్రతిపాదిత బిల్లులో పై రాజ్యసభ పార్లమెంట్లో మాట్లాడి బిల్లును అడ్డుకోవాలని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ , ఉస్మానియా యూనివర్సిటీ అధ్యక్షుడు ఉప్పల ఉదయ్ కుమార్, రాష్ట్ర సమితి సభ్యులు రామగల్ల నరేష్, జోసఫ్ భాను, గోపగోని ఉదయ్ కుమార్, అవినాష్, భరత్ తదితరులు పాల్గొన్నారు.

## వర్షాభావ పరిస్థితులను ఎ దుర్కొనేందుకు శాఖల వా రీగా సమగ్ర కార్యాచరణతో సిద్ధంగా ఉండాలి

### రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్య దర్శి సంజయ్ జాజు

ఆదిలాబాద్ బ్యూరో, జూలై 18, (ప్రజా జ్యోతి) ఎల్ నినో ప్రభావంతో రా ష్ట్రంలో నెలకొనే వర్షాభావ పరిస్థితు లను సమర్థవం తంగా ఎదుర్కొనేందుకు అ న్ని శాఖలు ముందస్తు ప్రణా ళికలతో సిద్ధంగా ఉండాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్య దర్శి సంజయ్ జాజు అధికా రులను ఆదేశించారు. శని వారం హైదరాబాద్ నుంచి రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్య దర్శి



సంజయ్ జాజు, వివిధ శాఖల ఉన్నతాధికారులతో కలిసి అన్ని జిల్లాల కలెక్టర్ల తో వీడియో కాన్ఫరెన్స్ ని ర్వహించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లా కలెక్టర్ రాజర్షి షా కలెక్టరేట్ నుంచి పాల్గొన్నారు.ఈ సందర్భం గా ప్రధాన కార్యదర్శి మాట్లా డుతూ, ఎల్ నినో ప్రభావం కారణంగా రాష్ట్రంలో సాధా రణం కంటే తక్కువ వర్షపా తం నమోదయ్యే అవకాశం ఉన్నందున అధికారులు అ ప్రమత్తంగా ఉండాలని సూ చించారు. వ్యవసాయం, తాగునీటి సరఫరా, పశు సంవర్ధక, గ్రామీణాభి వృద్ధి, భూగర్భ జలాల సంరక్షణ తదితర శాఖలు సమన్వ యంతో పనిచేస్తూ వర్షాభా వ ప్రభావాన్ని తగ్గించే చర్య లు చేపట్టాలని ఆదేశించా రు. రైతులకు విస్తృత స్థా యిలో అవగాహన కల్పించి, తక్కువ నీటితో సాగు చేయ గల పంటల వైపు మళ్లేలా చర్యలు తీసుకోవాలని సూ చించారు. పంటల మార్పిడి విధానాలను ప్రోత్సహించ డంతో పాటు ప్రత్యామ్నా య సాగు పద్ధతులపై వ్యవ సాయ శాఖ అధికారులు గ్రా మస్థాయిలో అవగాహన కార్యక్రమాలు నిర్వహించా లని తెలిపారు. జిల్లా ఇన్ చార్జి మంత్రులు, ప్రత్యేక అ ధికారులు నిర్వహించే సమీ క్ష సమావేశాలకు సంబం ధిత శాఖలు వర్షపాతం, సా గు పరిస్థితులు, తాగునీటి లభ్యత, జలవనరులు, వ్య వసాయం, ఉపాధి హామీ, ఇతర శాఖల వారీ కార్యా చ రణ ప్రణాళికలతో కూడిన సమగ్ర నివేదికలను సిద్ధం చే సుకోవాలని ఆదేశించారు. వీడియో కాన్ఫరెన్స్ అనం తరం జిల్లా కలెక్టర్ రాజర్షి షా అధికా రులతో మాట్లాడు తూ, జిల్లా పరిస్థితులపై శా ఖల వారీగా పూర్తి సమాచా రంతో సిద్ధంగా ఉండాలని, ప్రభుత్వం నిర్వహించే సమీ క్ష సమావేశాలకు సమగ్ర ని వేదికలు సమర్పించేలా చ ర్యలు తీసుకోవాలని సూ చించారు. ప్రజలకు ఎలాం టి ఇబ్బందులు తలెత్తకుం డా ముందస్తు కార్యాచరణ ను సమర్థవంతంగా అమ లు చేయాలని అధికారుల ను ఆదేశించారు. ఈ వీడి యో కాన్ఫరెన్స్ లో అదనపు కలెక్టర్లు ఆర్.ఎస్.చిత్రూ, రా జేశ్వర్, డిఆర్డీఓ రవీందర్, డిఏఓ రవీందర్ సింగ్, డిపి ఓ రమేష్, మున్సిపల్ కమి షనర్ జగదీశ్వర్, సంబంధి త శాఖల అధికారులు, తది తరులు పాల్గొన్నారు.

## భాజపా నేతల్లో ఎలాంటి విభేదాలు లేవు

మొదటిపేజీ తరువాయి..

ఎంపీ లక్ష్మణ్ మీడియాతో మాట్లాడారు. తెలంగాణలో భాజపాను అధికారంలోకి తీసుకురావడంపై చర్చించినట్లు తెలిపారు. భాజపాను అధికారంలోకి తెచ్చేందుకు తామంతా కలిసి పనిచేస్తామని వివరించారు. తెలంగాణలో అధికారంలోకి రావాలనే పట్టుదలతో ఉన్న బీజేపీ.. ఆ దిశగా



అడుగులు వేస్తోందన్నారు. ఈ క్రమంలోనే నేతల మధ్య విభేదాలను తొలగించి.. అందరినీ ఒక తాటిపైకి తీసుకురావాలని ప్లాన్ చేస్తోంది. ఎంతో కాలంగా విభేదాలతో ఎడమొహం పెడమొహంగా ఉంటున్న కేంద్ర మంత్రి బండి సంజయ్, ఎంపీ ఈటల రాజేందర్ మధ్య సయోధ్య కుదిర్చారు. వీరిద్దరి మధ్య రాజీ కుదిర్చేందుకు రంగంలోకి దిగిన బీజేపీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌ఛార్జి అభయ్ పాటిల్.. నేడు ఈటల రాజేందర్, బండి సంజయ్‌తో సమావేశం నిర్వహించారు. ఎంపీ లక్ష్మణ్ నివాసం వేదికగా జరిగిన ఈ సమావేశంలో ఈటల, బండి మధ్య రాజీ కుదిర్చారు. విభేదాలు పక్కనపెట్టి.. తెలంగాణలో బీజేపీని అధికారంలోకి తీసుకువచ్చే దిశగా కృషి చేయాలని ఇద్దరు నేతలకు అభయ్ పాటిల్ దిశానిర్దేశం చేశారు. భేటీ అనంతరం మీడియా ముందుకు బీజేపీ నేతలు.. తమ మధ్య ఎలాంటి విభేదాలు లేవన్నారు. తెలంగాణలో అధికారంలోకి వచ్చేది బీజేపీనే అని ధీమా వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఎంపీ లక్ష్మణ్ మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం తీవ్ర విమర్శలు చేశారు. కాంగ్రెస్ తీరుతో ప్రజలు విసిగిపోయారన్నారు. ఎన్నికల వేళ ఇచ్చిన హామీలను కాంగ్రెస్ నెరవేర్చలేదని, కాంట్రాక్టర్లు ఆత్మహత్య చేసుకునే పరిస్థితి ఏర్పడిందంటూ ఎంపీ లక్ష్మణ్ మండిపడ్డారు. తెలంగాణ అభివృద్ధిపై మోదీ ప్రత్యేక చొరవ చూపారని, వచ్చే ఎన్నికల్లో తెలంగాణలో బీజేపీదే అధికారమని ఆయన ధీమా వ్యక్తం చేశారు. ప్రజలకు కాంగ్రెస్‌పై కోపం ఉందని, అలాగే బీఆర్ఎస్‌పై నమ్మకం లేదని తెలిపారు. వచ్చే ఎన్నికల నాటికి అసెంబ్లీ, లోక్‌సభ సీట్లు పెరుగుతాయని, జమిలి ఎన్నికలు జరుగుతాయన్న నమ్మకాన్ని వ్యక్తం చేశారు.

## హపన్న హస్తం కోసం ఎదురుచూపు

### గుబిడి గ్రామం లో కిడ్ని వ్యాధి తో బాధప డుతున్న పది ఏళ్ల బాలుడు హరీష్ దాతలు సహకరించండి .. ఆవేదన వ్యక్తం చేస్తున్న తల్లిదండ్రులు

ఆదిలాబాద్ టౌన్, జూలై 18( ప్రజా జ్యోతి ): రెండవ కుమారుడైన హరీష్ (10) కిడ్ని వ్యాధి తో బాధపడు తున్నాడు. తల్లి దండ్రులు వ్యవసాయ కుటుంబం మధ్యతర



గతి వారు కావడం తో తమ కుమారుడి చికిత్స కోసం చాలా ఖర్చు అవుతుందని డాక్టర్లు చెప్పారని, తమ కుమారుడు ప్రస్తుతం నిమ్స్ హాస్పిటల్ హైదరాబాద్ లో చికిత్స పొందుతు న్నరని దాతలు ఎవరైనా సహకరించి వారికి తోచిన ఆర్థిక సహాయం అందజేయాలని, మీ ఆర్థిక సహాయం మా కుమారుడి ప్రాణాల కు ఉపయోగపడుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. గతం లో కూడ వీరి పెద్ద కుమారుడు దేవిదాస్ కిడ్ని వ్యాధి తో బాధపడుతు మృతి చెందాడు. ఇప్పటికే భీంపూర్ మండలం లో కొందరు దాతలు చలించి ఆర్థిక సహాయం అందజేశారు. వీరి కుటుంబంలోనే రెండవ కుమారుడికి కూడ కిడ్ని వ్యాధి రావడం తో గ్రామస్తులు సానుభూతిని తెలియజేస్తూ, చలించి కొందరు ఆర్థిక సహాయం అందజేశారు. ఇంకా ఎవరైనా దాతలు కానీ, రాజకీయ నాయకులు కానీ ఆర్థిక సహాయం చేయదలుచుకు నేవారు సాక్ పెల్లి దేవన్న. 9390271835 నంబర్ కు గూగుల్ ప్లే, ఫోన్ పే చేయాలనీ మీరు చేసే సహాయం మేము మరువలేనిది అని తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం కూడా మా బాలుడి పరిస్థితి అర్థం చేసుకొని చికిత్స కోసం సహాయం చేయాలని వారు వేడుకున్నారు. ఏది ఏమైనా పేద, మధ్య తరగతి వారికి ఆరోగ్య సమస్యలు వస్తే చాలా కష్టమని, ఆరోగ్యం పట్ల ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని డాక్టర్లు వెల్లడిస్తున్నారు.

**దత్తు ( ప్రజా జ్యోతి) అదిలాబాద్, టౌన్**

## ఎల్‌నినో ప్రభావంతో విద్యుత్ కొరత రావద్దు

మొదటిపేజీ తరువాయి..

విద్యుత్ అందించడం మా ప్రభుత్వ ప్రధాన లక్ష్యం. విద్యుత్ పంపిణీ వ్యవస్థలో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ వినియోగాన్ని విస్తరించడం, రాష్ట్రవ్యాప్తంగా 'పవర్ అంబులెన్స్' సేవలను బలోపేతం చేయడం, అంగన్‌వాడీ కేంద్రాలకు దశలవారీగా సోలార్ విద్యుత్ సదుపాయం కల్పించడం, ఐటీ కారిడార్‌లో అవసరమైన చోట్ల ÷÷–లఓల్గ÷వర్ల కింద సబ్‌స్టేషన్ల ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క స్పష్టం చేశారు. అదే విధంగా, తెలంగాణ భవిష్యత్ ఇంధన అవసరాలను దృష్టిలో ఉంచుకుని సింగరేణి కొత్త బొగ్గు బ్లాక్‌ల సాధన, తాడిచర్ల-2 బ్లాక్‌లో నిర్ణీత గడువులో ఉత్పత్తి ప్రారంభం, కోయగూడెం3, సత్తుపల్లి3 బ్లాక్‌లను సింగరేణికి దక్కేలా కార్యాచరణ వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించారు. రాష్ట్ర ఇంధన భద్రతను మరింత బలోపేతం చేస్తూ ప్రతి రంగానికి విశ్వసనీయ విద్యుత్ అందించేందుకు ప్రజా ప్రభుత్వం కట్టుబడి ఉందని భట్టి అన్నారు.



## ప్రజాకవికి అపూర్వ గౌరవం ఇచ్చాము

### అందెశ్రీ కుటుంబానికి వాగ్దానాలన్నీ నెరవేర్చాం 'అందెశ్రీ స్మృతి వనం' శంకుస్థాపనలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క

హైదరాబాద్,జూలై18(ప్రజాజ్యోతి): ప్రత్యేక తెలంగాణ ఉద్యమ సాంస్కృతిక సారథి, ప్రజాకవి డాక్టర్ అందెశ్రీకి తమ ప్రభుత్వం అపూర్వ గౌరవం ఇచ్చిందని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క స్పష్టం చేశారు.
మేడ్చల్ జిల్లా ఘట్కేసర్‌లో అందెశ్రీ అంతిమ సంస్కారాలు జరిగిన ప్రదేశంలో 'అందెశ్రీ స్మృతి వనం' ఏర్పాటుకు, అలాగే ఆయన విగ్రహ ప్రతిష్ఠాపనకు జయంతి రోజైన శుక్రవారం నాడు ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డితో కలిసి ఉప ముఖ్యమంత్రి భూమి పూజ చేసి, పునాది రాయి వేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన బహిరంగ సభలో భట్టి విక్రమార్క మాట్లాడుతూ... సాధారణంగా నాయకులు లేదా ప్రభుత్వాలు ఒక కార్యక్రమం చేసి ఆ తర్వాత వదిలేస్తుంటాయని, కానీ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం అలా కాదని, ఇచ్చిన ప్రతి మాటను నిలబెట్టుకుంటుందని చాటిచెప్పారు. అందెశ్రీ దివంగతులైన వేళ, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్వయంగా ఆయన పాడె మోసి ఒక కవికి ఇవ్వాల్సిన అపూర్వమైన నివాళిని అర్పించి, తమకున్న గౌరవాన్ని చాటారని గుర్తు చేశారు. ఒక నిరుపేద దళిత కుటుంబంలో పెరిగి, రాష్ట్రం కోసం తపించిన ప్రజా గాయకుడికి ఈ ప్రభుత్వం సముచిత మర్యాదను అందించిందన్నారు. ఆనాడు అందెశ్రీ అంత్యక్రియల సమయంలో ఆయన కుటుంబానికి ప్రభుత్వం ఏ ఐదు వాగ్దానాలనైతే ఇచ్చిందో, వాటిని




మరచిపోకుండా, నేడు స్మృతివనానికి భూమి పూజ చేసే సమయానికే వాటన్నింటినీ నెరవేర్చిన ప్రజా ప్రభుత్వంగా నిలిచామన్నారు.
అందెశ్రీ కుటుంబాన్ని ఆదుకునేందుకు ఇచ్చిన మాట ప్రకారం ఆయన కుమారుడు దత్తుకు బి.జె.ఆర్. డిగ్రీ కళాశాలలో ఉపన్యాసకుడిగా (లెక్చరర్) ప్రభుత్వ ఉద్యోగాన్ని కల్పించామని తెలిపారు. అలాగే అందెశ్రీ రచించిన ప్రసిద్ధ కవితా సంకలనం 'నిప్పుల వాగు' 20 వేల కాపీలను ప్రభుత్వ పరంగా ముద్రించి పంపిణీ చేసేందుకు విద్యాశాఖకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేసి, ఆ పనులను పురోగతిలో పెట్టామన్నారు. ఆయన అంతిమ సంస్కారాలు జరిగిన ప్రదేశాన్ని స్మృతి వనంగా మారుస్తామని చెప్పిన విధంగానే నేడు ముఖ్యమంత్రి తో కలిసి భూమి పూజ నిర్వహించడంతో పాటు, అందెశ్రీకి పద్మశ్రీ అవార్డు ఇవ్వాల్సిందిగా కేంద్ర ప్రభుత్వానికి రాష్ట్ర ప్రభుత్వం తరపున అధికారికంగా సిఫార్సు కూడా చేయడం జరిగిందని వివరించారు. నాడు ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావం కోసం ప్రతి ఒక్కరినీ కదిలించిన అందెశ్రీ కలం నుంచి జాలువారిన 'జయ జయహే తెలంగాణ' పాటను అధికారిక రాష్ట్ర గీతంగా ప్రకటించిన విషయాన్ని ఈ సందర్భంగా గుర్తు చేశారు. రాష్ట్రవ్యాప్తంగా అధికారికంగా ఏ కార్యక్రమం జరిగినా ఈ పాటను వినేలా మరియు వినిపించేలా ప్రభుత్వం నిర్ణయించి అమలు చేస్తున్నదని వివరించారు. 'మాయమై పోతున్నాడమ్మా మనిషన్నవాడు అనే పాట ద్వారా మానవత్వం గురించి, సమాజం పట్ల మనిషి, నాయకులు ఏ రకంగా నడుచుకోవాలో యావత్ ప్రపంచానికి తెలియజేసిన మహనీయుడు అందెశ్రీ. ఆయన జీవితాన్ని, ఆలోచనలను, సాహిత్య సంపదను ఆదర్శంగా తీసుకుని భవిష్యత్ తరాలకు అందించాల్సిన బాధ్యత మనందరిపై ఉందని పిలుపునిచ్చారు.

Printed and Published by V. SRINIVAS REDDY on behalf of M/S SAI KRISHNA PUBLICATIONS Owned by M/S SAI KRISHNA PUBLICATIONS Printed at Sree Seshasai Enterprises, Plot No. 98/1, Co-operative Industrial Estate, IDA, Gandhinagar, Quthbullapur Mandal, Medchal-Malkajgiri Dist, Telangana. Published at H.No. 1-2-79/4/A, Shanthi Nagar, Adilabad, Adilabad Dist, Telangana. Editor: V. SRINIVAS REDDY, RNI No. TELTEL/2008/24799, Ph No: 9440231967